ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

24-8-55

ANDHRA PATRIKA ILLUSTRATED



ఇంటిదోవ

—ఫొటో: జె. వి. శివరామశాస్త్రి, హాలాహర్వి.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 51
24.8-55

మన్మథ అధిక భాద్రపద శుద్ధ సప్తమి బుధవారం



ఆగస్టు 15 గోవా సత్యాగ్రహంలో
అసువు లర్పించిన బెజవాడ విద్యార్థి
సూరి సీతారామం

ముఖచిత్రం:
"కుందన్" చిత్రంలో నిమ్మీ

విషయానుక్రమణిక

సిరిదావచ్చినవచ్చును....!

ప్రతి మానవుడూ అందరికీ మంచిగా వుండి, తనజీవితాన్ని రాజయోగంగా జరిపించుకోవాలని ఆశిస్తాడు. కాని అవకాశం దొరికినప్పుడు తప్పుల్లో కలుతొక్కినైనా, నలుగురిలో గొప్పవాడయి తన ఆశయాలు నెరవేర్చుకోడానికి వెనుదీయడు.

అవి అభ్రకం గనుల మొదటిరోజులు. అభ్రకము దొరుకుతుందనే అనుమానమున్న చోటల్లా గని ప్రారంభించేవాళ్లు. మావూళ్లో రామచంద్రయ్యగూడా యీ వ్యాపారం చేస్తూండేవాడు. ఒకనాడు ఆయన రాత్రికి రాత్రి ఒకముఠాను వెంటేసుకుని మావూరికి రెండుమైళ్లి దూరంలోవుండే ఒక మైకామైన్ చేరాడు. ఆరోజాయన కెందుకు బుట్టిందో యీపాడుబుద్ధి... దొంగతనంగా మైకా తీసుకుపోవాలని వచ్చాడు. గని ద్వారంలో గూర్ఖా కునుకులో వున్నాడు. దొంగతనంలో పేరుగాంచిన నక్కల సుబ్బడు రామచంద్రయ్యతో వుండనే వున్నాడు. ముఠా అంతా లోపలదిగారు. చడీచప్పుడు గాకుండా ఒక్కొక్కరు ఒక్కొక్క మూట అభ్రకంలో గనిలోంచి బయటికి వచ్చి కాలికి బుద్ధిచెప్పారు. తెల్లవారకమునుపే నక్కల సుబ్బడి బృందము వారి వాటాలతో వెళ్లారు.

అనుకున్న కార్యము అవిఘ్నంగా నెరవేరడంతో రామచంద్రయ్య బుర్ర హుషారుగా పనిచేయడం మొదలెట్టింది. తనకెందుకూ పనికిరాని బీడు నాలుగెకరాలుంది. దాన్ని ఎవరికమ్మదామన్నా "నువ్వూరికే యిచ్చినా మా కొద్దయ్యా" అంటున్నారు. ఆఖరున "నాలుగెకరాలు నాలుగొందలకిస్తానన్నా బందపైన దమ్మిడీగూడా యివ్వనన్నాడు" ఒకడు. రామచంద్రయ్యకు యిప్పుడు ఓ చక్కటి ఆలోచన తట్టింది. "యీరోజు తెచ్చిన మైకా అక్కడ పాతిపెట్టే"... నక్కల సుబ్బడితో సంప్రతింపులు జరిపి ఆరాత్రే తన బీడుభూమిలో విలువు లోతున త్రవ్వి ఆమైకాను పైవరకు పాతిపెట్టి చక్కా వచ్చాడు.

కొద్దిగా వర్షాలొచ్చాయి. పైమన్ను కొ[illegible]పోవడంతో పాతిపెట్టిన మైకా కొం[illegible]చెం పైకగుపిస్తూంది. అందరికంటే ము[illegible] రామచంద్రయ్య వెళ్లి చెట్టా ఓ విషయ[illegible]. నలుగురూ రామచంద్రయ్యకు పట్టిన అదృష్టానికి పైకి సంతోషించినా లోపల కుళ్లుకున్నారు. "ఆరోజు నాలుగొందలకూ తీసుకోకపోతినే" అని చాలమంది బాధపడ్డారు.

గూడూరులోవుండే గురునాధరెడ్డి అప్పటివరకూ వ్యవసాయంమీదే యావత్తే వేలదాకా మూటగట్టి గుట్టుగా సంసారం చేస్తున్నాడు. ఆయన కెప్పుడూ మైకా వ్యాపారం చేయాలన్న ఆసక్తి పుట్టలేదు. మావూరి మునసబు చెల్లెలు గురునాధరెడ్డి భార్యగాబట్టి అప్పుడప్పుడూ వచ్చి వెళ్తూండేవాడు. యీసారి గురునాధరెడ్డి రాక మైకా వ్యాపారంమీద ఆశపుట్టించింది.

ఆర్.వి.జి. కృష్ణమూర్తి

రామచంద్రయ్యతో మాట్లాడి ఆ నాలుగెకరాలు తనకు పరిష్కారం చెయ్యమన్నాడు. చెట్టుసరికి రామచంద్రయ్య యివ్వనంటే యివ్వనన్నాడు. తనే రేపు విజయదశమికి గని ప్రారంభిస్తానన్నాడు. దీన్తో గురునాధరెడ్డికి ఎలాగైనా ఆస్థలం కొని విజయదశమినాటికి ప్రారంభోత్సవం చేయాలని పట్టుదల కలిగింది. ఎలాగైతేనేం, ఆ వూళ్లోవాళ్లంతా చెప్పబట్టి "ఎకరా రెండువేలవంతున నాలుగెకరాలూ ఎనిమిది వేలకయితే యిస్తాను. అంతకు కానీ తగ్గించను. తర్వాత మీ యిష్టం" అని వెళ్ళిపోయాడు రామచంద్రయ్య.

ఇంట్లో కాలెడుతూండగానే తన పెద్ద బావమరిది జగన్నాధం వచ్చాడని తెలుసుకుని తనకు తగలబోయే 'లక్కీ ఛాన్సు'ని గురించి చెప్పబోతున్నాడు రామచంద్రయ్య. యీమాట వినేటప్పటికి, తాను సంపాదించింది ఏమీ లేకపోయినా, పిత్రార్జితాన్ని యింకా తగలేయని జగన్నాధం మైకా వ్యాపారంపై మోజుపడ్డాడు. పాపం! అసలు విషయం తెలీదుగా! "బావా. పదివేలు నేను యిస్తాను. దాన్ని నాకే పరిష్కారం చేయి" అన్నాడు ఆశగా. రామచంద్రయ్య తడబడ్డాడు. ఒకవేళ తాను యిస్తే బావమరది నాశనమైపోతాడు. అసలు విషయం చెప్తే... అబ్బో! చీమకైనా తెలియగూడదు!! అనుకున్నాడు. "నీ కక్కర్లేదులేబావా" అని మాత్రం అనగలిగాడు.

రామచంద్రయ్య బుర్రలోకి ఎవరో పాదరసం ఇంజెక్షన్ చేసినట్లైంది. దొరికిన ప్రతి అవకాశాన్ని వృధాగా పోనియడం లేదు. మొదట మైకా దొంగిలించింది ఒక వుద్దేశ్యంతో. కాని దాన్ని విధంగా వుపయోగించదలచింది తర్వాతనే. తాను మోసం చేస్తున్నాడు. యీ మోసంతోనే తన ఆశయాలు నెరవేరాలి. తన బావమరిదికి దీనిమీద మోజు కలుగుతుందనుకోలేదు. కాని అతను దీని రేటు యింకా రెండువేలు పెంచి పదివేలు చేశాడు. యీ అవకాశాన్నిమాత్రం ఎందుకు వుపయోగించకూడదూ—

ఆ దారినే వెంకటప్పయ్య పంతులు పోతూండడం గమనించి వారితో "అసలు విషయం తప్ప" మిగతాదంతా చెప్పాడు. "నువ్వెంత అదృష్టవంతుడివిరా" అన్నాడు పంతులు.

"అదికాదు పంతులూ. యిప్పుడు మా జగన్నాధం చూశావూ, అదే భూమికి పదివేలిస్తానంటున్నాడు. మరి నేను, గురునాధరెడ్డికి ఎనిమిది వేలకే మాటిచ్చాను. ఇప్పుడు జగన్నాధానికివ్వకపోతే బంధువుల్లో మనస్పర్థలూ వస్తాయి, డబ్బుకూ డబ్బూ పోతుంది. ఎలా చెయ్యాలో చెప్పు" అన్నాడు.

"ఇదిగో అబ్బాయ్. ఈ విషయం నేను

★ సిరి దావచ్చిన వచ్చును...! ★

గురునాథరెడ్డితో గూడా చెపుతా. ఆపైన కాలిష్టం" అని లేచాడు పంతులు.

"మీదయ పంతులుగారూ. పని పండైతే నూరు రూపాయలు బహుమానం" అన్నాడు రామచంద్రయ్య.

"నాకు తెలీదుటోయ్ నీ తెంపు. ఒక్క మాటేమిటి. నోరు తెరిచి అడిగితే వెయ్యి రూపాయలైనా విసిరి ఎడమ చేత్తో పారేసే స్వభావం గదుటోయ్ నీదీ. నాకు తెలీదూ! మీ తాతపోలికే గాకుండా గుణాలుగూడా వచ్చాయిరా నీకు" అంటూ నేరుగా మునసబు గారింటికెళ్లాడు పంతులు. గురునాథ రెడ్డి గారితో యీ విషయం కదిలించి తన రాయబారాన్ని గూడా కక్కేశాడు. గురునాథ రెడ్డి ముఖంలో కోపం, పట్టుదల పుట్టి పడుతున్నాయి.

"సరే. కానీమను పంతులూ. మొత్తానికి పదిహేను వేలూ యిచ్చేస్తాను. అగ్రిమెంటు వ్రాసుకుందాం. నీవుపోయి అంతా రైట్ చేసుకురా. పని పండైతే వంద రూపాయలు బహుమానం నీకు" అన్నాడు

"అహహా. డబ్బు శాశ్వత మటండీ. తమ దయవుండాలిగాని, వంకేమిటి, వేలు రావూ అదృష్టం కలిసొస్తే..." అంటూ పంతులు ఒక్క చిటుక ఘాటుగా పీల్చి రామచంద్రయ్యతో మాట్లాడేందుకు బయలుదేరాడు. సంగతి వినగానే రామచంద్రయ్య ముఖం చేటంతయింది.

రాతకోతలయ్యాయి. విజయదశమికి అనుకున్నట్టుగానే గని ప్రారంభించారు. మొదటి రెండురోజులూ సరుకు వస్తూందంటే వస్తూందన్నారు అంతానూ. రామచంద్రయ్య పెళ్లాంబిడ్డలతో సహా మొహంతప్పించి పెదనాన్నగారూరెళ్లాడు. పాతిపెట్టిన మైకానంతా తీశారు. బాగానే వుంది 'క్వాలిటీ' అన్నారు అనుభవజ్ఞులు. మరునాటినుంచి మట్టితప్ప మరేమీ లేదు. దిగాలు పడ్డాడు గురునాథరెడ్డి.

"అదేమిటయ్యా. అప్పుడే దిగులుపడతావూ. బాగా లోతుకు దిగందే ఎట్లా వస్తుంది" అన్నారు అనుభవజ్ఞులు. పని జోరుగా జరిగిపోతూంది. ఒకనాడు నిజంగానే మైకా కనబడింది. ఆరోజు మొదలు ప్రతిదినం కుప్పలు తిప్పలుగా రావడం మొదలెట్టింది అభ్రకం. సుమారు వెయ్యిమంది కూలీలు రాత్రీ, పగలూ పనిచేస్తున్నారు. గనివుంటే ప్రదేశం ఒక వూరైపోయింది.

రామచంద్రయ్య తిరిగి స్వగ్రామం వస్తుండగానే గురునాథరెడ్డి అదృష్టానికి అందరికంటే ముందు తానే ఆశ్చర్యపడిపోయాడు. అసూయతోబాటు దిగులుకూడా పట్టుకుంది. బావమరిది జగన్నాథం ఆ వూరికేదో పనివుండి వచ్చిగూడా తనింటికి రాకుండానే వెళ్ళాడు. గురునాథ రెడ్డిని తాను మోసం చేయాలనుకున్నాడు. కాని తన మోసమే యిప్పుడు గురునాథరెడ్డిని కోర్టులో తిప్పుతూంది. ఏడ్చాడు. తనెందుకేడవాలో తనకీ, నక్కల సుబ్బడి బృందానికీ తప్ప మరెవ్వరికీ తెలియదు. నాటి యిప్పుడా గనిలో మేస్త్రీ. రామచంద్రయ్య కేమీ పాలుపోవడం లేదు. పదిహేను వేలూ యిద్దరి కూతుళ్ల పెళ్లిఖర్చులకు అయిపోయాయి.

ఒకనాడు గురునాథరెడ్డివద్ద నిజం వెళ్లబెట్టి పెద్దగా ఏడవాలనుకున్నాడు.

"నా కంతా తెలుసునయ్యా. నక్కల సుబ్బయ్యేగా నీకా రాత్రి సాయపడింది" అన్నాడు.

"వాడు మీతో చెప్పాడా." అన్నాడు రామచంద్రయ్య.

"మొదట చెప్పలేదు. నిజంగా మైకా కనబడిన తర్వాతే చెప్పాడు. ఎలాగైతేనేం. నీ భూమిలో ఇప్పటికి అయిదు

(48-వ పేజీ చూడండి)



ఇద్దరమ్మాయిలూ – ముగ్గురబ్బాయిలూ

"ప్రేమ!" అని ఆశ్చర్యపోయాడు — హిందీ సినిమాని ఆంధ్ర ప్రేక్షకులకు అనువదించి పెడుతున్న దుబాసీ

"ప్రేమ అనగా ఏమి?" అని గంభీరంగా ఒక ప్రశ్న వేశాడు అతనే జవాబుకూడా చెప్పాడు "ప్రేమ అనగా రెండు హృదయములు ఒకే స్థాన వడుచుట!"

రూపాయిటిక్కెట్టుమీద కూచున్న వీర్రాజు పక్కనున్న రామూరావుని మోచేత్తో పొడిచాడు "మాశాపురా రాముడూ! ప్రేమ అనగా రెండు హృదయములు ఒకే పంథాన నడవడంట నీకూ మీ మావయ్యంటే అసహ్యం సీతకీ మీ మావయ్యంటే రోత అందుకనే నువ్వు సీతన చేసుకోవాలి" అన్నాడు

"సీతకేమన్నా నువ్వు లాయరువా ఏవిట్రా ప్రాణాలు తోడేస్తున్నావ్ విధవ సోదా నువ్వూను నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు నేను సుబ్బుల్ని తప్ప ఇంకొత్తిని చూడను' అన్నాడు రామూరావు

వెనకాల ప్రేక్షకులకి తెరమీద గాథపట్ల ఆసక్తి హెచ్చుగా ఉంది రాముడు అనే కుర్రవాడు సీత అనే చిన్నదాన్ని బదులు సుబ్బులు అనే పిల్లని పెళ్ళాడటం సబబా బేసబబా అనే మీమాంస ప్రేక్షకలోకం ఏమంత పట్టించుకోదలచలేదు అందుకని వెనకవారూ ముందువారూ, ఎడవారూ పెడవారూ కూడా 'ష్' అన్నారు సమర్యాదగా

తెరమీద కొత్త దృశ్యం వచ్చేసింది పూర్తిగా అంతకుముందే ఓ పిల్లదగ్గర చీవాట్లు తిన్న హీరో ఈ దృశ్యంలో ఇంకో పిల్లవెంట పడ్డాడు ఈవిడే అసలు హీరోయిన్

"ఏదైతేనేంలే అనుకున్నాడు పాపం" అన్నాడు దుబాసీ గంభీరంగా

"మాశాపురా రాముడూ ఏదైతేనేం అనుకున్నాడట పాపం - ఏం చేస్తాడు చెప్పు సుబ్బులైతేనేం సీతయితేనేం - అందుకని సీతనే చేసుకో మీ మావాం, మీ ఊళ్లో జనం సంతోషిస్తారు" అన్నాడు వీర్రాజు మళ్లీ

"మతేమైనా పోయిందా నీకు! సినిమా హాల్లో కూచుని ఇదేం గోలరా - తరిమేస్తారు"

"నీకు తెలీదురా సీత హృదయం నీకోసం సూర్యుడికోసం పద్మంలాగే మథన పడిపోతోంది ఒరేయ్ రావుడూ నల్లులు తెగ కుట్టేస్తున్నాయిరా"

"కాంప్లిమెంటరీగాడి వనుకున్నాయి గాబోలు అగ్గిపుల్ల వెలిగించి టిక్కెట్టు చూపించు పోతాయి" అన్నాడు రామూరావు సాఫీగా, తాపీగా

రామూరావు చలనచిత్ర పరిశ్రమకి మహారాజపోషకుడు సినిమా పత్రికలకి రాజపోషకుడు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పోషకుడు చిరకాల సాన్నిహిత్యంవల్ల చలనచిత్రపరిశ్రమని అర్థంచేసుకున్నవాడు సానుభూతిపరుడు పరేంగితజ్ఞుడు అందువల్లనే రూపాయిటిక్కెట్టు చూపిస్తే నల్లులు కుట్టవని అతనికి బాగా తెలుసు 'సినిమాలు-నల్లులు' అనే విషయం పైనా, 'సినిమాల్లో నల్లులు' అనే విషయంపైనా అతడు సమగ్ర పరిశోధనలు జరిపి ఒక సిద్ధాంతం తయారుచేశాడు సంగ్రహంగా దాని సారాంశం ఇది —

పూర్వం సినిమాహాలులో నేలటిక్కెట్లు ఉండేవి జనం చాపగుడ్డలూ గోనెబరకాలూ తెచ్చుకుని కూర్చునేవారు జంతికలూ, పకోడీలూ పులిహోర, మరచెంబులో మంచి నీళ్ళూ తెచ్చుకునేవారు ఆపైన, తాము

★ ముళ్లపూడి వెంకటరమణ ★



గరుడ ఖ్వార్ (బేలూరు శిల్పం)

ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

కూర్చున్న చోటుచుట్టూ శాయశక్తులా ఉమ్మివేసి ఒకకోటలా కట్టేవారు. దానివల్ల రద్దీ ఆట్టే ఉండేదికాదు. విశాలంగా కూర్చుని, బోలెడుగాలి పీలుస్తూ జంతికలు తింటూ ఊసులాడుకుంటూ జనం సినిమా చూసేవారు. అందువల్ల సైతరగతులు ఆట్టే నిండేవికావు. హాలుయజమానులూ, సినిమా పరిశ్రమవారూ ఇదిచూచి ఏమీబాగు లేదనుకున్నారు. ఇలా అయితే పరిశ్రమ అభివృద్ధికీ, దేశాభివృద్ధికీ డబ్బు చాలదన్నారు.

అందులో ఆరోజుల్లో సర్కారువారు రెండుదేశాలను పోషించి బాగుచేసే బాధ్యత వహించారు. అందుకని ఒక సమగ్రపథకం "ఆదాయాభివృద్ధి" పథకం వేయబడింది (పూర్వులకుకూడా పథకాలూ ప్రణాళికలూ వేయడం తెలుసునవడానికి ఇదొక నిదర్శనం. రా॥) సరే ఆ పథకం ప్రకారం నేల ఉన్నచోట్లో ఉత్తిబల్లలూ, ఇంతకాలం ఉత్తిబల్లలున్నచోట్లో జేరబడే బల్లలూ, ఆపైన చేతులాన్చుకుని మరీ జారబడేబల్లలూ వేశారు. అక్కడికి మూడణాల తరగతీ ఆరణాలదీ, తొమ్మిదణాలదీ అయిందా! ఇంక ముప్పావలా వారికి కుర్చీలూ, రూపాయివారికి పేముకుర్చీలూ వేశారు. ఈ పథకం జయప్రదం కావడానికి నల్లుల ప్రయోగం ప్రాతిపదిక. అమాటకొస్తే పథకం పేరేనల్లుల పథకం. నల్లబజారుమనిషికి పాఠాలు నేర్పి, నిష్ఠతో, భక్తిప్రపత్తులతో తలవాచ్చేటట్లు చేయగలిగినంత రక్తదాహంగల జమాజెట్టీలాంటి, శాండో పైల్వానులవంటి నల్లులను మూడణాల టిక్కెట్టు బల్లలలో పుష్కలంగా వదిలిపెట్టారు. వీటిపని (పేత్తుకుర్చీ తోడేని రకం పుచ్చుకుంటూ "పైతరగతులకు పొండి పొండి" అని వేధించడమే. ఆరణాల తరగతిలో లాంఛనానికి నల్లులు వేశారు. ఇవి కాలీగా వుండి మూడణాల (పేత్తుకుర్చీ) ఆహ్వానించడానికి ఉద్దేశింపబడ్డాయి (కొంచెం ఆట మొదలెట్టాక దర్జీమని పిటగోడ దాటి ఆరణాల ఆసనాలు అలంకరించకుండ)

పోతే తొమ్మిదణాలూ ముప్పావలా. ఈ తరగతులు చాలాముఖ్యమైనవి. ఈతరగతుల వల్ల హాలుయజమానులకన్నా చిత్రనిర్మాతలకూ, డిస్ట్రిబ్యూటర్లకూ, [illegible]కూ శ్రద్ధ ఎక్కువ. ఈ రెండింటినిండా మధ్యతరగతి మహారాజులూ యువరాజులూ కిక్కిరిసి కూచుంటారు. వీళ్లు తిన్నగా ఉండరు. సినిమాచూసి నోరుమూసుకుపోరు. కుడీ ఎడమా తెలుపూ నలుపూ, మంచీ చెడ్డా, స్వంతంగా ఆలోచిస్తారు. కథాకథనం "కుంటినడక" లోపాలూ, [illegible] "పప్పులో అడుగేసి"న సందర్భాలూ, [illegible] సన్నివేశాలూ "పేలవంగా" తయారైన సంభాషణలూ అసభ్యన్నతాలూ, వీళ్లు కనిపెట్టేసి పత్రికలకు అభిప్రాయాలు రాసేస్తారు. దానివల్ల ఆరునెలలు ఆడే చిత్రం ఒకొక్కసారి మధ్యలోనే మూడోరోజునే డేరా ఎత్తేస్తుంది. పై కారణంవల్ల ఈ రెండుతరగతులకీ సమయస్ఫూర్తి చురుకుదనం, ధైర్యసాహసాలూ, సినిమాపరిశ్రమయెడల ప్రత్యేకాభిమానం కలిగి యౌవ్వనంలోవున్న నల్లుల్ని వదిలిపెడతారు. ఇవి ఎప్పుడు పడితే అప్పుడు కక్కూర్తిపడి రక్తం పీల్చవు. సినిమాలో అవకతవకలూ, చవటవేషాలూ, పాడుగుడ్యాన్సులూ ఉండి విసుగుపుట్టించే ప్రమాదభూయిష్ట సన్నివేశాలు వచ్చినప్పుడు,

వెంటనే సమయస్ఫూర్తిగల ఈ నల్లులు ప్రతి మహారాజునీ, యువరాజునీ నాలుగు ప్రక్కలనుండీ తగులుకుని చురుకు చురుకుమని కుట్టేస్తాయి వెంటనే వాళ్లు వెనక్కి తిరిగి వాటిని వెతుకుతారు. ఈలోగా సినిమా సాగిపోతుంది. (దీనివల్ల ఇంకో ప్రయోజనంకూడా ఉంది. కొన్ని వివాదాస్పద విషయాలు బయలుదేరుతాయి. నల్లుల మూలంగా చూపబడని సన్నివేశాలలో ఫలానాతార రైల్లోనో జైల్లోనో కూచునిపాడుతున్నప్పుడు చారల జాకెట్టు తొడుక్కున్నదని కొందరు అభిప్రాయపడతారు. కాదు సాదా నల్లరవిక - అది ఏకుపుసీను అని కొందరు వాదిస్తారు. పేచీలు వస్తాయి. పందెం వేస్తారు. దానికోసం మళ్ళీ మళ్ళీ ఆ చిత్రానికి వస్తారు - రా॥)


సరే ఇంక మిగిలిందల్లా రూపాయి టిక్కెట్టు. దీనివల్ల సినిమాకి అట్టే ఆదాయం ఉండదు. కొత్తరోజుల్లో కొందరు డబ్బిచ్చి వస్తారు. ఆ తరువాత బావమరదులూ, మేనమామలూ, ఛైర్మన్ గారి కుటుంబం, ఇన్‌స్పెక్టరుగారి తమ్ముడూ ఇత్యాది శాల్తీలు కాంప్లిమెంటరీగా అంటే ఊరికే వచ్చేస్తారు. ఈ తరగతిలో అట్టే నల్లులు ఉండవు. "అదుగో మోసావా - ధనికుల తరగతిలో నల్లులు లేవు. ఎంత పక్షపాతం" అని ఎవరేనా వేలెత్తి వక్కాణించగలరనే ఉద్దేశంతో, ఉన్నాయంటే ఉన్నాయన్నట్టు [illegible]ంధనానికి మూడేసి కుర్చీలకి రెండేసి ముసలి నల్లుల్ని వదుల్తారు. అయితే ఒక్క మినహాయింపు. ఇందులో కాంప్లిమెంటరీ జనం కూచునే కుర్చీలు కొన్ని గుర్తుగా ఉంటాయి. వాటిలోమాత్రం నల్లులు పుష్కలంగా ఉంటాయి "ఆ హాలుకి మాత్రం ఇంక ఇచ్చినా వద్దు బాబూ" అనిపించేస్తాయి కాంప్లిమెంటరీవాళ్ళచేత.

రామారావు ఎంతో కష్టపడి పరిశోధన చేసి ఈ థీసిస్ రాశాడు. దీనికోసం చదువు ముఖ్యమైన చిల్లర విషయాలు కొస్త పక్కకి నెట్టేసినందువల్ల ఇంటర్‌మీడియేట్ లాగే బియ్యే కూడా అనేక దఫాలు తప్పాడు.

అయితేనేంలే అనుకున్నాడు రామారావు. ఇంత శ్రమా ఇపుడు పనికొచ్చింది. రామారావు సలహా పురస్కరించుకొని వీరరాజు అగ్గిపుల్ల వెలిగించి ఆవెలుగులో తన రూపాయి టిక్కెట్టు చూపించాడు. తక్షణమే నల్లులు నాలిక్కరచుకొని 'పొరపాటయింది. క్షమించాలి' అని చెప్పి చక్కాపోయాయి పెద్దమనుషులకి మల్లే.

వీరరాజు ఆశ్చర్యంతో గుండెలు బాదుకున్నాడు "ఇంత తెలివి ఉంది; నువ్వు పీతని చేసుకుంటే ఇంకెంత గొప్పవాడివవుతావో" అన్నాడు.

"ఏడిశావుగానీ మావయ్యా సంగతీ, సుందరంగారి సంగతీ కొంచెం ఆలోచించు త్వరగా" అన్నాడు రామారావు. రాజు ఆలోచిస్తున్నాడు.



నృత్యభంగిమ (బేలూరు శిల్పం)
ఫొటోలు: ఎమ్. టి. చారి — నెల్లూరు.

హఠాత్తుగా రామారావు లేచి నుంచున్నాడు. "ఒరేయ్ ఈ సినిమా ఇక చూడలేనురా చూసినకొద్దీ సుబ్బులు జ్ఞాపకం వస్తోంది. పోదాంపద" అన్నాడు. రాజు ఘొల్లున ఏడుస్తూ లేచాడు. "అవును పాసులు అమ్మేద్దాం సగంరేటుకి" అన్నాడు బయటికి నడుస్తూ.

ఇది ఇలా ఉండగా ముందర మూడణాల తరగతిలో రామన్న భీమన్న అనే ఇద్దరు తోడుదొంగలు నల్లుల్ని వేటాడుతున్నారు.

"సిటీ అచ్చం ఇలాగే ఉంటది గదేన్" అన్నాడు రామన్న.

"ఔనెన్. నేనూ అదే సూస్తున్నా. యాపరా దీన్ని సూశాం అని. అవును గానీ సిట్టి కేయాల సీర తెత్తాన్నావ్ - ఏం చేశా?" అన్నాడు భీమన్న.

ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

"ఏందోలే ఇయ్యాల ఒవుడిమొకం సూశానోగాని - ఒక్క జేబు, మచ్చుకు ఒక్క జేబు దొరకలే"

"పోస్లే కొత్త సైకిలు కొట్టకొచ్చాం గందా అది అమ్మేత్తే బాగానే గిడతదిలే" అని ఓదార్చాడు భీముడు

"మెల్లిగా ఊసులాడేస్"

ఇద్దరూ నోరుమూసుకుని సినిమా చూడసాగారు హీరోయిన్ ఏడుస్తూనే ఏదో తింటోంది "అవునుగాని అది తినేది ఏటంటావ్ భీవన్నా రొట్టా బిస్కత్తా?" అన్నాడు రావుడు

"తెల్దేస్ పాటిగిరాపోడు బాగా పిలింతీశె"

ఇంకో అయిదు నిమిషాలు సాగింది తెర మీద ఓ పోలీసు తెగ ఆడిపోతున్నాడు రావుడికి ఎందుకో దిగులుపట్టుకుంది కొంచెం ధియం తగిలింది "సెగు సెగేస్ - రేపు అంటర్వాలీకా బేటే కల్దాంగాని ఇయ్యాలకి సెగు" అన్నాడు గబుక్కున

భీముడు ఇష్టంలేకపోయినా బలవంతాన లేచాడు తిట్టుకుంటూ ఇద్దరూ బయటకొచ్చేశారు సాయంత్రం బజారునోంచి కొట్టుకొచ్చిన రాలీ సైకిలు రంగు గోకేసి ఈ సినిమా కొచ్చారు ధీమాగా ఇపుడా సైకిలు తీసుకుని బయలుదేరారు - స్వగ్రామానికి

అప్పుడే బయటకొచ్చిన రామారావూ వీర్రాజూ కూడా ఒక సైకిలెక్కి ట్రంకు రోడ్డుమీద బయల్దేరారు - బస్తీకి ఆరుమైళ్ల దూరాన ఉంది వాళ్ల గ్రామం

రామన్నకి వీళ్ళని చూడగానే మచ్చటేసింది "భీవుడోయ్ చిలుకు చొక్కాలూ, లిప్టువాచీలూ రోయ్" అన్నాడు కన్నుమీటుతూ భీమన్నకి సినిమా మధ్యలో లేచి వచ్చినందుకు బాగా కోపంగా ఉంది "సరేలే ఎక్కు పొలిమేర దాటగానే అటకాయిద్దాం" అన్నాడు ఉదాసీనంగా

రామారావూ వీర్రాజూ ఝూంమని ట్రంకు రోడ్డు మీద వెళ్లిపోతున్నారు జనం ఎవరూ లేరు ఫర్లాంగు దూరం వెనకగా దొంగరాముడూ దొంగ భీముడూ వెంటపడ్డారు దొంగ రాముడు ఎండ్కో పేరెన్నికగల జేబుదొంగలు కమ్ దారిదొంగల కంపెనీ భీమన్నది అందులో 'ఎండ్కో' భాగం

భీమన్న సైకిలు తొక్కుతున్నాడు బుస్సుబుస్సుమని కోపం కక్కుతూ రామన్న ముందు బార్ మీద కూచున్నాడు

"బండి బల్ పోతందే" అన్నాడు రామన్న భాగస్వామి భీమన్న మాట్లాడలేదు

"జాయ్‌గా పోదారేస్ తొందరేటి" అన్నాడు రామన్న మళ్లీ

భీమన్న పలకలేదు ఇలా భాగస్వామికి కోపం వస్తే బిజినెస్ దెబ్బతింటుందని రామన్నకి తెలుసు కోపం ఎలాపోగొట్టాలో కూడా తెలుసు

"అవునుగానీ భీవుడూ నాకు తెల్దనుకో ఇపుడు మనం చూసిన ఎలింలో పాట గంటసాలోడి స్టోనుగాద లేస్" అన్నాడు లేని పోని ఉషారుతో భీమన్నకి పాటలంటే ఇష్టం

కోపం పోతుంది ఇపుడు పోయింది

నవ్వాడు మృదువుగా "పోపో వేస్ గంటసాలోడి స్టోనేరు ఈడి స్టోనేరు ఆడిస్టో నాడిదే ఈడిసో నీడిదే ఇదో రకం అనుకో ఇది ఇంది స్టోను" అన్నాడు

"ఏందోలే మనకి బాకూడా తెల్దుగా" అన్నాడు రామన్న

దానికంటేన్ బాస బాసే స్టోను స్టోనే అనుకో"

"అంతేలే అంతే - రేయ్ సైకిలాపరా తూముకాడి కొచ్చేశాం నువ్వు దిగి ఎనకాల లగెత్తురా నే ముందెళ్లి ఆళ్ల నాపుతా" అన్నాడు రామన్న

భీవన్న సైకిలుదిగి రామన్న కిచ్చాడు రామన్న జోరుగా బయల్దేరాడు

వీర్రాజూ రామారావూ పదిగజాల దూరంలో పోతూ 'కుడి ఎడమైతే' పాడుతున్నారు జమిలిగా

"ఓ యబ్బాయిగోర్లు కుసింత ఆగండి" అని కేకెట్టాడు రామన్న పనున్నట్టు

"దొంగలురోయ్!" అన్నాడు రాజు "సైకిలాపకు జోరుగా పోనియ్"

రామారావు వెనక్కి చూశాడు "ఆపకపోతే వాడందుకో లేడనా! మనం ఇద్దరం వాడొక్కడూ! ఫరవాలేదులే" అంటూ సైకిలు దిగాడు రామారావు రాజు బిక్కుబిక్కుమంటూ నించున్నాడు

ఎకరం ఛాతీకచాతీ, అరఫర్లాంగు ఎత్తు విగ్రహం, జానెడు బుగ్గమీసాలూ, సగటు రైతు మీసాలంత కనుబొమలూ, డబాయించే చూపులూ మొదలైనసరం జామాతో ఉన్న రామన్న సైకిలుదిగి ఎదట నించునేప్పటికే రాజు కళ్లు మూసేసుకున్నాడు

"నేనేల ఈవేళ సినిమాకు రావలె? వస్తిపో మధ్యలో మాచవటకి లేచిపోవాలని బుద్ధిఏల పుట్టవలె? పుట్టెపో నేనేల లేచి రావలె? వచ్చితిపో యిపుడు సైకిలేల దిగవలె? వేయేల మాలదైవ మీలీల నను గాములపాలు చేయనేల"అనుకున్నాడు దబగబా రామారావు ధైర్యవంతుడు హీరోలక్షణాలన్నీ ఉన్నాయి "ఏమయ్యా? ఏం? ఎందుకు పిలిచావు? ఏం? అం?" అన్నాడు ధైర్యంగా

ఇంతలో భీమన్న పరుగెత్తుకు వచ్చి రామన్న పక్కన నించున్నాడు రామన్న వికటబడి వినోదంగా నవ్వాడు "ఏం ఏం అంతా వున్నాడు పంతులు చూడేస్ - ఏటయ్యా ఏ టేటి? నీతో నాకు ఏరేప నేటి ఊసులాడ్డానికి ఎన్నాననుకున్నావా? డబ్బులు కావాలి డబ్బులూ - లిస్టువాచీలు ఇచ్చిపోండి" అన్నాడు

"సైకిలూ, చిలుకు చొక్కా ఒగ్గేసిపోమా సిటికి చిలుకు చొక్కా లిట్టం" అన్నాడు భీమన్న చాకు తీస్తూ

రామారావు శాంతికాముకుడు "ఇదేం పనోయ్ మీకు? ఇలా దోచడి అదే అది ఇలా పరులసొమ్ము కోరడం బలవంతాన తీసుకోవడం తప్పు కాదూ మిమ్మల్నె ఇంకోళ్లిలాని లేస్తే అప్పుడు మీరు" అని యింకా నచ్చ చెప్పబోయాడు

"ఏ టేస్ ఏటో సదుకుతా ఉండావు అయన్నీ కుదరవ్ బేగి ఆసొక్కా అయా ఒగ్గేసి లగెత్తు నేకపోతే ఇదుగో చూశాగా" అంటూ చాకు చూపించాడు భీమన్న

రామారావు గుటకలు మింగాడు "చూశానుకో' అని చాకుని చూస్తూ అయితే నేం, చూసినా ఇంకొంచెం ధైర్యం మిగిలిపోయింది ఏదో చెప్పబోయాడు

వీర్రాజుకి మాత్రం భీమన్న వాటం చాకూ చూస్తే ఏమంత నచ్చలేదు రామారావు సణుగుడులు అసలు నచ్చలేదు పూర్తిగా తగ్గిపోవడం మంచిది అందుకని "రావుడూ" అని ఒక్కసారి ఉరిమినట్లు గద్దించాడు రామారావుని

హఠాత్తుగా దొంగలిద్దరూ తుళ్లిపడ్డారు దొంగరావుడు మరీనీ రామారావుది చురుకైన బుద్ధి అని ఇంతకుముందే కథకుడు చదువరులకు మనవి చేసుకున్నాడు తక్షణమే కిటుకు కనిపెట్టేశాడు

"ఏం? ఏం? ఏం? అలా తుళ్లిపడతావేం? నీపేరెలా తెలిసిందనా? హహ్హహ్హ" నవ్వు బాగా రాలేదు తమాయించుకుని డబాయింపు సాగించాడు "హోరి దవటా నీపేరేకాదు నీబాబు పేరూ, నీ తాత పేరూ, నీజతగాడిపేరూ నీపేరూ మాకు కంఠతా వచ్చు మా బాబాయి పోలీసు థానా ఇన్‌స్పెక్టరు తెలుసా? నీ పుట్టుపూర్వోత్తరాలన్నీ అక్కడ పుస్తకాల్లో ఉన్నాయి హుం!—కదరా రాజా" అన్నాడు

వీర్రాజుకూడా సంగతి గ్రహించి పుంజుకున్నాడు అవునవును కాదు మరి! అవును హుం! ఏవిటో వీడిలా కొత్తవాళ్లనుకుని మనని డబాయిస్తాడూ అని ఇందాకటి నించీ చూస్తున్నా కానీ ఎంతవరకూ వేషాలేస్తాడో చూద్దాం అని ఊరు

కుంటున్నా - మన తడాఖా తెలీదుకాబోలు" అన్నాడు

దొంగరాముడూ దొంగభీముడూ గుడ్లు మిటకరించి గబగబా ఆలోచిస్తున్నారు. అసలు వీడెవడు? పైగా వీడి బాబాయెవడు? మన పేరెలా తెలిసింది? అని

వీళ్లు దొరికిపోయారు కాబట్టి కథ అడ్డం తిరగకుండానే వీళ్లని మంచిచేసుకోవడం ఎలాగా అని రామారావు ఆలోచించాడు. ఒక్క నిముషం నిశ్శబ్దం ప్రవర్తిల్లింది

"ఆ సైకిలెందుకు తెచ్చార్రా? పాపం ఆయనదెంత ఇబ్బంది పడుతున్నాడో తెలుసా?" అన్నాడు రామారావు హఠాత్తుగా. దొంగలు మొహామొహాలు చూసుకున్నారు. రైట్ అనుకుని విజృంభించాడు రామారావు. "పోనీ తే. తెస్తే తెచ్చారులే. వాడుకో నేరగాని రేపు పొద్దున్న ఓ గారికప్పకు రెండు సిలుకు చొక్కాలిస్తా. మీ చిటికెపం అని నాకు తెలుసులే. నాదగ్గిర సిగ్గెందుకురా. అవును గాని ఓ ఉపకారం చేసి పెట్టాలిరా రావుడూ. అన్నట్లు నీ పేరేమిటన్నావు? ఆ? భీమన్నా? మరి భీమన్నదూ ఓ పని చెప్తాలోయ్ పదిహబ్బులు గిట్టేకెళ్లండి. జైలుకి పంపే పని కాదు. ఏం గారం రోజులు నాతో తిరగండి. చెరి పాతిక రూపాయలిస్తా. కావాలంటే రేపు బయానాగా అయిదురూపాయలిస్తా" అన్నాడు

దొంగరాముడు అండ్ కో వారు కొంచెం అనుమానంగా చూశారు ఇదంతా పోలీసులకి పట్టిచ్చే ఎత్తేమోనని

"ఓయిరా అబ్బీ మా వూరి ముత్యాలమ్మ తోడూ నీతోడు మా బాబాయి చెప్పను. నా సొంతపనికే ఇది. ఏమంటావు సరేనా? రైట్ రేపు పొద్దున్న తొమ్మిదింటికి దుర్గతోటముదగ్గరకి రండి. చొక్కాలూ బయానాకి డబ్బూ తెచ్చిస్తాం. సరేనా?" అన్నాడు రామారావు. సరే అన్నాడు రామన్న తెగించి

రామారావు ఇంకొంచెం పునాది గట్టి చేశాడు "నాకు నమ్మకం ఎలా? మీరు పారిపోతే. ఓపని చెయ్యండి. ఆ సైకిలు నాకిచ్చి మీరు మళ్ళీ బస్తీకెళ్లి సత్రంలో పడుకోండి. ప్రొద్దున్నే బస్సుకి బయలుదేరి వచ్చెయ్యండి. సైకిలుకేం పరవాలేదు" అన్నాడు

దొంగలిద్దరూ తటపటాయించారు. "సరే బాబయ్యా" అన్నారు సైకిలు అప్పగించి

"రైట్ రేపు గుర్తుంచుకోండి"

దొంగలిద్దరూ దండాలు పెట్టి మరీ వెళ్లారు

రామారావు, రాజూ చెరో సైకిలూ ఎక్కి బయలుదేరారు. ఓ ఫర్లాంగుదూరం వెళ్లాక 'హమ్మయ్యా' అన్నాడు రామారావు

"ముప్పావలా కోడిపిల్లకి మూడున్నర చేసే పందిపిల్లని దిష్టితీసినట్లుంది. వెనవది సిలుకు చొక్కా, జేబులో ఉన్న రెండు రూపాయిలూ పారేసి పోయేదానికి ఈ కామాటం ఏమిట్రా రావుడూ" అని గొణిగాడు రాజు. సైకిలూ రిస్టువాచీకూడా దొంగలికి సరదాలిస్తాయని అతనికి తట్టలేదు

రామారావు దూరదృష్టిగల రాజకీయవేత్తలా నవ్వాడు గంభీరంగా. మసక వెన్నెల్లో అది రాజుకి కనపడలేదు. పోజంతా దండుగ అనుకున్నాడు రామారావు

"ఇవాళ చిత్తంవచ్చినట్టు బుకాయించామని రేపు వాళ్ళు పసికడితే ఎంత ప్రమాదంరా! దొంగలతో ఆట పాములతో చెలగాటం అన్నారు' అన్నాడు రాజు మళ్ళీ

"ఏడిశావు బోడిమెతలూను నువ్వూను. చెప్తున్న వాళ్లు రాయన పాడిలి చచ్చేటట్లుగా నిజం చెప్పెయ్యమా? దొంగోయినా చేతికిచ్చి, పైగా గాడి సైకిల తిరిగిచ్చేసి, రెండు సిలుకు చొక్కాలుకూడా ఇస్తే వాళ్లు మనచేతిలో కుక్కలై పోర్రా" అన్నాడు రామారావు

"ఈ సైకిలు బావుంది' అన్నాడు వీర్రాజు

"వెధవ్వేషాలెయ్యకు. దొంగలతో ఆట పాములతో చెలగాటం వంటిదన్నారు తెలుసా?" అంటూ ఎత్తి పొడిచాడు రామారావు

"బోడిసన్నర సామెత ఎంగిలిసామెత. ఇంతకీ వాళ్లతో నీకుపనేమిట్రా ఉద్యోగాలిస్తానన్నావు?"

"అదే అసలు నాకూ తెలీదు కాని సుందరంగాడి సంగతి మావయ్య ఎన్నికల సంగతి తాడూపేడూ తేల్చడానికి వాళ్లు పనికొస్తారులే' అన్నాడు రామారావు మళ్లీ గంభీరంగానే

* * *

చదువరి ఒకపరి ఇటురమ్ము ఈ తెరువరు లిఘువురి తెరగుల పరికింతము

ఈకథకు రామారావు నాయకుడు. ఇప్పటికిప్పుడు కాకపోయినా, తెల్లవారేకయినా అతడిని చూస్తే అతని వయస్సిరువది రెండేండ్లుండవచ్చని తోపకమానదు. అయితే అది తప్పు. అతని వయిస్సిరువది యారేండ్లు. విశాలఫాలభాగము, పొడుగైన నాసిక, సన్నటి పెదవులు, చురుకైన చూపు, చూస్తే ఉన్నత వంశసంజాతుడనీ అందగాడనీ చటుక్కున స్ఫురిస్తుంది. ఒకవేళ స్ఫురించకపోయినా, ఎవర్నడిగినా చెప్పేస్తారు. చీకట్లో కనపడవుగాని, అతని చేతికి మంచిఉంగరం రిష్టువాచీ ఉన్నాయి. అవీ, వాళ్లింట్లో ఇనపపెట్టెలో డబ్బూ, అతని పెట్టెలో ఉన్న సిలుకు చొక్కాలూ, సూట్లూ చూస్తే ధనవంతుడని అంతా ఒప్పుకుంటారు. హొయలు, వాటం, వాలకం చూస్తే విలాసపురుషుడనిపిస్తుంది

ఈ రామారావు విలాసాలలో విద్యాభ్యాసం ఒకటి. ఆంధ్రవిశ్వవిద్యాలయానికి పోషకుడు. అనేకసంవత్సరాలు ఇంటర్మీడియెట్ పరీక్షలకు వెళ్ళి అనుభవం గడించాడు. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా బి ఏ పరీక్షకు గుటు సూత్రములన్నీ పరిశోధిస్తున్నాడు. చలనచిత్ర పరిశ్రమకు మహారాజ పోషకుడన్న విషయం సువిదితమే. పోతే, సినిమా పత్రికలకు రామారావు రాజపోషకుడు. అతను తన కాపీని ముందుగానే రిజర్వుచేసుకుంటాడు. సినిమా పత్రికలకు ప్రశ్నలు పంపడం దైనందినీయ కార్యక్రమం


"ఎడిటర్జీ! ఫలానా తార తారడూ ఏమౌతారు?' "ఫలానా చిత్రంలో ఫలానా నేశ్వరరావూ ఫలానిమతి ఎడబాటువల్ల గురి అయినపుడు శ్రీమతి ఫలానీమతి ఏడుస్తూ ఓపాట పాడుతుంది. ఆ సన్నివేశంలో ఆమె చారల జాకెట్టు ధరించిందని నేనూ, కాదు నల్లజాకెట్టని మా మిత్రుడూ వాదించుకుంటున్నాం. మీ రెవరితో ఏకీభవిస్తారు సంపాదక మహాశయా?' "నాకు ఫలానా తారకేశ్వరితో హీరోగా నటించాలనివుంది. మీ అభిప్రాయం?" ఇత్యాది ప్రశ్నలు 'ఆయాపత్రికలలోనుండి కత్తిరించిన కూపన్ల'లో మాత్రమే ఇతడు వ్రాసిపంపుతాడు. అవి ప్రచురించబడే పర్యంతం ఆయాపత్రికలు కొంటూనే ఉంటాడు. ఒక్కొక్కసారి కాలేజీ అమ్మాయిల పేరుతో తనే ప్రశ్నలు పంపడంకద్దు

రామారావు పరేంగితజ్ఞుడు. ముఖ్యంగా అమ్మాయిల ఇంగితం ఇట్టే గ్రహించగలడు. వాళ్ళ మావయ్య — నారయ్యగారి ఇంగితం ఇతనికి పదో ఎక్కం అంత బాగా కంఠతా వచ్చు. తరువాత, నల్లిహృదయం కూలంకషంగా అవగాహన చేసుకున్నాడు. దీనిపై బ్రహ్మాండమైన పరిశోధనలు చేశాడు. వాటి ఫలితాలను చిన్నగ్రంథంగా రచించాడు. వాటిని చక్కని ముద్రణతో బైండు సరూపంలో ప్రచురించాలని అతని ఆశయం. అందుకు డబ్బు కావాలి

"డబ్బైతే ఇంట్లో ఉంది కాని అమ్మ ఇవ్వదు. అమ్మకి మావయ్యమాట సుగ్రీవాజ్ఞ. మావయ్య లావుగా ఉంటాడు. పెద్దవాడు. పైగా పెదమనిషి. అన్నిటికీ "ఎందుకూ?" అని అడుగుతాడు. "నాకు తెలుసులే వెధవాయా" అంటాడు. అందుకే నాన్న పోతూ పోతూ మావయ్య మాట వినమని అమ్మకి చెప్పి ఒప్పించుకుని పోయాడు. తనని ఆకతాయని తిట్టి మరీ పోయాడు. అందుకని ఇనప్పెట్టె తాళాలు అమ్మచేతుల్లోనే ఉన్నా ఆ తాళాలకు తాళాలు మావయ్య చేతిలో

ఉంటాయి. ఇంకోటి...మావయ్య అచ్చం అసలు సిసలు మావయ్య కాదు. మావయ్య వేలు విడిచిన మావయ్య. అమ్మకి వేలువిడిచిన అన్నయ్య అన్నమాట. ఒంటరిపక్షిలా పెళ్ళీగిట్రా లేకుండా ఊళ్లంట తిరుగుతూ ఉంటే నాన్నే దగ్గరకు తీసి ఆశ్రయం ఇచ్చాడు." ఈ విషయాలన్నీ రామారావు వీరరాజుకి, తన ఆప్తస్నేహితులకీ చెప్పకుండ ఇదవుతూ ఉంటాడు.

"మావయ్య మనకి పెద్ద దిక్కు రా నాయనా వాడిమాటతో సిరాజనసు దత్తత



గలవాడు" అంటుంది రామారావు తల్లి ఎప్పుడూ

రామారావుకి మావయ్యదక్షత ఏమిటో బోధపడలేదు అదంటాడు ఇదంటాడు విదంటాడు పదంటాడు అమ్మని బెల్లించి డబ్బు ఒడేసుకు చక్కాపోతాడు బస్తీకి పేకాడతాడు డబ్బుపెట్టి పైగా నల్లమందొకటి అమ్మకి చెప్పితే నమ్మదు "పోనీలే పెద్దముండా వాడు బతికినన్నాళ్ళూ బతకడు వా డేడుపు వాడు చూసుకుంటాడులే గాని మువ్వు నీతులు చదవకు తప్పు" అని కోప్పడుతుంది అమ్మ ఈలోగా నా ఏడుపు నన్నేడవనీయడే అని విసుక్కుంటాడు రామారావు

ఇంకొక్క సుక్క రామారావుకి పెళ్ళి కాలేదు సుబ్బలక్ష్మి అనే పిల్లను చేసుకోవాలని ఉబలాటం ఇంక వీర్రాజు అంటే రాజు ఈ రాజు రామారావుకి నేస్తం ఇతనూ విద్యాసంస్థలని, కళని పోషిస్తాడు కొంచెం ఆస్తి, ఓ మాదిరి అందం, బోలెడు తెలివి తేటలూ ఓ అమ్మా, ఓ ముసలిబామ్మా ఉన్నారు.

దొంగరాముడి బారినుండి తప్పించుకున్న హీరో రామారావూ, సైడు హీరో వీర్రాజూ ఇళ్ళకెళ్ళి పడుకున్నారు పొద్దునే హెచ్ రామారావె ఎస్ హెచ్ వీర్రాజుని పరిచయం చేస్తాడు

*　　*　　*

తెల్లవారిందనే దురభిప్రాయంతో కోడి కూసింది కాకులు మేలుకున్నాయి ఈగలు డ్యూటీకి బయలుదేరాయి దోమలు విశ్రాంతికి ఉపక్రమించాయి దాలిగుంటల్లో పిల్లులు బద్ధకంగా లేచి ఒళ్ళువిరుచుకుని బయటకు నడిచాయి ఆవులు అంబా అన్నాయి పువ్వులు వికసించాయి నవ్వడం అలవాటైన పిల్లలు చక్కగానవ్వారు ఉత్తి పుణ్యానికి ఏడవడం వృత్తిగా కలపిల్లలు చక్కగా ఏడుపు మొదలెట్టారు కొద్దోగొప్పో పాడిగల ఇళ్లలో అమ్మమ్మలు, బామ్మలూ భూపాలరాగచ్ఛాయలో "అమ్మా గుమ్మడేడే' అని పాడుతూ మజ్జిగ చిలుకుతున్నారు. ముద్ద బంతిపూలవలె బొద్దుగా పచ్చగా ఉన్న అమ్మాయిలు పంచకల్యాణి గుర్రాలకు మల్లె శోభిస్తూ, కళ్ళు నులుపుకుని కాటికమరింత అందంగా పులుముకుంటూ, ముంగురులు సవరించుకుంటూ, విడిపోయిన జడలల్లుకుంటూ, అమ్మలచేత బామ్మల చేత సున్నితంగా చివాట్లు తింటూ ఇళ్ళు కలకలలాడేలా తిరుగుతున్నారు కొందరు గుమ్మాలలో పేడనీళ్ళుచల్లి, సంక్రాంతి ముగ్గులుతీర్చి దిద్దుతూ, ముగ్గులంత అందంగా సజీవంగా నవ్వుతున్నారు పదేళ్ళపిల్లలు గొబ్బి తట్టుతున్నా రాడీ తమ్ముళ్లూ, రాలుగాయి కుర్రాళ్లూ లేచి గోటీ బిళ్లలూ, బొంగరాలూ, పిడకలదండలు కులాసాగా ఉన్నారో లేదో చూసుకుని, చదన్నాలకి సిద్ధం అవుతున్నారు బస్తీ వెళ్లొచ్చిన యువకులు, గడ్డాలు పెరిగినా మాసినా సరేనని రేజరుసెట్టు అద్దం సిద్ధంచేసుకుంటున్నారు చివాట్లు తింటూనే సాతాని జియ్యరు ఒక ట్రిప్పు పూర్తి చేసుకున్నాడు కాలవరేవుదారి అంతా నీటి కడవలు నెత్తిన పెట్టుకుని నడచే అప్పలమ్మలతో, బిందెలు చంకనెట్టుకు పోయే బామ్మలతో చూడముచ్చటగా ఉంది బస్తీకి కూరల కావిళ్లూ చాలా పెందరాళే వెళ్లాయి ఆలస్యంగా లేచినవాళ్ళు హడావుడిగా పోతున్నారు ఈ సరయ్య హోటలునించి, ఎండుతామరాకుల వేడి వేడి ఇడ్లీలపొట్లాలని ఆఘ్రాణించి ఆనందిస్తూ కొందరు కుర్రవాళ్ళు తిరుగుతున్నారు ఈహడావుడంతా చూసి నిజంగానే తెల్లవారిందనుకుని సూర్యుడు ఉదయించాడు మొత్తంమీద లోకంఅంతా మేలుకుని బిలబిల తిరుగ సాగింది

రామారావుకి మాత్రం ఇంకా తెల్లారినట్టు నమ్మకం కుదరలేదు వాళ్ల మావయ్య బోలెడుసార్లు రామారావుని తిట్టి, గావుకేకలు పెట్టి కండువా వేసుకుని ఊరెళ్ళిపోయాడు రాత్రి సినిమాలో హీరోయిన్ ఇమ్మా, సుబ్బలక్ష్మి అటూ ఉండగా పండు వెన్నెలలో విహరిస్తున్నట్టు కలగంటున్న రామారావుకి లేవడానికి బుద్ధి పుట్టలేదు వెర్రిలోకం మోసపోతోంది అనుకున్నాడు మగతనిద్రలో సూరమ్మగారు వచ్చి తట్టి లేపింది గోడగడియారం తొమ్మిది వేసింది ఠక్కుమని లేచి కూర్చున్నాడు రామారావు సీమగడియారాలు అబద్ధం చెప్పవు

వేపపుల్లా చెంబూనీళ్లు పట్టుకుని వీధరుగు మీద మకాం వేసుకుని దంతధావనకి ఉపక్రమించాడు రామారావు సంక్రాంతి ముగ్గులతో వీధిలోని ప్రతి ఇంటివాకిలీ వెలిగిపోతోంది "బాగున్నాయి ముగ్గులు' అనుకున్నాడు రామారావు బద్ధంగా

వీర్రాజువచ్చి రివ్వున వాలాడు అరుగు పక్కన "సిగ్గులేకపోతే సరి తొమ్మిదింటికి లేచి పైగా వీధరుగుమీద దుకాణం పెట్టాడు

తెములు తెములు దొంగరావుడు వెతుకుతూ ఉంటాడు దుళ్లదగ్గిర అనుమానం తగిలితే తరిమి తరిమి తంతాడు" అన్నాడు 'రాజా వెడలె రవి తేజము లలరగ' అనతగినంత ఊపులో జోరుగావచ్చాడు వీర్రాజు సిల్కుచొక్కా వేసుకున్నాడు సిల్కు పైజామా కూడా తొడిగాడు సున్నగా క్రాపుదువ్వాడు రాత్రి దొంగరాముణ్ణి డబాయించి తెచ్చిన రాలీసైకిల్ మీద కూర్చుని విలాసంగా ఓకాలు రామారావు కూర్చున్న అరుగుమీద ఆనించి హాయిగా ఒలకపోశాడు రామారావు బద్ధకంగా తలెత్తాడు ఎగాదిగా చూశాడు వీర్రాజుని

"మెడలో ఒంటిపేట బంగారపు గొలుసు ఒక్కటే తక్కువ దసరా బుల్లోడిమల్లె, తోటపెళ్ళికొడుకల్లె ఉన్నావు" అన్నాడు

"చాల్లేవోయ్ సణుగుడుమాని తెములు"

"అయిపోంది తొందరపడకురా స్నానసంగీనం చెయ్యాలి నువ్వలా కూచుంటావా"అన్నాడు రామారావు

"ఏం గిరాకీ! స్నానం వాయిదా వేస్తున్నావు మీ పెద్దదిక్కు మీ మగదక్షత ఊళ్లో లేడా"

"లేకేం నిక్షేపంలా ఉన్నాడు అమోఘంగా బోలెడున్నాడు ఆ మాటకొస్తే మా పెద్దదిక్కు ఉన్నంతగా ఇంకెవడూ లేడు ఇప్పటిదాకా కథాకళి ఆడి ఇప్పుడే ఊరెళ్ళాడు కండువా వేసుకు దండోరా వెయ్యడానికి"

"ఎందోరా ఏవి ట్రోయ్ పంతులు!" అన్నాడు వీర్రాజు ఉషారుగా

"ఏమిటి కాదు రోయ్ అను నేను వాజమ్మననీ చవటననీ, స్నానం చెయ్యననీ దండోరా వేయించి, అందరిచేత సుబ్బలక్ష్మి నాన్నకి చెప్పించాలని"

"ఊ చెప్పించి?"

"సుబ్బుల్ని బంగారయ్య దూరపుచుట్టం సుందరంగాడికి ఇప్పించాలని ఆపైన కరణంగారి కూతురు సీతని నా నెత్తికి కట్టాలని"

"భేషుగ్గా ఉంది మన కొక్కపలసిందదేగా పోయి మీ మావయ్యకాళ్ళమీద పడు "హా పెద్దదిక్కా! మా యింటి మొగదక్షతా నిన్ను అపార్థం చేసుకున్నానుస్మీ" అను అన్నాడు వీర్రాజు

రామారావు దంతధావనం పూర్తిచేసి లేచి నుంచున్నాడు అరుగుమీద.

"సరేలే అరుగుమీద కూర్చుని ఏడుస్తూ ఉండు బట్టలు మార్చుకుని, అమ్మదగ్గిర డబ్బులు సంపాదించుకు అరగంటలో వస్తా చాలా మాట్లాడాలి రాత్రి మా పెద్దదిక్కు అమ్మకి నా పెళ్ళి గురించి బోలెడు హితోపదేశం చేశాడులే" అంటూ లోపలికి వెళ్లాడు రామారావు

*　　*　　*

ధనియాలకాఫీ గడగడతాగేసి 'అమ్మా పదిరూపాయిలే' అన్నాడు రామారావు 'అమ్మా కానీయే' అన్నంత ముద్దుటగా, గారాబుగా

"ఎందుకునాన్నా పదిరూపాయలు? నాకర్లకీ చాకర్లకీ తగలెట్టాలా? చుట్టలు కాల్చడానికా?" అంది సూరమ్మగారు

"కాదులే అమ్మా రాజమండ్రి వెళ్లాలి ఉద్యోగం దొరికేటట్టుందిలే" అన్నాడు రామారావు

"చాల్లే నువ్వేం ఉద్యోగాలు అఘోరించక్కరలేదు అయినా డబ్బా గిబ్బా

కొత్త సీరియల్

"దావాగ్ని"

రచయిత : జి. సి. రామకృష్ణ

కొత్త పరిస్థితులను సమన్వయించుకోలేక, రాజకీయాలవల్ల లభించిన నూత్న చైతన్యాన్ని సక్రమమైన మార్గంలో వినియోగించుకోలేక, గాంధి మహాత్ముడు బోధించిన కనీస మానవ ధర్మాలను కార్యరూపంలో సాధించడానికై సతమతమౌతున్న పల్లె ప్రాంతాల నేటి ప్రజల జీవనానికి ప్రతిబింబం ఈ నవల 31-8-1955 తేదీ మొదలు ఆంధ్రవారపత్రికలో సీరియల్‌గా ప్రచురించబడనున్న ఈ చిన్న నవలను ఆంధ్ర పాఠకలోకం ఆదరిస్తుందని మా విశ్వాసం.

—సంపాదకుడు

ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

నన్నడక్క మావయ్య రానీ చూద్దాం అన్నట్టు మర్చిపోయా అలా కూచో ఏవిటలా ఆడిపోతున్నావు? చూడూ మావయ్య కరణంగారితో మాట్లాడాడుట ఈ వేసంగుల్లో వాళ్ళసీతమ్మనిచ్చి"

"నేను బియే అయేదాకా పెళ్లిమాట ఎత్తకమ్మా"

"బియే అయితే అవుదుగానికే ఇప్పుడు మాట చెప్పడానికేవిట్రా"

రామారావు చురుకైన బుర్ర చకచక పనిచేసింది "సరే నేనడిగిన పదిహేను రూపాయలూ ఇప్పుడిస్తే కరణంగారి సంబంధం సంగతి ఆలోచించి రేపు చెబుతా"

"ఇప్పుడేకదురా పదిరూపాయలన్నావు!"

"సమయానుకూలముగా రేట్లు హెచ్చించబడును షరా రూల్సు మామూలే" అన్నాడు రామారావు

"తగలెయ్యి నాయనా తగలెయ్యి నీ ఇష్టంవచ్చినట్టు తగలెయ్యి పెబ్బు ఆమారాజు చచ్చిచెడి ఇచ్చిందంతా ఇగో, నిర్వాకం చెయ్యి పట్టకెళ్ళు మీ మావయ్య వచ్చాక—"

"అయితే నాకసలుడబ్బే అక్కర్లేదమ్మా ప్రతీదీ మావయ్యతో చెప్పాలేవిటి? నాకక్కర్లేదు పాతికేళ్లొచ్చినా ఇంకా పరీక్షనే" అంటూ గునిశాడు

"నువ్వు పాతికేళ్లొచ్చిన కుర్రాడిలాగే నడుచుకుంటున్నావా అంటూ నీకా మాత్రం జ్ఞానముంటే మావయ్య పెద్దరికం ఎందుకు చేస్తాడు నీమీద కాపోయినా వాడేం పరాయివాడుట్రా మనకిమాత్రం వాడికన్న కావలసిన వాళ్లెవరున్నారు" అంది సూరమ్మగారు

"అంతక్కర్లేని వాళ్ళింకోళ్లు లేరు నీకేం తెలుసమ్మా ఇంట్లో నాలుగ్గోడల మధ్యా కూచుంటావు మా వేలువిడిచిన అన్నయ్య, మన ఇంటి పెద్దదిక్కు అయిన సూరయ్యగారి పేరు రాజమండ్రి నుంచి తెనాలి క్రాసదాకా మోగిపోతోంది— సాటిలేని మేటి ఘంకాపరాసు ఆటగాడని"

"ఛఫ్ పెద్దంతరం చిన్నంతరం లేకుండా నోటికొచ్చినట్లా ఏవిట్రా ఆ పేలుడు? మిడిసిపడిపోతున్నావు వాళంటే వాడి పాడంటే ఎందుకలాగంటావు ఏం చేసు పిల్లాడా?"

"పెదతాడుమాను. నాకు త్రైనువు తోంది అయితే నేను సీతని పెళ్లాడడం లేదు అంతేగా"

సూరమ్మగారు ఫక్కున నవ్వింది "పొట్టనిండా పురుగులు బుస్సున్నాయి పొట్టివాడిని కాకపోయినా ఇంతపట్టికెళ్ళు. పెంపరాకే కొంపచేసుకుని" అంటూ పదిహేను రూపాయలు చేతిలో పెట్టిందావిడ

"ఇదేమిటమ్మా! ఇరవై ఇస్తానని పదిహేను చేతులో పెట్టావు? నేను అడిగింది పాతికా నువ్వు ఇస్తానన్నది ఇరవై తీరా చేతికిచ్చింది పదిహేనూనా! బావుంది పంచపాండవులెందరంటే మంచపుకోళ్లలా ముగ్గురం అంటూ రెండు వేళ్లు చూపించాడట వెనకటికెవడో" అంటూ కూనీగలా ఎగిరిపోయాడు రామారావు

"పరారా! ఎంత నేర్పుక పోయావురా మావు!" అంటూ బుర్రమీద వేలేసుకుని విస్తుపోయింది సూరమ్మగారు

"మరి అన్నం ముగ్గెస్తారా వాళ్ళ తండ్రి తీరే పోలిక లెక్కడికి పోతాయి వదినా అన్నగారంత చురుకుతే విమాను. ఔను గాని వదినా మా తమ్ముడో డబ్బాను కొట్టి పాడిపంటే ఇస్తూనా ముగ్గుపిగారు" అంది పెరటిపమ్మంలో నించున్న పొరుగింటి బామ్మగారు

(ఇంకా వుంది)

సీరియల్

ఉదయ కిరణాలు

పోతుకూచి సాంబశివరావు

21

ఇల్లు విడిచిన సాంబు ఒక నిశ్చయం, గమ్యస్థానం లేకుండానే రైలు ఎక్కాడు. శ్యాబంతి మరణంవల్ల క్షోభ పడిన మనస్సుకు హాయి ఎక్కడ దొరుకుతుందా అని వెతుకుతున్నాడు. ఒకసారి హిమాలయాలకు పోవాలనిపించింది. బైరాగుల్లో కలిసి మధూకబళంతో కాలం గడపాలనిపించింది. ఎక్కడైనా కొండగుహల్లో కూర్చుని దైవచింతన చేసుకోవాలనే భావం కలిగింది మరోసారి.

పూరీ ప్యాసంజరులో కూర్చున్నాడు. ఇంటి ఖర్చుకోసం తనదగ్గర ఉన్న పది రూపాయిలు జేబులోనే ఉన్నాయి. టిక్కట్టు కొనలేదు. ఎక్కడైనా దిగిపోవలసి వస్తుందనే బెంగకూడ అతడికి కల్గలేదు.

రైలుపెట్టెలో మూల ఎవరో సాధువు కూర్చున్నాడు. ఎరుపెక్కిన పీచుగడ్డం గుండెలదాకా వేళ్ళాడతోంది. నిమీలిత నేత్రుడై రుద్రాక్ష తావళం త్రిప్పుతుంటున్నాడు. ప్రక్కనే ఒక కంబళీ, మంచినీళ్లతో ఒక యిత్తడికమండలం ఉన్నాయి. ఇటువంటి సాధువులలో ఒక్కొక్కడికి విచిత్రమైన శక్తులుంటాయి అనుకున్నాడు సాంబు.

మధ్యమధ్య స్టేషన్లలో జనం దిగి పోతున్నారు, మరణించిన వ్యక్తుల్లా. ఖాళీ అయిన స్థలం సాంబు ఆక్రమించాడు.

రైలు గబగబ కదిలిపోతోంది. ఎన్నిగంటలైనా ఎక్కే దిగే జనాన్ని చూడడం కాని, ఏ స్టేషన్ల గడిచిపోతున్నాయో అనే ఆత్రుతకాని, ప్రక్కవారితో మాట్లాడే ఆసక్తికాని ఆ సాధువు చూపించలేదు. అంత నిశ్చయంగా ఉండే పురుషులు అరుదు అనిపించింది సాంబుకు.

రాత్రి పదిగంటలయింది. సాధువు కళ్లు తెరిచాడు. కమండలంలోని మంచినీళ్లు నోట్లో పోసుకుని చప్పరించాడు. కంబళీలో దాచుకున్న చుట్టముక్క పైకి తీశాడు.

'నిప్పుపెట్టె ఉందా?'

తనదగ్గర లేక, తన ప్రక్కనఉన్న పెద్దమనిషిదగ్గర అగ్గిపెట్టె తీసుకుని అందిచ్చాడు సాంబు.

చుట్ట ముట్టించి, ముఖం చిట్లించాడు సాధువు. కడుపునింపుకోడానికి కొన్న అరడజను అరటిపండ్లలో రెండు సాధువు చేతిలో పెట్టాడు సాంబు. ఒక చిరునవ్వు నవ్వి అందుకున్నాడు సాధువు.

రైలులో జనం బిచాణాలు పరుచుకొని నిద్రపోతున్నారు. స్థలంలేక కొందరు కూర్చునే నిద్రపోతున్నారు. క్రిక్కిరిసిన జనం విడిచిన ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వేడి ఆవిర్లలా ముఖాన్ని దూసుకుపోతున్నాయి. చల్లగాలికోసం ముఖం కిటికీవైపు త్రిప్పుకున్నాడు సాంబు.

ఆరిపోయిన చుట్టపారేసి, అరటిపండ్లు ఆరగిస్తున్నాడు సాధువు.

ఒకమూల తదేకధ్యానంగా నవల చదువుతున్న ఒక వయసుకుర్రాడు, మరొకమూల పద్దులు చూసుకుంటున్న ఒక గుమాస్తా, యింకోచోట పైన, కింద, పెట్టిన సామాన్లు, భద్రంగా ఉన్నాయా లేదా అని పగలపడి చూస్తూ నిద్రమత్తులోంచి ఉలిక్కిపడే ఒక ముసలాయన తప్ప, తక్కిన వారంతా నిద్రపోతూనే వున్నారు, తమ సంచీలు గట్టిగా చేత్తో పట్టుకుని.

సాధువు పలకరించాడు.

'ఒక చుట్టముక్క ఉందా బాబూ!'

'నేను చుట్టలు కాల్చను!'

'పోనీ ఒక సిగరెట్టైనా సరే'

'అదికూడా కాల్చను'

'పోనీ ఒక అణాయిప్పిస్తారూ?'

చుట్టా సిగరెట్టు అణా అంతస్థులు పెరుగుతున్న అతని యాచన సాంబుకు విచిత్రమనిపించింది.

ముష్టివాడికి దయతో యిచ్చినట్లు జేబులోంచి ఒకఅణాతీసి యిచ్చాడు సాంబు.

'ఎక్కడిదాకా వెడుతున్నారు?'

'మా లాంటిసాధువులు ఒక గమ్యస్థానం పెట్టుకోరు. భగవాన్ ఎక్కడికి తీసుకువెడితే అక్కడికే!'

ఒక స్టేషనులో రైలుఆగింది. ప్లాటుఫారం మీద కేకలు పెట్టే కుర్రాడిని పిలిచి అణా చుట్టలు కొనేశాడు సాధువు. ఉన్న ఒక్క అణాకూడా చుట్టలమీద ఖర్చుపెట్టిన సాధువు, యింక డబ్బులేక ఎలా బ్రతుకుతాడా అనే ఆశ్చర్యం సాంబుకి కలిగింది.

'తమరి పేరు?'

'నా కొక పేరులేదు. నా పూర్వాశ్రమంలోని పేరు అందరూ మర్చిపోయేఉంటారు. నన్ను యిప్పుడు భగవాన్‌దాసు అని పిలవవచ్చు. దైవచింతన తప్ప మరొకటి లేదు మనకి.'

'తమరు తీర్థయాత్రలు చేశారాండీ!'

'ఓ కాశీ, కామేశ్వరము, ప్రయాగ, కాళహస్తి, బృందావనం తిరగనీ ఊరులేదు. ఆ ప్రదేశాలన్నీ చూస్తూంటే, ఆ పరమాత్ముడి లీలలన్నీ అర్థమౌతాయి. ఒక్కొక్కసారి ఆ పరమాత్మ చూపించే విజ్ఞానపు వెల్గులు మనకు తన్మయత్వం కలిగిస్తాయి. ఈ జీవితంలో ఎన్నో అనుభవాలు!!' సాధువు చుట్టకోసం కొరికి బయటికి ఉమ్మేశాడు. ఒక నిట్టూర్పు విడిచి పెట్టెకు జార్లపడ్డాడు.

'తమది అసలు ఏవూరండీ!'

'నాయనా! పూర్వాశ్రమం గురించి అడగకు! మనస్సుకు అన్నీ కలతలే! మనశ్శాంతి పాడైపోతుంది.'

'మీ అనుభవాలు చెప్పండి. నేనూ ఒక పాఠం నేర్చుకున్నట్లవుతుంది.. నా

★ ఉదయ కిరణాలు ★

జీవితంలో జరిగిన సంఘటనలు నన్ను విరాగిగా చేశాయి...ఎక్కడికి పోదామా అనుకుంటున్నాను!' సాంబు ఉద్రేకంతో శ్వాస విడిచాడు.

సాధువు గడ్డం చేత్తో రాసుకుని నవ్వాడు.

'నా కొక అందమైన భార్య ఉండేది... ఎంతో అందంగా ఉంటుంది...ఆమె నాకు మేనరికము... అట్టే డబ్బులేనివాళ్లు... అందువల్ల నా అదృష్టం పండింది. నేను వ్యవసాయం చేసేవాణ్ణి...కండలు తిరిగిన శరీరంతో ఆకర్షణీయంగా ఉండేవాణ్ణి... కాని ఉండేది గ్రామం...పల్లెటూరి మనిషిలా బ్రతికేవాణ్ణి. నా భార్యకు నేను నచ్చలేదు కాబోలు...లేక చిన్నప్పటి నుంచి ఆ బుద్ధి ఉందో తెలియదు...నాగరకత మోజు అంటే ఆమె కిష్టం...హుషారుగా రౌడీలా గ్లాస్కో మల్లు పంచ చొక్కాలతో ఉంగరాలు, గిరజాల క్రాపుతో టెక్కుతో తిరిగే ప్రక్కయింటి కుర్రాణ్ణి చేరదీసింది...

నాకా సంగతి తెలియదు. ఒకరోజు ఊరువెళ్లి యింటికి రాత్రి వచ్చాను. పది గంటలు..ఇంక నేను రాననుకుంది కాబోలు. తలుపు కొట్టగానే ధైర్యంగా తలుపు తీసింది - ఎవరో అనుకుంది కాబోలు... గుమ్మంలో అడుగుపెట్టగానే తొట్రుపాటుతో బాధపడింది.

'ఏమండీ! దొడ్లో ఒక వింత ఉంది చూశారా?' అంటూ ఆశ్చర్యం చూపించి నన్ను సరాసరి దొడ్లోకి నడిపించింది. 'ఉండండి లైటు తెస్తా' అని లోపలికి వెళ్లింది. అయిదు నిమిషాలు ఆలస్యంచేసి, లైటుతో వచ్చింది. 'చూశారా ఎంత పెద్ద తేనెపట్టు పట్టిందో! మనం చూడనేలేదు. వేపచెట్టు కొమ్మను కదిపాను చేతికర్రతో తేనెటీగలు చెదిరి నన్ను కుట్టాయి.

బాధతో గబగబా యింట్లోకి వచ్చేశాను. గదిలోంచి కుర్రాడు పరుగెత్తాడు వీధి గుమ్మంవైపు.

'ఏమిటది!' అరిచాను.

'ఏమో!' బుకాయించింది.

'నిజం చెప్పు' నిలదీశాను.

'నాకు తెలియదు.'

ఆమె చెంప ఛెళ్ళుమంది.

ఏడుస్తూ క్రిందపడిపోయింది. 'నిజం చెప్పు!' అంటూ గదిమాను. 'నిజం. అవును. నేను మీతో కాపురం చెయ్యను.' వీధిలోకి నడవబోయింది. ఉక్రోషం ఆగలేదు నాకు. శరీరంలో పొట్టేళ్లు దెబ్బలాడుకుంటున్నంత ధ్వంసం జరిగింది. 'చంపేస్తా' ప్రక్కనే ఉన్న గునపంతీశాను ఆమెను పట్టుకుని. 'చంపుమాద్దాం!'అరిచింది పెంకిగా ఆమె. ఆమె గుండెలమీద ఒక్కపోటు—రక్తం జలలా పైకి రివ్వుమని ఉబికింది. మూల్గుతూ కూలబడింది ఆమె. అందమైనభార్య..అలముకున్న రక్తం గడ్డలు...కళ్లు చెదిరి చీకట్లు కమ్మాయి...పరారి అయ్యాను...సంసారం మీద విరక్తికలిగింది...అంతే సాధువుగా బ్రతక దల్చుకున్నాను!'

ఈ కథవిని సాంబుకి సాధువుపై జాలి కలిగింది—ఆడవాళ్లు ఎంతకైనా తగుదురు!!

'ఇంక నాకేమీ అక్కర్లేదు...ఒక్క దైవచింతన తప్ప!' నిట్టూర్పు విడిచాడు సాధువు.

ఈ సాధువువెంట వెళ్ళిపోదామా అనుకున్నాడు సాంబు. చాలా మంచివాడులా కనిపిస్తున్నాడు.

'నేనుకూడా మీతో రావచ్చా!'

'ఎక్కడికి!'

'మీరు ఎక్కడికి వెడితే అక్కడికే!'

సాధువు నవ్వాడు.

'నీ ఋషం నాయనా! పరమాత్మ నన్ను చూపినట్టే నిన్నూ చూస్తాడు!'

సాధువు కంబళీ కప్పుకుని, రుద్రాక్ష మాల తీసుకున్నాడు.

'తెల్లవారగానే లేపుతా! పడుకో నాయనా!'

సాధువు జపం మొదలుపెట్టాడు.

ఆలోచనలతో సాంబు నిద్రలోపడ్డాడు.

రాత్రి రెండుగంటలకు గొల్లుమని కేకలు, అలజడి పెట్టెలో వినిపించాయి! కళ్లుతెరిచాడు సాంబు. సామాన్లు జాగ్రత్తగా చూసుకుంటూ ఏడుస్తున్న ముసలాయన తల మొత్తుకుంటున్నాడు....ఒక ట్రంకుపెట్టె కనిపించటంలేదు. కూతురు పెళ్ళికి కొన్న వెండికంచం, వెండి చెంబు, కొత్త సిల్కు

చీరలు... ఉంగరాలు... ఎన్నో ఉన్నాయి అందులో. యింటికి తీసుకువెడుతున్నాడు. ...మూడు వేల సొమ్ము పోయింది.

సాంబు లేచి కూర్చున్నాడు "అరెరె పాపం!" ప్రక్కన సాధువు కనిపించలేదు.

రైలు పెట్టెలో పెద్ద నోటీసు ఎదురుగా కనిపించింది 'దొంగలున్నారు జాగ్రత్త! ఒక్క నిముషం కంగారుపడ్డాడు సాంబు. సాధువుతో స్నేహంగా మాట్లాడినందుకు తను అతడికి శిష్యపరమాణువనుకుని నలుగురూ పట్టుకుని బాదితే!!

కళ్లు మూసుకుని జోగులో పడ్డాడు సాంబు.

పూరీలో దిగాడు సాంబు. టిక్కటు కలెక్టరును తప్పించుకుని, ప్లాటుఫారం మూలగా ఉన్న చెట్టుమీంచి వీధులోకి దూకి నడిచాడు. ఆకలి దహించుకుపోతోంది. ఎక్కడైనా హోటల్లో భోంచేద్దామని బజారు వైపు నడిచాడు.

నాల్గడుగులు వెయ్యగానే ఒక సత్రవు కనిపించింది. జనం హడావడిగా తిరుగుతున్నారు.

లోపల ఏదో పెళ్లిజరుగుతూంది కాబోలు! సత్రవు బయట ఒక పల్లకీ, బోయీలు, సన్నాయి వాళ్లు కూర్చున్నారు.

నీరసంతో సత్రవు అరుగుమీద కాస్సేపు విశ్రాంతి తీసుకుందామని కూర్చున్నాడు సాంబు.

'లెండి! లెండి! భోజనాలకి లెండి! వడ్డించేశాము' ఒక పెద్దమనిషి పట్టు పంచె బిగకట్టి హడావడిగా పిలిచాడు.

సత్రపు అరుగుమీద గోతి దగ్గర నక్కల్లా ఆవురు ఆవురుమంటూ కూర్చుని కాలక్షేపానికి ఏవో కబుర్లుచెప్పుకుంటూన్న బ్రాహ్మణ సమూహం ఒక్కసారి లేచారు.

'భోజనానికి పిలిచారు లెండి' అంటూ ప్రక్కనే ఉన్న సాంబును తామే పెళ్ళి పెద్దలన్నట్లు ఆహ్వానించారు.

ఈ అవకాశం వినియోగించుకోవడమే మంచిదని సాంబు లేచి చేతులు కడుక్కొని పంక్తిలో కూర్చున్నాడు.

రాత్రి పడగానే పెళ్లివారు సత్రవు ఖాళీ చేశారు. వీధి అరుగుమీద ముష్టివాళ్ళు, బైరాగులు చేరారు. ఎదురుగా చింత చెట్టు క్రింద కొందరు ముష్టివాళ్ళు పొయ్యిరాజేసుకుని గిన్నెలతో గంజి కాచుకుంటున్నారు. ఇద్దరు సన్యాసులు జేగురు రంగు బట్టలు ఉదుకుకుని వరండాలో ఆరేసుకుంటున్నారు. పడుచు పెళ్ళాన్ని వెంట వేసుకుని ఒక ముసలి భర్త ఆ సత్రవులో ఒకగది అద్దెకు తీసుకున్నాడు. దూరంనుంచి ఏవో భజన కీర్తనలు వినిపిస్తున్నాయి. గుడి గంటలు దూరాన మ్రోగుతున్నాయి.

ఏ ఆధారం లేక పక్షుల్లా తిరిగే ముష్టివాళ్లు చీకూ చింతా లేకుండా జీవితాలు గడుపుతున్నారు. జీవితంలో సమస్యలు సృష్టించుకుంటేనే బెడద పట్టుకుంటుంది. అవి పరిష్కరించుకోవాలనే ప్రయత్నంలో ఎన్నో విషమపరిస్థితులు ఏర్పడుతుంటాయి. తన బ్రతుకు అలాంటిదే అనే ఆలోచనలో పడ్డాడు సాంబు.


పూరీ జగన్నాథుడి దర్శనం చేసుకున్నాడు. అన్నం మూటల ఫలహారాలు ఆరగించాడు. మళ్లీ రైలు ఎక్కాడు. ఒక గమ్యం అనేది లేకుండా తీర్థయాత్రలు చేయాలనుకున్నాడు సాంబు.

కాశీ, గయా, బృందావనం, బ్రహ్మకపాలం దర్శించాడు. పవిత్ర నదుల్లో స్నానాలు చేశాడు. ముష్టివాళ్లతో కలిసి ముష్టి ఎత్తుకున్నాడు. బైరాగుల్లో కలిసి భిక్ష మడుక్కొని కాలం గడిపేడు. సన్యాసులకు సేవచేశాడు. ఎక్కడా సంతృప్తి కనిపించలేదు.

తీర్థయాత్రలలో అనేక దేవాలయాలు దర్శించాడు. రాత్రి దైవారాధనలు పూర్తి అయ్యాక భజనలు, పురాణాలు జరుగుతుండేవి. తండోపతండాలుగా జనంవచ్చి పురాణాలు వినేవారు. పురాణం మధ్యలో స్వంతగొడవలలో నిమగ్నులయ్యే ప్రేక్షకులు, పురాణం పేరు మీదుగా వచ్చి ఒకళ్లనొకళ్లు చూచుకుని ఆనందించే యువతీ యువకులు - ప్రసాదాలు ప్రధానంగా ఎంచి వచ్చే కుర్రకారు, పురాణం అయినాక పళ్లెంలో వేసిన పైసలు ఎక్కువ ఆసక్తితో లెక్క పెట్టుకునే పురాణం శాస్త్రిగారు.. వీరందరిలో దైవచింతకన్న ప్రాపంచిక స్వార్థం ఎక్కువగా కనిపించింది. ఎటొచ్చీ దైవం పేరుమీదుగా అయితే స్వార్థం మరింత సులువుగా సాధించవచ్చు.

పుణ్యదినాల పేరుమీదుగా కోటానుకోట్ల జనం దేవాలయాలను చుట్టుముట్టతారు. సాంబు శ్రీశైలం చేరాడు. పుణ్యదినాలు... జనం వరదల్లా కొట్టుకు వస్తున్నారు... చుట్టూ దుర్గమమైన మహారణ్యాలు...లంబాడీలు కొందరికి అండగా నడుస్తున్నారు... కార్లు బళ్ళు పరుగెడుతున్నాయి...ఎత్తైన కొండ...శివుడికి ప్రణామాలు చేశారు... చేసినపాపాలు ప్రక్షాళనం చేసుకున్నారు పాతాళ గంగలో...రెండుమైళ్ళ క్రింద దాక్కున్న నేరేడుపండ్ల నీరాలలో... ఎండ మిటమిట లాడుతోంది....ఒకచోట కలరావచ్చిందన్నారు.. జనంలో భీభత్సం. జనం చెట్లఆకులు రాలిపోయినట్లు చనిపోతున్నారు...ఒకటి... రెండుకాదు. వెయ్యి ...రెండు...వేలు.


పాపాలు పోగొట్టుకుందామనుకునే భక్తులకు మరణమే సంప్రాప్తించింది...మోక్షం వచ్చిందనుకున్నారు కొందరు....మరికొందరు ఆ మోక్షంనుంచి పారిపోయారు....కొండ మీద త్రాగినీరు....పీల్చినగాలి...యింకా వెన్నంటేయి భక్తపరమాణువులను...కలరా



మా నిపుణుడు బట్ట క్రుంగుటలోగల విషయములను మిల్లు సూపరింటెండెంటుతో చర్చిస్తున్నారు. ప్రపంచములో యితర నిపుణుల అనుభవములను ఆయన పొందవచ్చును.



మా నిపుణుడు తన ఫలితములను మిల్లుయొక్క సూపరింటెండెంటుకు తెలియపర్చిన తరువాత వివరములను న్యూయార్కులోవున్న వారి హెడ్ ఆఫీసుకు వ్రాయును.



ఈ లోగానే షాపుల నుండి గోడౌనుల నుండి తీసిన యితర 'సాన్ఫొరైజ్డ్' బట్టల నమూనాలు ఆఖరుసారిగా సరి చూచుటకు [illegible] న్యూయార్కు పంపబడును.

పై ప్రకారము ప్రతిరోజు, ప్రతివారం ప్రతి సంవత్సరము, ప్రతి మిల్లులో—ప్రపంచమంతటా జరుగుతోంది.

మీరు గమనించకుండా మేము చేస్తున్న యీ పరీక్షలు, మరియు మిల్లులు జాగ్రత్తగా జరుపుతున్న పద్ధతులే 'సాన్ఫొరైజ్డ్' గురుతును లక్షలాది [illegible] నమ్మకమును పొందేలా చేసేయి!



సాన్ఫొరైజ్డ్ — కె — మెహమాన్:
మనోరంజకమైన ఈ హిందీ ప్రసారమును రేడియో సిలోన్‌లో ప్రతి మంగళవారము రాత్రి 7-30 గం॥లకు 41 మీటర్లపై వినండి.

క్లూయెట్, పీబోడీ అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ వారు, క్రుంగకుండా ఉండవలసిన కఠినమగు వివరములకు తగిన బట్టలమీద మాత్రమే వారిచే 1930 సం॥రములో ప్రవేశపెట్టబడిన 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కును వేయనిస్తారు. 'సాన్ఫొరైజ్డ్' బట్టతో తయారైన దుస్తులు [illegible] ఎన్నటికీ క్రుంగవు!

సాన్ఫొరైజ్డ్ సర్వీస్, 'పారిజాత్', నేతాజీ సుభాష్ రోడ్, మెరీన్ డ్రైవ్, బొంబాయి 2

ACP. 1705

ప్రక్కఊళ్ళల్లో వ్యాపించింది...పదినిమిషాలక్రితం ప్రాణంతో ఉన్న మనుష్యులు ఎందరో అదృశ్యమైపోయారు...కలరా కలవరం తెచ్చింది....ఇంటింట్లా శోభ పెట్టింది... ఇదంతా భక్తిఫలితమే! సాంబువ్యాకపడ్డాడు.

తిరుపతికొండలు ఎక్కాడు. నక్షత్రమాలకొండ దాటగానే ఆయాసంవచ్చింది. మజిలీల్లకై ఏర్పరచబడిన దారిగుడులలో విశ్రాంతి తీసుకుని చేవాడు. కొర్లు నడుస్తున్నాయి, ఆయాసంగా పైకి. అక్కడక్కడ చెట్లక్రింద చాలా దూర దూరంగా ముష్టివాళ్లు...ఒకళ్ళిద్దరు...పంచలు పరుచుకుని ప్రయాణీకు లిచ్చే పైసలు లెక్క పెట్టుకుంటున్నారు... దైవాన్ని దర్శించడమే కష్టమైపోయింది. దర్శనానికికూడా పరువు, ప్రతిష్ఠ గొప్పతనం, డబ్బుకావాలి.... మూఢ నమ్మకాలకు బలిగా ఏడుకొండలు దాటి ఎంతో శ్రమపడితే వెంకటేశ్వరుని శిరస్సైనా కనిపించలేదు...ఇంతికన్న సినీమాలోనే దేవుడు బాగా కనిపించాడు అనుకున్నాడు సాంబు.

ఎన్నో పురాణాలు విన్నాడు సాంబు. ఋషులు మహారణ్యాలలో...ఆశ్రమాలు స్థాపించుకుని కందమూల ఫలాలు భక్షిస్తూ ఘోర తపస్సులు చేసేవారని...క్రూరమైన పెద్ద పులులు...భయంకరమైన త్రాచులు.. బలిష్ఠమైన ఏనుగులు...అరణ్యాలను పాలించే సింహాలు యీ ఋషుల ముందు పిల్లుల్లా చెలగాటాలు ఆడేవట ... లేళ్లు, సింహాలు, పాములూ, కప్పలు, ముంగిసలు త్రాచులు.. పెద్దపులులు మేకలు...స్నేహంతో వారి ఆశ్రమాలలో మెలగేవట...ఎక్కడైనా ముచ్చుకు అటువంటి పుణ్యస్థలం కనపడుతుందా అని వెతికాడు సాంబు. కాని ఎక్కడా కనిపించలేదు. ఎవరైనా పవిత్రుడు సిద్ధుడు అయిన సన్యాసి కాని, యోగికాని కనిపిస్తే ఆయనతో చేరి జీవితాంతం దైవ చింతనతో గడిపేద్దామనుకున్నాడు సాంబు. కాని అటువంటి వారెవరూ తటస్థపడలేదు.

ఒక్కొక్కసారి విచారించేవాడు సాంబు యిల్లు ఎందుకు విడిచి వచ్చేశాను ... అమ్మ ఏడుస్తోంటుంది ... అన్నయ్య మద్రాసులోనే వున్నాడా—అవధాని మామయ్య ఏం చేస్తున్నాడో...యింటికి వెళ్ళాలనిపించేది. కాని పూబంతి లేని జీవితం ఒంటరిగా యింట్లో ఎట్లా గడపడం ?...

తిరుపతి దేవాలయాన్ని విడిచి చంద్రగిరి వైపు నడిచాడు ... పల్లటి దప్పాలు... సన్నటి బాట...చుట్టూ రాళ్లు రప్పలు... చెట్టు చేమలు...ఎత్తుమీదనుంచిచూస్తే క్రింద చంద్రగిరి పట్టణం కనిపిస్తోంటుంది... దారికిరువైపులా చందన వృక్షాలు వాసనలు వెదజల్లుతున్నాయి ... మత్తెక్కుతోంది ... పచ్చటి పాములు చెంతాడుల్లా కొమ్మలనంటి వెళ్ళాడుతున్నాయి. భయంకరంగా మిలమిలా మెరుస్తున్నాయి. అనంతమైన ఆకాశం...పరిమితి లేని ప్రకృతి...ప్రకృతిలోని అగాధ విచిత్రాలు ... ఈ మహా విశ్వంలో ఒక నలుసులాంటి మనిషి...వాని జీవితం విలువ ఎంత ?...తనలో నవ్వుకున్నాడు సాంబు.

చంద్రగిరి ఒక మైలులో ఉంది. కాళ్ళు నెప్పిపుట్టాయి. ఒక మఱ్ఱిచెట్టుక్రిందకు చేరాడు. అక్కడ మఱ్ఱిచెట్టు తొండట్లో కూర్చుని ఒక సన్యాసి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

సాంబువైపు చూశాడు అతను. 'నీలో బ్రహ్మవర్చస్సు ఉంది నాయనా!'

తాను మాట్లాడకుండానే తన గురించి శ్రద్ధ తీసుకుంటున్న సన్యాసిని సాంబు చూశాడు.

'చాలా విసిగిపోయి వస్తున్నావు?'

'నీకు దైవానుగ్రహం లభించింది!'

'చిన్నతనంలోనే కష్టాలు నీమీద పడ్డాయి!'

'ఇల్లు విడిచి వచ్చేశావు!'

'దైవంలో లీనం కావాలనుకుంటున్నావు!'

'ముక్తిమార్గం చాలా దగ్గరలో ఉంది!'

'ఒక ప్రేయసిని పోగొట్టుకున్నావు!'

'బాధ భరించలేక బయటపడిపోయావు!'

'ఇంక భయం లేదు!'

సన్యాసి అభయహస్తం యిస్తున్నట్లు కమండలంలోని నీరుతీసి సాంబుమీద చల్లాడు. ఒళ్లంతా ఏదో మైకం కమ్మి గగుర్పొడిచినట్లయింది. మెదడు తేలిపోయింది.

లేచి సన్యాసివైపు నడిచాడు.

'మీ పేరు?'

'చిదానందస్వామి.'

'నన్ను గురించి నిజం కనుక్కున్నారు!'

'నాకంతా తెలుసు!'

'నాకు మీతో ఉండిపోవాలని ఉంది!'

'అందుకే నేనుయిక్కడకు వచ్చాను!'

సన్యాసి లేచి నుంచున్నాడు. ముందుకు నడిచాడు.

సాంబు అతన్ని అనుసరించాడు.

కొండలు, గుట్టలు, రోడ్లు దాటారు. సాంబుకు దాహం వేసింది.

సన్యాసి కమండలంలోని నీరు ఇచ్చాడు.

సాంబుకు ఆకలి వేసింది.

సంచిలోని అరటిపళ్లు యిచ్చాడు తినడానికి.

ఎక్కడికి నడుస్తున్నాడో అర్థంకాలేదు సాంబుకు.

సూర్యాస్తమయం అయింది.

సన్యాసి మాటా, పలుకూ లేకుండా నిశ్చలంగా నడుస్తున్నాడు.

'ఇంకా ఎంతదూరం మీ ఆశ్రమం?

'వచ్చేశాము!'


మసక చీకట్లు కమ్మాయి.

రెండుఫర్లాంగుల దూరంలో కొన్ని గుడిసెలు...చిన్న చిన్న దీపపుకాంతులు కనిపించాయి.

'అదే మన ఆశ్రమం' సన్యాసిచెప్పాడు.

తాటాకులతో కప్పు....మట్టిగోడలు... లోపల నాల్గు గదులు... ఎదుళ్ళతో ఒక చిన్న దొడ్డి, వెనుక భాగంలో....ఒక తులసి ...కుండీ ..ఇల్లంతా అలికి పెట్టినముగ్గులు ముచ్చటగా ఉంది ఆ ఆశ్రమం.


సన్యాసిలోపలకు ఒక గదిలోకి తీసుకు వెళ్ళాడు. నాల్గు ఈతాకుల చాపలు పరిచి



మా నిపుణుడు బట్ట క్రుంగుటలోగల విషయములను మిల్లు సూపరింటెండెంటుతో చర్చిస్తున్నారు. ప్రపంచములో యితర నిపుణుల అనుభవములను ఆయన పొందవచ్చును.



మా నిపుణుడు తన పరిశోధనలను మిల్లుయొక్క సూపరింటెండెంటుకు తెలియపర్చిన తరువాత వివరములను న్యూయార్కులోవున్న హెడ్ ఆఫీసుకు వ్రాయును.



ఈ లోగానే షాపుల నుండి గోడౌనుల నుండి తీసిన యితర 'సాన్ఫొరైజ్డ్' బట్టల నమూనాలు ఆఖరుసారిగా సరి చూచుటకు ఓడలో న్యూయార్కు పంపబడును.

పై ప్రకారము ప్రతిరోజు, ప్రతివారం, ప్రతి సంవత్సరము, ప్రతి మిల్లులో — ప్రపంచమంతటా జరుగుతోంది.

మీరు గమనించకుండా మేము చేస్తున్న యీ పరీక్షలు, మరియు మిల్లులు జాగ్రత్తగా జరుపుతున్న పద్ధతులే 'సాన్ఫొరైజ్డ్' గురుతును లక్షలాది జనుల నమ్మకమును పొందేలా చేసేయి!

·SANFORIZED·
REGD TD MK
SHRUNK FABRIC

సాన్ఫొరైజ్డ్ — కె — మెహమాన్:
మనోరంజకమైన ఈ హిందీ ప్రసారమును రేడియో సిలోన్‌లో ప్రతి మంగళవారము రాత్రి 7-30 గం॥లకు 41 మీటర్లపై వినండి.

క్లూయెట్, పీబోడీ అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ వారి, క్రుంగకుండా ఉండవలసిన కఠినమగు వివరములకు తగిన బట్టలమీద మాత్రమే వారిచే 1930 సం॥రములో ప్రవేశపెట్టబడిన 'సాన్ఫొరైజ్డ్' పేరు మార్కును వేయనిస్తారు. 'సాన్ఫొరైజ్డ్' బట్టతో తయారైన దుస్తులు కొలతప్పుడూ ఎన్నటికీ క్రుంగవు!

సాన్ఫొరైజ్డ్ సర్వీస్, 'పారిజాత్', నేతాజీ సుభాష్ రోడ్, మెరీన్ డ్రైవ్, బొంబాయి 1

ACP. 1785

ఉదయ కిరణాలు

ప్రక్క ఊళ్ళల్లో వ్యాపించింది...పదినిమిషాలక్రితం ప్రాణంతో ఉన్న మనుష్యులు ఎందరో అదృశ్యమైపోయారు...కలరా కలవరం తెచ్చింది....ఇంటిల్లిపాదీ శోభ పెట్టింది... ఇదంతా భక్తిఫలితమే! సాంబు వ్యాకుపడ్డాడు.

తిరుపతికొండలు ఎక్కాడు. సత్రం మోకాలుకొండ దాటగానే ఆయాసం వచ్చింది. మజిలీలకై ఏర్పరచబడిన దారిగుడులలో విశ్రాంతి తీసుకునే వాడు. కాళ్లు నడుస్తున్నాయి, ఆయాసంగా పైకి. అక్కడక్కడ చెట్లక్రింద చాలా దూరదూరంగా ముష్టివాళ్లు...ఒకళ్ళిద్దరు...పంచలు పరుచుకుని ప్రయాణీకు లిచ్చే పైసలు లెక్కపెట్టుకుంటున్నారు... దైవాన్ని దర్శించడమే కష్టమైపోయింది. దర్శనానికికూడా పరువు, ప్రతిష్ఠ గొప్పతనం, డబ్బు కావాలి.... మూఢ నమ్మకాలకు బలిగా ఏడుకొండలు దాటి ఎంతో శ్రమపడితే వెంకటేశ్వరుని శిరస్సైనా కనిపించలేదు...ఇంతికన్న సినీమాలోనే దేవుడు బాగా కనిపించాడు అనుకున్నాడు సాంబు.

ఎన్నో పురాణాలు విన్నాడు సాంబు. ఋషులు మహారణ్యాలలో...ఆశ్రమాలు స్థాపించుకుని కందమూల ఫలాలు భక్షిస్తూ ఘోర తపస్సులు చేసేవారని...క్రూరమైన పెద్దపులులు...భయంకరమైన త్రాచులు.. బలిష్ఠమైన ఏనుగులు...అరణ్యాలను పాలించే సింహాలు యీ ఋషుల ముందు పిల్లుల్లా చెలగాటాలు ఆడేవిట ... లేళ్లు, సింహాలు, పాములూ, కప్పలు, ముంగిసలు త్రాచులు.. పెదపులులు మేకలు...స్నేహంతో వారి ఆశ్రమాలలో మెలగేవిట...ఎక్కడైనా మచ్చుకు అటువంటి పుణ్యస్థలం కనపడుతుందా అని వెతికాడు సాంబు. కాని ఎక్కడా కనిపించలేదు. ఎవరైనా పవిత్రుడు సిద్ధుడు అయిన సన్యాసి కాని, యోగికాని కనిపిస్తే ఆయనతో చేరి జీవితాంతం దైవచింతనతో గడిపేద్దామనుకున్నాడు సాంబు. కాని అటువంటి వారెవరూ తటస్థపడలేదు.

ఒక్కొక్కసారి విచారించేవాడు సాంబు యిల్లు ఎందుకు విడిచి వచ్చేశాను ... అమ్మ ఏడుస్తోంటుంది ... అన్నయ్య మద్రాసులోనే వున్నాడా—అవధాని మామయ్య ఏం చేస్తున్నాడో...యింటికి వెళ్ళాలనిపించేది. కాని పూబంతి లేని జీవితం ఒంటరిగా యింట్లో ఎట్లా గడపడం ?...

తిరుపతి దేవాలయాన్ని విడిచి చంద్రగిరి వైపు నడిచాడు ... పల్లటి దపాలు... సన్నటి బాట...చుట్టూ రాళ్లు రప్పలు... చెట్లు చేమలు...ఎత్తుమీదనుంచిచూస్తే క్రింద చంద్రగిరి పట్టణం కనిపిస్తోంటుంది... దారికిరువైపులా చందన వృక్షాలు వాసనలు వెదజల్లుతున్నాయి ... మత్తెక్కుతోంది ... పచ్చటి పాములు చేంతాడుల్లా కొమ్మలనంటి వేళ్ళాడుతున్నాయి. భయంకరంగా మిలమిలా మెరుస్తున్నాయి. అనంతమైన ఆకాశం...పరిమితి లేని ప్రకృతి...ప్రకృతిలోని అగాధ విచిత్రాలు ... ఈ మహా విశ్వంలో ఒక నలుసులాంటి మనిషి...వాని జీవితం విలువ ఎంత ?...తనలో నవ్వుకున్నాడు సాంబు.

చంద్రగిరి ఒక మైలులో ఉంది. కాళ్ళు నెప్పిపుట్టాయి. ఒక మఱ్ఱిచెట్టుక్రిందకు చేరాడు. అక్కడ మఱ్ఱిచెట్టు మొదట్లో కూర్చుని ఒక సన్యాసి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

సాంబువైపు చూశాడు అతను. 'నీలో బ్రహ్మవర్చస్సు ఉంది నాయనా?'

తాను మాట్లాడకుండానే తన గురించి శ్రద్ధ తీసుకుంటున్న సన్యాసిని సాంబు చూశాడు.

'చాలా విసిగిపోయి వస్తున్నావు?'

'నీకు దైవానుగ్రహం లభించింది!'

'చిన్నతనంలోనే కష్టాలు నీమీద పడ్డాయి!'

'ఇల్లు విడిచి వచ్చేశావు!'

'దైవంలో లీనం కావాలనుకుంటున్నావు!'

'ముక్తిమార్గం చాలా దగ్గరలో ఉంది!'

'ఒక ప్రేయసిని పోగొట్టుకున్నావు!'

'బాధ భరించలేక బయటపడిపోయావు!'

'ఇంక భయంలేదు!'

సన్యాసి అభయహస్తం యిస్తున్నట్లు కమండలంలోని నీరుతీసి సాంబుమీద చల్లాడు. ఒళ్లంతా ఏదో మైకం కమ్మి గగుర్పొడిచినట్లయింది. మెదడు తేలిపోయింది.

లేచి సన్యాసివైపు నడిచాడు.

'మీ పేరు?'

'చిదానందస్వామి.'

'నన్ను గురించి నిజం కనుక్కున్నారు!'

'నాకంతా తెలుసు!'

'నాకు మీతో ఉండిపోవాలని ఉంది!'

'అందుకే నేనుయిక్కడకు వచ్చాను!'

సన్యాసి లేచి నుంచున్నాడు. ముందుకు నడిచాడు.

సాంబు అతన్ని అనుసరించాడు.

కొండలు, గుట్టలు, రోడ్లు దాటారు. సాంబుకు దాహం వేసింది.

సన్యాసి కమండలంలోని నీరు ఇచ్చాడు.

సాంబుకు ఆకలి వేసింది.

సంచిలోని అరటిపళ్లు యిచ్చాడు తినడానికి.

ఎక్కడికి నడుస్తున్నాడో అర్థంకాలేదు సాంబుకు.

సూర్యాస్తమయం అయింది.

సన్యాసి మాటా, పలుకూ లేకుండా నిశ్చలంగా నడుస్తున్నాడు.

'ఇంకా ఎంతదూరం మీ ఆశ్రమం?

'వచ్చేశాము!'

మసక చీకట్లు కమ్మాయి.

రెండుఫర్లాంగుల దూరంలో కొన్ని గుడిసెలు...చిన్న చిన్న దీపపుకాంతులు కనిపించాయి.

'అదే మన ఆశ్రమం' సన్యాసిఅన్నాడు.

తాటాకులతో కప్పు....మట్టిగోడలు... లోపల నాలుగు గదులు... వెదుళ్ళతో ఒక చిన్న దొడ్డి, వెనుకభాగంలో....ఒక తులసి ...కుండీ..ఇల్లంతా అలికి పెట్టినముగ్గులు ముచ్చటగా ఉంది ఆ ఆశ్రమం.

సన్యాసిలోపలకు ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు. నాలుగు ఈతాకుల చాపలు పరిచి

ఉన్నాయి. ఒక మేకుకు రెండు కాషాయ రంగుగానులు తగిలించిఉన్నాయి.

'కూర్చోనాయనా!'

వ(న)మ్రతగా కూర్చున్నాడు సాంబు.

'నాంచారీ!' సన్యాసి కేక పెట్టాడు. ముఖాన్ని సిందూర తిలకం పట్టుచీరతో ముప్ఫయేళ్ల వయసులోని ఒక అందమైన స్త్రీ వచ్చింది.

'ఈ బాబు మన అతిథి యీవేళ'

ఆమె నవ్వుకుంటూ లోపలికిపోయింది.

సన్యాసి దొడ్లోకి వెళ్లి స్నానం చేసి వచ్చాడు. దర్భాసనం పరుచుకుని జపంలో నిమగ్నుడైపోయాడు.

'నువ్వుకూడా వెళ్ళి స్నానం చెయ్యి బాబూ!' స్నానాదులు పూర్తిచేసుకుని రాగానే నాంచారి వడ్డనచేసి కూర్చుంది.

స్వంతయింట్లోలాగ కూర, పచ్చడి, పెరుగుతో భోజనం దొరకగానే ప్రాణం లేచివచ్చింది సాంబుకు.

రాత్రి ప్రయాణపు బడలికవల్ల హాయిగా నిద్రపట్టింది.

రోజూ ఆ ఆశ్రమానికి ఎవరోమనుష్యులు వెచ్చి వెడుతున్నారు. ఒంటరిగా చిదానంద స్వామితో గుసగుస లాడుతున్నారు. చింత నిప్పుల్లాంటికళ్లు, మెలిదిరిగిన మీసాలు—బలిష్టమైన నల్లటి శరీరాలు...చూడగానే త్రాగిన మోతుబరి రైతుల్లా కనిపించారు.

చిదానందస్వామి, సాంబుకు ఏమీ పని యివ్వలేదు. పూజకు కావలసిన పువ్వులు తేవడం, అర్చనసమయంలో అవసరమైన వస్తువులు అందివ్వడం బయటకువెడితే అతన్ని అనుసరించడం, యివే సాంబుకు నిర్ణయించబడిన పనులు.

నాంచారికూడా తనలాగే శుశ్రూష చెయ్యడానికివచ్చిన ఒక సన్యాసిని అనుకున్నాడు. ఆమె చూపించే ఆదరం...అభిమానం సాంబును సంతోషపెట్టేయి.

కాని క్రమంగా చిదానందస్వామి నాంచారి, మిగిలిన సన్యాసులు వీరి ప్రవర్తనంతో సాంబుకు అనుమానాస్పదంగా కనపడ సాగింది. ఒకనాడు మామూలు పనిగా, పువ్వులు తేవాలని వీధిలోకి వెళ్ళాడు. ఆ చుట్టు ప్రక్కల పదిగుడిసెలకంటె ఎక్కువ లేవు. ఒక చిన్న పల్లెలా ఉంటుంది.... వాళ్లు లంబాడీ గుడిసెలు—ఒక చాకలి—మంగలి...అంతే! తక్కిన జనం ఎవరో రైతుల్లా కనిపిస్తారు. ఆరోజు మాసినబట్టల మూట మోసుకుపోతున్న చాకలి కనిపించాడు. అతన్ని సాంబు పిలిచాడు. ఆవూరు గురించి, తానుంటున్న ఆశ్రమం గురించి అక్కడ మనుష్యుల్ని గురించీ ప్రశ్నించాడు.

'ఆ ముసలి సన్యాసి దొంగల ముఠాలో వాడు బాబూ! దొంగతనాలు స్వయంగా చెయ్యడు కాని చేయించి డబ్బు సంపాదిస్తాడంటారు అంతా! కాని నిజం ఆ పరమాత్ముడికే తెలియాలి!

'తమరు ఎన్నాళ్ళైంది బాబూ వచ్చి!'

'వారం రోజులయింది!,

'నాంచారమ్మగారు బాగున్నారా!'

'బాగుండకే! ఏం?'

'ముందు ముందు మీకే తెలుస్తుంది లెండి...'

'అసలు సంగతి నాతో చెప్పవోయి, ఫర్వాలేదు!'

'నా కెందుకు బాబూ! అయినా జాగ్రత్తగా మసులుకోండి. ఆళ్ళకిగాని కోపం వచ్చిందా ఎవడినో చంపిన కేసులో మిమ్మల్ని దూర్చి జైలుకు పంపుతారు!'

'ఆఁ' సాంబు నిర్ఘాంతపోయాడు.

చంద్రగిరికి పదిహేను మైళ్లు దూరంలో ఆ అరణ్యంలో బందిపోటు దొంగలు గుడిసెలు వేసుకుని రైతువేషాల్లో బ్రతుకుతున్నారు. చిదానందస్వామి నాంచారమ్మను లేవతీసుకువచ్చి, యీ దొంగలకు గురువై యిక్కడ జీవయాత్ర సాగిస్తున్నాడు. ధనికుడైన నాంచారమ్మ భర్తను చంపించాడు. కాని ఆస్తి ఆమె కొడుక్కు సంక్రమించింది. ఆ కొడుకునుకూడా చంపించి, తన దగ్గరే శుశ్రూష చేసే ఒక కుర్రాడిని నాంచారి కొడుకుగా మసిలేలా చేయాలని ఎత్తులు వేస్తున్నాడు చిదానందస్వామి. కాని నాంచారి కొడుకు మేజస్ట్రీటుగా ఉన్న పెత్తండ్రి అజమాయిషీలో ఉంటున్నాడు. అంగువల్ల చిదానందస్వామి పన్నుగడలు సాగటంలేదు.


ఒకరోజు అర్ధరాత్రివేళ అందరూ ఒళ్లు మరిచి నిద్రపోతున్నప్పుడు తలుపు జేరవేసి పరారి అయ్యాడు సాంబు. చుట్టూ భయంకరమైన అరణ్యం. గుండె చెదిరిపోయింది. రెండుమైళ్లు నడిచి ఒక కొండప్రక్కన తల దాచుకుని విశ్రమించాడు తెల్లారేవరకు.

*　　*　　*

ప్రయాణాలు, మజిలీలు పూర్తిచేసుకుని, విజయవాడ కృష్ణ ఒడ్డుకు చేరాడు సాంబు. ఆ పవిత్రమైన నదిలో స్నానంచేశాడు. ఉరకలిడుతూ పరుగులిడుతున్న కృష్ణానదికి సముద్రంలో కలవాలనే ఏకైక లక్ష్యం అయినట్లు కనిపించింది. ఏ కొండమూలలో పుట్టినా, ఏ వక్రమార్గాల్లో ప్రయాణం చేసినా, ఏ పర్వతాలు దారిని అడ్డుకున్నా, తన లక్ష్యంమాత్రం మరిచిపోవటం లేదనిపించింది. మనిషి జీవితంలోకూడా ఒకలక్ష్యం ఉండాలి. ఎటువంటి కష్టాలు, వక్రగతులు, జీవితాన్ని కుదిపి క్రుంగదీసినప్పటికి, గమనం లక్ష్యంవైపుకే ఉండాలి. అప్పుడే మహానదిలా జీవితంకూడా గంభీరమై రాణిస్తుంది. లక్ష్యం లేకుండా, అస్థిరభావాలతో గమ్యం లేకుండా ఒంటరిగా తిరిగే జీవితం వ్యర్థమనిపించింది సాంబుకు. ఒక లక్ష్యంతో ప్రశాంతమైన జీవితం గడపాలి. దైవచింతన కోసం ఉన్న ఊరు వదులుకోవడం మూర్ఖత్వం. లక్ష్యాలు నిర్ణయించుకుని, ఉన్న ఊళ్లోనే హాయిగా బ్రతకడం మంచిదనుకున్నాడు సాంబు.

నదిలో జనం ఎందరో స్నానాలు చేస్తున్నారు. బైరాగు లిద్దరు స్నానం పూర్తిచేసి శరీరాలు తుడుచుకుని ఏదో వస్త్రం పట్టుకుని లాగుకుంటూ దెబ్బలాడుకుంటున్నారు. సర్వసంగపరిత్యాగులైన విరాగులు కూడా గోచీ విలువలాంటి చిన్నచిన్న విషయాలపై పేచీలు పెట్టుకోవడం హాస్యాస్పదం అనుకున్నాడు సాంబు.

స్నానం తనుకూడా పూర్తిచేసి మాసిపోయిన తన లాగూ చొక్కా తొడుక్కుందామనే సన్నాహంలో ఉండగా, రెండు గజాల దూరంలో ఒక ముసలి స్త్రీ కెవ్వున కేక పెట్టింది. ఆమె కొడుకు పదేళ్ల కుర్రవాడు కాలు జారి నదీ ప్రవాహంలో పడ్డాడు. నదీప్రవాహంలో ఒకసారి చెయ్యి,



హానుమకొండ, వెయ్యిస్తంభాల ఆలయంలో ఒక స్తంభం.
ఫొటో: ఎ. ఎస్. దయాకర్—సికందరాబాద్.

నీల్లాడు వెనకనుంచి...లోకం పోకడ అం అనుకున్నాడు సాంబు.

పూబంతి మరణం జ్ఞప్తికివచ్చింది. ఎంత అభిమానం, ఎంత ప్రేమ ఉంటే ఏం? విధి నిర్ణయాలు అల్లాజరిగిపోతాయి. నదీ ప్రవాహంలో కుర్రవాడు కొట్టుకుపోయినట్లు, జీవితంలో ఎరుగున్నవారి మరణాలు ఎన్నో దొర్లిపోతాయి. సన్నిహిత సంబంధాల వల్ల హృదయబాధ తప్పదు. అబాధ ఎక్కువైతే జీవితగమనంలో. వికృతి పరిణామాలు వస్తాయి. కాని నిజమాలోచిస్తే మానవశక్తి కతీతమైన మరణాలనుగురించి వేదనపడడం మూర్ఖత్వం. ఈ మూర్ఖత్వంతో జీవితాన్ని నిర్లక్ష్యంగా గడపడం మరీ హాస్యాస్పదం.

విజయవాడ రైలుస్టేషనుకు వచ్చాడు సాంబు. ఒక సేట్‌జీ దానకర్ణుడిలా విసిరిన డబ్బులకోసం కొట్లాడుకుంటూ ముష్టివాళ్లు ఏరుకుంటున్నారు. ఒకవైపున కోయదొర యిద్దరు రైతులకు జ్యోతిషం చెపుతున్నాడు. పళ్లవాళ్ళ కేకలు, చుటా బీడీ సిగరెట్టు అరుపులు, పుస్తకాలు, కథలు, నవలలు అంటూ అమ్మేవారి హడావడి, వెంట తెచ్చుకున్న సామాన్లు, వచ్చిన కుటుంబం, తిన్నగా ఉన్నారా లేదా అనే నిత్యపరీక్షలో సతమతమయ్యే ముసలి గృహస్థుల సణుగులు, ఆ ప్లాటుఫారాన్ని బాగా సందడిగా చేస్తున్నాయి. ఎక్కడచూసినా ఒకటే మానవనైజం!...స్వార్థం!

ఆకాశం బాగా ముసురుపట్టింది. వాన తుంపర విరామం లేకుండా పడుతోంది. చలిగాలి జోరుగా వీస్తోంది. ప్లాటుఫారం ప్రయాణీకుల తడి పాదాలతో తపతపలాడుతోంది. ఎక్కడ కూర్చుందామన్నా చికాకుగా వుంది. ఈగలు ముసురుతున్నాయి. ఇటూ అటూ నడిచే రైలుఇంజన్ల పొగలు మీదకు వచ్చి తారువాసనతో గుప్పుమంటున్నాయి.

మగవాళ్ల వెయిటింగ్ రూములోకి అడుగు పెట్టాడు సాంబు. ఎదురుగా పెద్ద అద్దం! అద్దంలో తన ప్రతిబింబం!! హఠాత్తుగా ఆగిపోయాడు! ఎవరా మనిషి! తనే! పెరిగి బూజురంగు దాల్చిన గడ్డం, తైలసంస్కారం లేక ఎరుపురంగు పట్టిన తలమీది జుట్టు, చిలుగుమానికలతో ఎగదిసుకుపోయిన లాగు, చిదానందస్వామి యిచ్చిన కాషాయి రంగు చొక్కా, ఒంటిమీద మాసిపోయిన గళ్ళ తువ్వాలు...ముసుపటి తన ఆకారానికి యిప్పటికీ సమ్బంధం లేదావుంది! ఎవరైనా గుర్తుపట్టగలరా?...ఆ లోతుకుపోయిన కళ్లు, బక్కచిక్కిన శరీరం, యీ రెండు సంవత్సరాలనుంచీ ఊరూరా తిరిగిన ఫలితం? ఏమిటి దీని పర్యవసానం?' అనంత తెలివితక్కువ మనిషి ప్రపంచంలో లేడనుకున్నాడు సాంబు.

రైలు వచ్చింది. కాకినాడవైపు పోతుంది.

★ ఉదయకిరణాలు ★

ఒకసారి కాలు మరొకసారి తల కనిపిస్తూ, ఆకుర్రవాడు బంతిలా దొర్లుతున్నట్లు కనిపించాడు. ఈతవచ్చిన సాంబు అనూంతంగా నదిలో దూకాడు. ప్రవాహం వడి ఎక్కువైంది. మరికొందరు ఈతగాళ్లుకూడా నదిలోకి ఉరికారు. కుర్రవాణ్ణి పట్టుకోలేక పోయారు. నదీప్రవాహం వడి మధ్యలోకి వెళ్లడానికి వారికీ భయమేసింది. లంగరు విప్పుకుని ఒక స్టీములాంచి నది మధ్యలోకి పరుగెత్తింది. కుర్రవాడి జాడ కనిపించలేదు. ఆ ముసలి స్త్రీ గుండె బాదుకుని ఏడ్చింది. ఎంతమందైనా సానుభూతిచూపేవారే కాని ఆమె కుర్రాడిని బ్రతికించేవారులేరు. 'కొడుకును వదిలేసి అంత అజాగ్రత్తగా స్నానం చెయ్యాలా మే!' ఒక పెద్దమనిషి

మూడవక్లాసు కంపార్టుమెంటులో ఒక మూల ఒదిగి కూర్చున్నాడు. ప్రక్కన కూర్చున్న ఒక విద్యార్థిని అడిగి, సిగరెట్టు ముట్టించాడు.

రెండు సంవత్సరాల తర్వాత....ఇంటి వైపు...ఎవరు ఎక్కడ ఉన్నారో!

ముసురు ఎక్కువైంది...రివ్వున వీస్తోంది చలిగాలి. సిగరెట్టు నిప్పు కొంచెం వెచ్చగా ఉంది వేళ్ళకు.

ఎంతోమంది ప్రయాణీకులు టిక్కెట్టు కొనుక్కుని రైలు ఎక్కారు. నవక వేగంలో రైలు పట్టాలమీదనుంచి జారుతే.. వీదైనా చిన్న వంతెన కూలితే...ఎవరైనా రైలుపట్టాల సీలలు పీకి విసిరిస్తే... ఒక్కసారి నరకంలో ఉరికినట్లు......... హాహాకారాలు, కేకలు, పాలిబొబ్బలు మూల్గులు, ఆక్రందనలు హడావిడి... చెప్ప లేనన్ని మరణాలు-తప్పనిసరి మరణాలు.... కాని వారఫలితాలు యీ సంగతి చెప్పవు! ఇంటిదగ్గర ఎవ్వరినీ కలుసుకోనక్కర్లేదు. వారినిగురించి ఆలోచించే అవసరమే ఉండదు...మరో లోకం...మరో ఆలోచన...మరో గతి!! తనలో నవ్వుకున్నాడు సాంబు.

అసలు ఇంటిదగ్గర అంతా తాను చనిపోయాడని అనుకుని ఉంటారు...ఇంటికి వెళ్లడమెందుకూ! ..అనవసరం!..జీవితగతులు... ఆశయాలు....వాతావరణం......మరోలా ఉంటాయి ....తాను ఒక్కసారిగా కనిపిస్తే...మళ్ళీ పురాతనచరిత్ర త్రవ్వడం... ఎక్కడైనా ఒంటరిగా నే బ్రతుకుతే మంచిదేమో....మళ్ళీ అస్థిరత......ఇంక మనం బాధపడం!!

రైలుస్టేషన్లు గబగబా వెనక్కి పరుగిడుతున్నాయి. లైట్ల వెలుగులు-చీకట్లు...మళ్లీ వెలుగులు...దారి అంతా ఇదే! గాలి, ముసురు విసుగు పుట్టించింది......ఎప్పటికి తగ్గుతుందో!!



గోదావరి ఆనకట్టలు కట్టించిన సర్ ఆర్థర్ కాటన్ శిలా ప్రతిమ
ఫొటో: క. వెంకటేశ్వరరావు—ఏలూరు.

22

ఆనాడు సంక్రాంతి పండుగ. తెల్లవారుఝాము నాల్గు గంటలు.

వేగుచుక్క కాంతివంతంగా ప్రకాశిస్తోంది. మేఘాలు విడిన ఆకాశంలో స్పష్టంగా నక్షత్రాల గుంపులు కనిపిస్తున్నాయి. విడిపోయిన గాలిముసురు విడిచిపోయిం చలిగాలి ప్రభావం ఇంకా తగ్గలేదు.

ఆవరించిన చీకటిని ఛేదిస్తూ వీధుల్లోకి తొంగిచూస్తున్నాయి యిళ్ళల్లో వెల్గిన విద్యుద్దీపాలు. కొద్దికొద్ది చప్పుళ్లు...జనం కొంచెంగా మేల్కొంటున్నట్లు కనిపిస్తుంది.

రోడ్డుమీద ఒకరిద్దరు మనుష్యుల పోకడ. ...జంగంవాని శంఖారావం, గంటలు వీధిలో గింగురుమంటున్నాయి.

శాంత యింటిముంగిలిలో ముగ్గులు పెడుతోంది...ఆకాశంలోని నక్షత్రాలగుంపుకు పోటీగా.

అప్పుడే అభ్యంగనం పూర్తిచేసుకుని, శిరోజాలతడి ఆరేలా పిడప చుట్టుకుని వల్లెవాటు నడుముకు బిగించి ప్రమిదలోని ముగ్గు నేలమీద చిలుకుతోంది.

సాంబు వచ్చాడు. శాంత!! పోల్చాడు. బాగా ఎదిగింది ఈ రెండేళ్ళలో...చూడగానే ఆనందబాష్పాలు రాలాయి.

పలకరించకుండా ముగ్గులవైపు చూశాడు. శాంత తల ఎత్తింది...ఎవరామనిషి? తల దించుకుని ముగ్గులు పెట్టిందిమళ్లీ. పావుగంట గడిచింది.

ఆమనిషి అక్కడే నుంచున్నాడు!! ఇంకా కనుచీకటి.... చెవి లోలకులు...చేతిగాజులు మెరిశాయి...కంగారుగా గుమ్మంలోకి పారిపోయింది.

సాంబుకు నవ్వొచ్చింది. గుమ్మంవైపు నడిచాడు...లోపల అడుగు పెట్టాడు.

'అమ్మోయి! దొంగ...దొంగ!' రివ్వుమని లోపలికి పరుగెత్తిందిశాంత.

★ ఉదయకిరణాలు ★

'శాంతా!' సాంబు బిగ్గరగా పిలిచాడు. శాంత ఆగిపోయింది.

శాంత కేకతో అవధాని మందంవిడిచి బయటికి పరుగెత్తుకువచ్చాడు.

స్రవంతికి తలంటుతున్న మాణిక్యం కుంకుళ్లు అంటుకున్న చేతులతో వరండాలోకి కంగారుగా వచ్చిపడింది కూతురు కేక విని.

ఆగిపోయిన శాంత సాంబు గొంతు గుర్తించింది.

'అ...న్న...య్యా!' పరుగెత్తుకు ముందుకు వచ్చింది.

'ఎవరు సాంబా' అవధాని ఆత్రుతతో ముందడుగు వేశాడు.

'అబ్బాయా?' ఆనందబాష్పాలు రాలుస్తూ సాంబుదగ్గరగా వచ్చింది మాణిక్యం.

ప్రకాశం పడకగదిలోంచి బైటికి వచ్చాడు. సాంబును చూసి 'తమ్ముడూ?' అంటూ ఆశ్చర్యంగా చూశాడు.

పరంధామయ్య, మిగిలినవాళ్లు వచ్చిచుట్టుముట్టారు.

సాంబు వచ్చేడనే ఆనందంలో ఏమనాలో అర్థంకాక ఒకరిని చూసి ఒకరు పువ్వులు విచ్చుకున్నట్లు నవ్వుకున్నారు.

'మహామునిలా, ఆగడ్డం! కాషాయరంగు చొక్కా!... ఇంతకాలం అరణ్యాల్లో తపస్సు చేశావేమిట్రా?' అవధాని వేళాకోళం చేశాడు సాంబును.

అందరూ గొల్లున నవ్వారు. సాంబు సమాధానం చెప్పలేక తల ఒంచుకు కూర్చున్నాడు మౌనంగా.

కొడుకు ఎంత చిక్కిపోయాడో, ఎన్నెన్ని కష్టాలుపడ్డాడో, అని మాణిక్యం వెళ్లు నిమురుతూ కొడుకు ముఖంలోకి చూస్తోంది.

'వాడికికూడా తలనీళ్లు పొయ్యవే మాణిక్యం'

పరంధామయ్య మాటలకు మాణిక్యం ఆలోచనలనుంచి తేరుకుంది.

ఏమిటో అనడం మరిచిపోయినట్లు ప్రకాశం తల గోక్కున్నాడు.

మాణిక్యం, సాంబును తీసుకుని దొడ్లోకి నడవబోయింది.

'అమ్మా! నీకోసం పిలుస్తోంది'నవ్వాడు ప్రకాశం.

'ఏం?'

'త్వరగా రమ్మంది' ఆలస్యంగా చెప్పావని కంగారుపడ్డాడు ప్రకాశం.

'ఆఁ' గదిలోకి వడిగా నడిచింది మాణిక్యం.

సాంబు, ఒకసారి ప్రకాశంవైపు, మరోసారి అవధానివైపు దిగ్భ్రమతో చూశాడు.

'అన్నయ్యకు పెళ్లయిందన్నమాట!' మాసిపోయిన గెడ్డంమాటునుంచి పెదాల మీదుగా పొంగింది మందస్మితం.

'వదినను చూడాలి' విసురుగా ఒకడుగు ముందుకు వేశాడు సాంబు.

'ఇప్పుడు కాదోయ్!' అవధాని ఆపాడు సాంబును.

సాంబు ముఖంలో ఎందుకు ఆపారా అన్న ప్రశ్న కనిపించింది.

'మీ అన్నయ్య తండ్రి కాబోతున్నాడు!'

అన్నగారిని చూసి ఫక్కున నవ్వాడు సాంబు.

'వదిన పేరు?'

'చామంతి'

'ఆఁ' అవధాని సమాధానం సాంబుకు వింత గొలిపింది. తనకు జ్ఞాపకం ఉన్నంత వరకు చామంతికి పెళ్ళి అయిపోయింది....

వితంతువుకూడా అయ్యింది...తనేం వింటున్నాడు? నిజమా?

పరంధామయ్యవైపు ఉక్రోషంతో చూశాడు. వీడు చేసిన పన్నాగమా? కళ్ళు ఎర్రబడ్డాయి సాంబుకు.

'మీ అన్నయ్యే కోరి చేసుకున్నాడు!'

పరంధామయ్య సమాధానం విని, ఉద్రేకం తగ్గించుకున్నాడు సాంబు.

ఇంట్లో ఒకరొకరిమధ్య ఏ అవరోధాలు, అడ్డంకులు కనిపించటం లేదు. విభాగాలు, విభేదాలు లేనే లేవు. కలిసిపోయాయి కుటుంబాలు. తను హఠాత్తుగా కన్పించడం వల్ల......గతచరిత్ర త్రవ్వకోవడం...... మూర్ఖత్వం. హత్తుకున్న కుటుంబాలను విడదీయడం అన్యాయం....బలవంతంగా ఒక నవ్వు నవ్వాడు సాంబు.

'కేర్'మని ధ్వని.

అందరూ ఒకరివైపు ఒకరు నవ్వుతూ చూసుకున్నారు.

శాంత పరుగెత్తుకుంటూ బయటికి వచ్చింది. అందరూ ఆత్రుతతో చూశారు.

'నేను నెగ్గాను. అయిదురూపాయిలియ్య అన్నయ్యా!'

ప్రకాశం జేబులో చెయ్యి దూర్చింది శాంత.

స్రవంతి, శాంతవెనకాలే మెల్లిగా వచ్చింది.

'మగపిల్లవాడు!'

ప్రకాశం ఒళ్ళు గగుర్పొడిచింది. తన ప్రతిబింబం! చూసుకోడానికి యింతకాలం అద్దంమీద ఆధారపడ్డాడు...యిప్పుడు ఎదురుగా మరోచిత్రమైన ప్రతిబింబం. తన ఆశలు, ఆశయాలు, ఆవేశాలు ఒక ముద్దగా ముందు కనిపిస్తాయి, ఒకస్వరూపంలో.

కేశసంస్కారం, అభ్యంగన చేసుకోడానికి సాంబు దొడ్లోకి వెళ్లిపోయేవాడు.

ఎవరిపనుల్లో వారు మునిగిపోయారు.

ఉషఃకాంతులు వెల్లివిరిశాయి. ఆనందం తాండవించింది ఆయింట్లో.

స్రవంతి కాఫీ ఫలహారాలు సిద్ధంచేసింది, అందరూ కుమిగూడారు.

'పిల్లాడు ఎవరిపోలికమ్మా వదినే?'


అవధాని స్రవంతినిచూసి ప్రకాశంవైపు తిరిగాడు.

'తండ్రి పోలికే!' స్రవంతి అల్లుడినిచూసి నవ్వింది.

'అంతేలే! కొడుకులకు సాధారణంగా తండ్రి పోలికలే వస్తాయి!' సిద్ధాంతీకరించాడు అవధాని.

తల్లిపోలికలు రాకూడదని సిద్ధాంతముందా?'

'ఉదాహరణకు చూడండి! తండ్రిలాగే మాసాంబుకూడా దేశయాత్రలుచేసి యింటికి తిరిగివచ్చాడు!" తండ్రికిఉన్న గుణాలు



తేలిక బరువు

ఫొటో: డి. పాల్—విజయనగరం.

★ ఉదయకిరణాలు ★

పోలికలు కొడుకుకు తప్పకుండా వస్తాయి! సాంబును చూసే నవ్వారంతా.

'ప్రకాశం ఒక గృహస్థు అయ్యాడు. వరసటి చిహ్నంగా ఒక కొడుకును సంపాదించుకున్నాడు...ఇంక సాంబుకు పెళ్ళి చెయ్యాలి.... పెళ్లి కాలేదనేగా కోపంవచ్చి యింట్లోంచి లేచిపోయాడు!' అవధాని మాటలకు అందరూ ఘక్కున నవ్వారు.

'మీరు అపార్థం చేసుకున్నారు మామయ్యా!'

గంభీరంగా అన్నాడు సాంబు.

'ఆ! నాకు తెలియదూ నీ సంగతి! నువ్వు యింతగా చెప్పాలా?' ఫలహారం పూర్తిచేసి కాఫీ కప్పు అందుకున్నాడు అవధాని.

'నేను పెళ్ళిచేసుకోను మామయ్యా!'

'ప్రస్తుతం చేసుకోవద్దులే.'

'జీవితంలో అసలు నేను పెళ్లి చేసుకోను మామయ్యా!'

'హమ్మయ్య! మాకు సగం, బెంగ, శ్రమ, తగ్గాయి! నీ పెళ్ళికని అనవసరంగా అవస్థపడనక్కర్లేదు.'

వేడి కాఫీ రెండు గుక్కలు మింగాడు అవధాని. సాంబు అంటున్న మాటల్లో ఒక నిశ్చయం ఉన్నట్లు కనిపిస్తోంది. హృదయంలో ఉన్న ఆ వేదన, ఇంతకాలం ఇంటికి రాకుండా ఒంటరిగా బాధపడిన కారణాలు సాంబు అన్న ప్రతిమాటలో స్పష్టంగా కనిపించాయి అవధానికి. సాంబును పూర్తిగా అర్థం చేసుకున్నా అతని మాటవల్ల తక్కినవాళ్ళకు ఏ అసంతృప్తి కలగకూడదని సంభాషణ తేలిగ్గా హాస్యంగా నడిపించాడు అవధాని.

'మరి పెళ్లి చేసుకోక బ్రహ్మచారిలా బ్రతుకుతావా?...బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా....' అవధాని అంటూండగానే అందరూ నవ్వేశారు.

'నేను నీలాగే బ్రతుకుతా మామయ్యా!'

'నాలాగ?'

'అవును. నీ జీవితంలో ఒక ఆశయం, ఆదర్శం ఉన్నాయి నీలో ఉన్న త్యాగం సర్వసంగ పరిత్యాగులనే సన్యాసుల్లో ఎక్కడా కనిపించలేదు!'

అంత ఉద్రేకంతో సాంబు మాట్లాడడం అవధాని అంతకుముందు ఎన్నడూ చూడలేదు. అయినా సాంబు మనస్సు నొచ్చుకోకుండా, తక్కినవాళ్ళు ఆ మాటలు సాంబు నిశ్చయాలుగా తీసుకోకుండా అవధాని ముఖం చిట్లించి నవ్వాడు.

'ఇంటి భోజనం యింకా ఒంటబట్టలేదుగా! కొంచెం కండ బాగా పెరిగితే, పెళ్ళి! పెళ్లి! అంటూ నువ్వే ముందుకు వస్తావు!'

మళ్లీ నవ్వులు.

'పోనీ! నీ పెళ్ళిగొడవ నాకెందుకు!.... ఇంక శాంతకు పెళ్ళి చెయ్యాలి!'

అవధాని కాఫీ కప్పు ఖాళీచేశాడు.

'దాని పెళ్లికి అసలే గొడవపడనక్కర్లేదు. పెళ్ళికొడుకు నా యింట్లోనే వున్నాడు!'

అన్నగారి మాటలకు అవధాని ఒక్కసారి ఆవలించాడు. ఇంతకాలం పరంధామయ్య మంచిగానే వుంటున్నా, యీ మాటఎప్పుడూ తన దగ్గర అనలేదు. ఇటువంటి వివాహం ఎంత సమంజసమైనా, అన్నగారి హృదయం అతి మంచితనంతో పక్వమై పోయిందని అవధాని చాలా సంతోషించాడు.

'అయితే నా నెత్తిమీద ఎవరి పెళ్లి బాధ్యతా లేదన్నమాట! ఇంక నిశ్చింతగా బ్రతకవచ్చు!... హమ్మయ్య...ఇంకో కప్పు కాఫీ యిలా పొయ్యమ్మా వదినా!' కాఫీ కప్పు ముందుకు తోశాడు అవధాని.

'ఇంక యిదేపనా!' స్రవంతి నవ్వుతూ కసిరింది.

'మరి ఏపనీ లేకపోతే నాకు యిదేపని. కాఫీ త్రాగుతూ సిగరెట్టు పీలుస్తూ చీకూ చింతా లేకుండా హాయిగా ఒక మూల కూర్చుంటాను!'

కాఫీకప్పు పూర్తిచేసి, సిగరెట్టు వెలిగించాడు అవధాని.

సంక్రాంతిపండుగ హడావిడి - ముష్టివాళ్ల కేకలు, జంగంవాళ్ల శంఖాలు, గంటలు - కొమ్మదాసరుల గొడవ, 'పిల్లాడే బొమ్మ'ను వయ్యారంగా త్రిప్పి ఆడించే బిచ్చకత్తెల పాటలు - వీధుల్లోకి కొత్తకళ తీసుకువచ్చాయి. దానం వెయ్యాలంటూ తాటాకుల బుట్టలో బియ్యం పోసుకుని వీధిగుమ్మం వైపు పరుగెత్తింది శాంత.

పండుగనాడు, ఈ ఆనందసమయంలో అవధాని అసంతృప్తిగానే తన జీవితాన్ని సింహావలోకన చేసుకో మొదలుపెట్టాడు. పుట్టినది సామాన్యకుటుంబంలో. మొదటి నుంచి చివరివరకూ బ్రతుకు గడపడమే ఒక ప్రధానసమస్య ప్రతీవాడికీ యిటువంటి కుటుంబాల్లో. తనకూ అలాగే అయిపోయింది.

తను చేసిన పనులలో ఒక్కటే చెప్పుకోతగ్గది. ఆర్థికపతనంతో విధ్వంసం కాబోయే ఒక కుటుంబాన్ని ఆదుకుని కొంత అభివృద్ధికి తెచ్చాడు. పతనమయ్యే ఆ కుటుంబవృక్షం బ్రతికి మరికొన్ని పలవలు, చిలవలు వేసుకుంది. ఆశయాలు అంటూ ఏవో ఊహాగానాలు చేసుకోవడమే కాని, ఒక సామాన్యకుటుంబీకుడు ఆచరణలో పెట్టగలిగేది చాలా కొద్దిమాత్రమే. తను చూపించుకున్న త్యాగం సఫలమైంది. మేనల్లుళ్లు తన్ను అర్థం చేసుకోగలిగారు.

సామాన్యులు సంసార జంఝాటంలో చిక్కి, సంకుచితత్వంతోనే తమ జీవితాల లక్ష్యాలు నిర్ణయించుకుని సాధించుకుంటారు. చివరకు సంతృప్తికల్గదు. స్వార్థంకోసం, మానసిక సంతృప్తికోసం, అణగారిపోయే కుటుంబాలను ఆర్పేస్తారు. అప్పుడే కావాలి ఆదుకుని అండగా ధైర్యంగా నిల్వగలిగే ఒక ఆప్తుడు. ఇదే ఆఖరుకు తను ఆచరణలో పెట్టగలిగిన జీవిత ఆశయం. ఇది అర్థం చేసుకున్నాడు సాంబు.

'కేర్'మంటూ గదిలోంచి పాప పిలుపు వినిపించింది.

చూడాలని నడిచాడు అవధాని.

స్వార్థం సృష్టించుకున్న కట్టుబాట్లను స్వార్థరహితులు ఎదిరిస్తే, సంఘం దృష్టిలో అది ఒక విప్లవం!..:...విప్లవం వర్ధిల్లాలి!! నవ్వుకున్నాడు తనలో అవధాని.

స్రవంతి పిల్లవాడిని చూపించింది.

ఎర్రగా కందిగడ్డలా విప్పీవిప్పనికంట్లతో ఓరగా చూసి నవ్వినట్లు పెదములు వక్రంగా తిప్పాడు శిశువు.

అచ్చు ప్రకాశం పోలికే!

'ఏం పేరు పెడతావురా?' ప్రక్కనే నవ్వుతూ నుంచున్న ప్రకాశాన్ని ప్రశ్నించాడు అవధాని.

'అవధాని!'

స్రవంతి నవ్వుతూ శిశువును గదిలోకి తీసుకుపోయింది

'కాదు విప్లవరేఖ!' స్వగతంగా అనుకున్నాడు అవధాని.

సూర్యుడప్పుడే ఉదయించి తన కిరణాల దివ్వెలు విశ్వమంతా వెల్గించాడు. విప్లవరేఖల్లాంటి ఉదయకిరణాలు తెలవెలుగు తొడుగులు ధరించుకుంటున్నాయి. ఇంటి ఆవరణలో ఏపుగా ఎదిగి పూతపూసుకుని దట్టంగా లేత ఆకులు వేసుకున్న చూత వృక్షాలు ఆ ఉదయకిరణాల వెల్గులలో తళతళలాడుతున్నాయి. ప్రకృతిలో క్రొత్త వన్నెలు కనిపించాయి.

సిగరెట్టు దమ్ములు పొగలు ముఖంమీద నుంచి ప్రయాణం చేస్తూంటే, అవధాని, సాలోచనగా, సంతృప్తితో, ఒక్క నవ్వు నవ్వుకున్నాడు.

[సమాప్తం]



సంసారజీవితంలో సరదాలు

వి. ఎస్. అవధాని

సంసారజీవితం సాగించవలసిన యువతీయువకుల సరదాలు సంసారజీవితం ఇటు స్వర్గతుల్యమో అటు నరకతుల్యమో కావడానికి చాలా ప్రధాన కారణాలు. గతంలోనూ, ఈ రోజులలోనూ కూడా భార్య సరదాలు భర్తకు నచ్చకపోవడం - భర్త సరదాలు భార్యకు గిట్టకపోవడం ఆ కారణంగా సంసారజీవితం చాలా బాధాకరంగా పరిణమించడం జరిగింది - జరుగుతున్నది.

ఈ సమస్యను వీలయినంతవరకు పరిష్కరించుకుని, సరదాలనేవి కొస్తా బాధలుగా పరిణమించకుండా ఉండాలంటే సరదాలంటే యేమిటో స్త్రీ పురుషులు తెలుసుకోవడమవసరం.

ఉదాహరణకొక సంఘటన చెబుతాను. అన్నపూర్ణ మా పొరుగింటిపిల్ల. వాళ్ల నాన్న బారిస్టరు. బాగా సంపాదించి అనుభవించదగినవన్నీ అనుభవించి తన కుటుంబాన్ని కూడా ఆనందపరచాడు. ఆయనకు నలుగురు కుమార్తెలు. నలుగురికీ స్కూల్ ఫైనల్ దాకా చదువు చెప్పించాడు. ఆధునిక సంప్రదాయాలన్నీ ఆడపిల్లలకు కూడా నేర్పాడు. ఇంట్లో వంటమనిషి ఉన్నది. ఇద్దరు నవుకర్లున్నారు. కనుక ఆడపిల్లలు ఇంట్లో పనిచేయవలసిన అవసరం లేదు. అందువల్ల ఎప్పుడూ యేవేవో పుస్తకాలు చదవడం, స్నేహితులతో కులాసాగా కాలక్షేపం చెయ్యడం, సినిమాలు, నాటకాలు మొదలయినవాటికి వెళ్ళడం ఆడపిల్లలకు అలవాటయింది. అంతే కాదు. ఒకరకంగా కష్టపడేవాళ్ళను, పేదరికంవల్ల బాధపడుతున్నవారినీ ఆదరించి సానుభూతి చూపించడం వాళ్లకు అర్థంకాకుండా పోయింది. తెల్లవారి లేవగానే పేస్టూ, బ్రష్షూ పట్టుకుని బాత్ రూమ్‌లో ప్రత్యక్షమై చకచకా వేడివేడి కాఫీ నారగించడం వాళ్లకు అలవాటయింది. అయితే వీళ్ళల్లోకల్లా అన్నపూర్ణ కొంచెం తెలివిగలది. పిల్లలందరిలోనూ చిన్నది. కనుక అందరికీ ఆమెను చూస్తే గారాబం. అయినా ఆ అమ్మాయి ఆ యింట్లో వాతావరణానికి కొంచెం అతీతంగానే పెరిగింది. కాని, ఆ యింటి అలవాట్లూ, సరదాలూ బొత్తిగా అన్నపూర్ణకు అబ్బనే లేదనడానికి వీలు లేదు.

అన్నపూర్ణ భర్త శాస్త్రి చాలా పేద కుటుంబానికి చెందినవాడు. చాలా కష్టపడి వాళ్ళ నాన్న అతనికి చదువు చెప్పించాడు. శాస్త్రి తెలివితేటల కారణంగా పెద్ద ఉద్యోగమే రావడంవల్ల అన్నపూర్ణతో వివాహం సంభవించింది. శాస్త్రికి తల్లిదండ్రులంటే భక్తి. అల్లా అని పొద్దస్తమానమూ వాళ్లు చేసే పనులన్నింటినీ సమర్థిస్తాడని కాదు. అన్నపూర్ణ చాలా సంస్కారంగల మనిషని అతనికి తెలియదనీ కాదు. కాని, భార్యపట్ల తనకు ఎంత ధర్మం ఉన్నదో తల్లిదండ్రులపట్లకూడా తనకు అంతే ధర్మం ఉన్నదని శాస్త్రి అభిప్రాయం. అంతే కాదు. తన సంపాదనలో ఎక్కువ భాగం తల్లిదండ్రులకూ తమ్ముళ్ళ చదువుకూ ఖర్చు చేస్తాడు. తనలాగా నెలకు రెండు వందలు సంపాదించేవాళ్లందరిమాదిరిగా షోకైన దుస్తులు వేసుకోడు. ఇంటినిండా ఫర్నిచరు కొనలేదు. తలనొప్పి పుట్టించడానికికూడా వెరవని రేడియో సెట్టు లేదు. అవసరాన్ని బట్టి తన అవసరాలయినా మానుకొంటాడు. అయితే భార్య అవసరాలనుమాత్రం నిర్లక్ష్యం చెయ్యడు. అంతవరకూ అన్నపూర్ణకు సంతోషంగానే వుంటుంది. కాని, నెలకు రెండువందలు సంపాదిస్తూకూడా కేవలం 60 వ నంబరు ధోవతులూ తప్పితే చవుకబారు పాంట్లూ తనభర్త వేసుకోవడం

★ సంసారజీవితంలో సరదాలు ★

ఆమెకు ఏదో బాధగా వుంటుంది. తనభర్త అందంగా, షోగ్గా మంచిమంచి పాంట్లూ బుష్ షర్టులూ వేసుకోవడం ఆమెకు సరదా. శాస్త్రి పొద్దున్నే కాఫీ తాగడు. కాని, కాఫీపొడి, పంచదార తెస్తాడు. అన్నపూర్ణకు ప్రొద్దున్నే కాఫీ కావాలిగదా. ముసలివాళ్ళకుకూడా కావాలి. అందుకే శాస్త్రి కాఫీపొడి, పంచదార తెస్తున్నాడు గాని తనకోసం కాదనుకొంటుంది అన్నపూర్ణ.

చిన్నతనంనుంచీ పేదరికమంటే యేమిటో తెలిసినవాడు కావడంవల్లనో, లేక ఆరకం సుఖం అనుభవించడంచేతకాకనో శాస్త్రి ఎప్పుడోతప్ప సినిమాలకు వెళ్లడు. వారానికొకరోజు కాకపోయినా నెలకు రెండుసార్లయినా సినిమాకు వెళ్లడం అన్నపూర్ణకు సరదా.

చిన్నప్పుడు శాస్త్రితల్లి భోంచేస్తుంటే ఎదురగ్గా కూచుని అది కావాలా ఇది కావాలా అని అడుగుతూ లాలించి అనునయించేది. సంసారజీవితం ప్రారంభమయిన తరువాత ఆమెయే తనకు ఈపరిచర్య చెయ్యడం శాస్త్రికి అంతఆనందంగా వుండడంలేదు. అన్నపూర్ణకు వంట చేతనవును. కాని, ఈయింట్లో వాళ్ళ అభిరుచులకు ఆమెవంట నచ్చదు. కనుక అమ్మయే వంటచేసినా కనీసం తాను అన్నం తినేటప్పుడు అన్నపూర్ణ తనదగ్గర కూర్చుని అది కావాలా యిది కావాలా అని అడుగుతూ అనునయించాలని శాస్త్రి అభిలాష. ఈ అభిలాష అన్నపూర్ణకు తెలిసినదే. కాని, భర్త అన్నం తినేటప్పుడు ఆయనవద్ద కూర్చోవడం ఆమెకు ఎందుచేతనో సరిపడదు. ఒక వేళ కూర్చున్నా ఏ నవలో చదువుతూ కూర్చునేది. ఇలా చెయ్యడంలో అన్నపూర్ణకు భర్తపట్ల అగౌరవమేమీ లేదు. ప్రేమ లేక అంతకన్నా కాదు. కాని తనకు భర్తయందున్న ప్రేమా గౌరవాలను కొలవడానికి భర్త ఎదురుగా కూర్చుని ఆయన అన్నం తింటూంటే కబుర్లు చెప్పటమనేదొక ప్రమాణమని అన్నపూర్ణకు తెలియదు. ఆ విషయం గ్రహించగల వాతావరణంలో అన్నపూర్ణ పెరగలేదు. పైగా పుస్తకాలు చదవడమనేది అన్నపూర్ణకొక సరదా. ఇలాగే ఈ యిద్దరి జీవితంలో అనేక చిన్నచిన్న సరదాలు కొన్ని సమస్యలను తెచ్చిపెట్టినవి.

సరదా అనేది అలవాటు కాదు, అలవాటును మానుకోడం కష్టం. వీలునుబట్టి సరదా వుంటుంది. అవకాశం లేకపోతే సరదాలను మానుకోగలము. అలవాట్లను సాధారణ మానవులు అంత సులభంగా మానుకోలేరు. ప్రయత్నించితే మానుకోవడం అసాధ్యమేమీ కాదు. కాని, మానుకోవాలన్న ఆలోచన ఉండాలి. సంసార జీవితంలో ఒకరినొకరు అర్థంచేసుకోవడానికి సరదాలు ఉపయోగపడాలి.

భర్త సరదాలు భార్యకు గాని, భార్య సరదాలు భర్తకు గాని మోటుగా కనిపించరాదు. అనేక సంవత్సరాలు ఒక రకమైన వాతావరణంలో ఒక రకమైన పద్ధతులలో ఆచారసంప్రదాయాలలో పెరిగిన ఆడపిల్లకు అత్తవారింటి సంప్రదాయాలూ, ఆచారాలూ సరదాలూ కొత్తగానూ, భయం కలిగించేవిగానూ, వీటన్నింటికంటే మోటుగానూ కనిపించడంలో ఆశ్చర్యమేమీ లేదు. కాని, ఇవేమీ ప్రమాద కారణాలు కావు. ఒకరితో ఒకరు పోట్లాడుకోవలసిన విషయాలు అంతకన్నా కావని భార్యాభర్తలు గ్రహించకపోతే సంసార జీవితం యొక్క ఉద్దేశమే వమ్మయిపోయే ప్రమాదం వున్నది.

సిగరెట్టుతాగే భర్తలను చూచి భార్యలు ఏవగించుకొన్నరోజులున్నవి. స్నో రాచుకొని పౌడరు వేసుకొన్న భార్యను చూచి మనసులో ఆనందిస్తూకూడా తల్లిదండ్రుల కారణంగా భార్యలను ఆరడిపెట్టిన భర్తలున్నరోజులూ ఉన్నవి. అలంకరణకు సంబంధించిన ఈ సమస్యలు కాక ఆహారవిహారాలలోకూడా పరస్పరవిభిన్నమైన పద్ధతుల స్త్రీపురుషులు సంసార జీవితం సాగించవలసి వస్తుంది.

కాఫీ తాగడమే చెడ్డఅలవాటని భార్యను ఆరడిచేసినభర్త పొడుం (నశ్యం) అలవాటు చేసుకొంటే ఎట్లా వుంటుంది? ఆర్థికంగా సాంఘికంగా ఒకరకంగానూ స్త్రీ శారీరకంగా కూడా తనదే పైచెయ్యి అయినంతమాత్రాన మగవాడు తనమాటే సాగాలనే దృక్పథంతో తన సరదాలుమాత్రమే సరదాలని, ఇల్లాలి సరదాలన్నీ పిచ్చి భోగంవేషాలనీ భావించడం చాలా ప్రమాదకరం.

ఈ సరదాలనేవి మాటలలో చాలా తమాషాగా వుంటవి. ఒకరకంగా మాట్లాడడం కొందరికి సరదా. ఎదటివారిని ఉడికించి, ఏడిపించి ఆ తరువాత లాలించడం కొందరు మగవాళ్లకు సరదా. ఈ సరదాను సరిగా అర్థం చేసుకోకపోతే అతనితో సంసారం చెయ్యడానికి యేఆడదీ ఇష్టపడదు. ఇష్టపడ్డా, పడకపోయినా సంసారం చేయవలసివచ్చినప్పుడు "ఏంచేస్తాం! మన ఖర్మ ఇట్లా కాలింది" అనే వేదాంతంతో సంబాళించుకోవలసివస్తుంది. అయితే భాషలో నే మాట్లాడే పద్ధతిలోనే ఆడవాళ్లకు ఒక రకంగా సరదా ఉన్నది. భర్త యింట్లో లేనంతసేపు అతణ్ణిగురించి ఆలోచిస్తారు. అవకాశం వస్తే "మావారు ఇంతవారు అంత వారు" అని పొగడుతారు. కాని, భర్త ఎదుటమాత్రం పెదిమ కదల్చరు. కదిల్చినా భర్తను ఉడికించాలనే దృష్టితో చాలా అవహేళనగా మాట్లాడతారు. తేలిగ్గా మాట్లాడతారు. చూచేవాళ్లకు ఈ ఆడదానికి మగవాడంటే లక్ష్యం లేదు అనిపిస్తుంది. కాని, నిజమది కానేకాదు. అటువంటి స్త్రీకి మగవాడిమీద లక్ష్యం ఉన్నదా లేదాఅనే విషయం నిగ్గుతేల్చడానికి ఆమె మాటలు ప్రమాణం కానేకావు. ఒక్కొక్కప్పుడు ఆ మాటలకు ఉద్దేశమే వుండకపోవచ్చు. మరొకప్పుడు



మగవాణ్ణి ఆవేశపరచి అప్పుడు అతన్ని చూచి ఆనందించాలని ఆడది అలా మాట్లాడవచ్చు.

వినయంగా మాట్లాడాలనేది ఉత్తమ ధర్మమే. కాని, వినయమంటే యేమిటో తెలుసుకోవాలి, మనసులో హేయభావాలుంచుకొని పైకి మాత్రం చాలా గౌరవంగా వినయం ఉట్టిపడేటట్టు మాట్లాడేవారు చాలామంది ఉన్నారు. సదా కని భార్య అన్న ఒక్క మాటను పురస్కరించుకుని భర్తగాని, భర్త అన్న ఒక్క మాటను పురస్కరించుకొని భార్యగాని కోపించడమనేది శుద్ధ తెలివితక్కువతనమే అవుతుంది.

ఒకరినొకరు అర్థం చేసుకొనడానికి ఎంతగానో ప్రయత్నించి, ఆతరువాతనే వివాహం చేసుకొన్నా కూడా వ్యక్తిగత జీవితమనేది అటు స్త్రీలకూ ఇటు మగవాళ్లకూ ఎటూ ఉండనేరకుంటుంది. ఇందుకు కారణమేమైనా కావచ్చు. వ్యక్తిగత జీవితమనేదే లేకుండా భార్య జీవితవిధానమే భర్త జీవితవిధానమై, భర్తజీవితవిధానమే భార్యజీవితవిధానం కావాలన్న ఆదర్శం నెరవేరాలన్నా ఒకరినొకరు గౌరవించుకొని, ఆరాధించుకొనడం అవసరం. ఆదరణ, సానుభూతి, లేకపోతే సర్దుబాటు ఉండదు. కలుపుగోలుతనం అబ్బదు. కలుపుగోలుతనం లేకపోతే ప్రేమయే లేదు. అయినా సంసార జీవితం ఏదో ఒకవిధంగా సాగిస్తున్నవారు లేకపోలేదు. కాని, ఇష్టంలేకుండానే ఒకరిసరదాలు, అలవాట్లతో మరొకరు రాజీపడ్డారని వారుకూడా గ్రహించాలి. ఇష్టం లేకుండా, తెలియకుండా, విధిలేక రాజీపడేబదులు ఇష్టపూర్తిగా ఉల్లాసంగా ఒకరి సరదాలను మరొకరు అర్థంచేసుకొని తదనుగుణంగా సర్దుబాటు చేసుకొని జీవితానందం అనుభవించడం నయం కాదా?

సమయాసమయాలు లెక్క చెయ్యకుండా ఒక ఆడకూతురు తన పుట్టింటివారి గొప్పతనాన్ని వల్లెవేస్తుంది. అలా చెయ్యడంలో, ఆమె ఇతరులవద్దనుంచి ఆశించేది ఏమీ లేదు. కేవలం ఆమెకు అదొక సరదా. అని అర్థంచేసుకోకపోతే ఆమెతో సంసారం చేయవలసిన మగవాడు చాలా కష్టపడవలసి వస్తుంది. ఆమె అంటే అసహ్యం పుట్టుకొచ్చినా ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

ఏమీ ఉద్దేశం లేకుండానే దోవన పోయే ప్రతి అందమైన ఆడదానివంకా చూస్తూండడం కొందరు మగవాళ్ళకొక సరదాగా కనిపించడంలేదా? అట్లా ప్రతి ఆడదానివంకా చూచే మగవాళ్ళందరి శీలాన్ని శంకించవలసిన అవసరమేమీ లేదు. అట్లానుంచుని చూస్తూండడం వాళ్ల సరదా. ఈమాత్రం సరదాను సరిగ్గా అర్థంచేసుకోలేకపోతే, వారి మనస్సులలో దాగివున్న కోరికల కారణంగానే వారు అట్లా ప్రతి ఆడదానివంక చూస్తున్నారన్న విపరీతవాదాన్ని వారి ప్రవర్తనకు అంటకడితే చాలా కష్టనష్టాలకు గురికావలసి వస్తుంది.


ఇరుగుపొరుగు మగవాళ్ళతో చనువుగా మాట్లాడడం కొందరు ఆడవాళ్ళకు సరదా. అదేవిధంగా ఆడవాళ్ళతో పరిచయం కలిగించుకొని వాళ్లతో మాట్లాడడం కొందరు మగవాళ్లకు సరదాగా వుంటుంది. ఉబుసుపోక చేసే పనులే ఇవన్నీ. ఏమీతోచక, మనస్సుకు విశ్రాంతి ఇద్దామనే దృష్టితో చేసేపనులే గాని ఏదో ఉద్దేశంతో చేసేపనులు కానే కావు.

కిటికీలో అద్దం పెట్టుకొని ప్రొద్దునా సాయంత్రం జడవేసుకొంటుందొక ఇల్లాలు. ఆ కిటికీ రోడ్డుమీదకు ఉండడంవల్ల ఆ దోవనపోయేకుర్రవాళ్లు ఆమెవంక చూస్తారు. వాళ్లను ఆమె కన్నెత్తి చూడనుకూడా చూడదు. ఇట్లా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఎన్ని సంవత్సరాలయినా అంతే. అందులో ఆమెకు ప్రత్యేకంగా ఉద్దేశమేమీ లేదు అది కేవలం ఆమె సరదా అని ఆమెభర్త గ్రహించకపోతే ఆ కుటుంబం నరకమే అవుతుందిగదా?

బజారుకు వెళ్ళి ఇంట్లోకి కావలసినవన్నీ తీసుకురావటం ఒక యువతికి సరదా. ఇంట్లోకి కావలసినవన్నీ ఒకటవ తేదీననో నెల మొదటివారంలోనో భర్త తీసుకువచ్చినా యేదో ఒక చిన్నవస్తువు తీసుకురావాలనే నెపంమీద వీలుచేసుకొని ఆ యువతి బజారుకు వెళుతుంది. ఇలా వెళ్లేవాళ్లందరూ ఏదో దురుద్దేశంతోనే బజారుకు వెళుతున్నారని భావించడం శుద్ధపొరపాటు.

తల్లిదండ్రులను చూచి ఆడపిల్లలూ మగపిల్లలూ నేర్చుకునే సరదాలు కొన్ని ఉన్నవి ఉంటవి. ఆ సరదాలు సంఘర్షణ పడకుండా చూచుకోవలసినబాధ్యత స్త్రీ పురుషు లిద్దరిమీదా సమానంగానే వుంటుంది.

నేను మగవాణ్ణి. నాసరదాలు నావి. నేను సంపాదిస్తాను. కనుక నా సరదాలకు అనుగుణంగా ఆడది సర్దుకోవాలని మగవాళ్లు భావించేరోజులు చెల్లిపోయాయి. బయట మగవాడెంత ధీరుడుగా వ్యవహరించినా, ఇంట్లో గృహిణి తన సరదాలకారణంగా ఆ యింటిని అటు నరకమో ఇటు స్వర్గమో చెయ్యగలదన్న విషయాన్ని యువకులందరూ గ్రహించాలి. మగవాళ్లి సరదాలేవో వాళ్లకు ఉంటవి. వాటితో నాకేంపని. వాటివల్ల నాకు బాధకలగనంతవరకూ వాటిని నేను విమర్శించవలసిన అవసరంలేదు. మగవాడి సరదాలవల్ల కుటుంబానికి కష్టనష్టాలంటూ సంభవిస్తే దానికి తానెంత బాధపడుతుందో భర్తకూడా అంతే బాధపడతాడనీ బాధపడవలసివుంటుందన్న దృక్పథాన్ని వనితాలోకం అలవరచుకోవాలి. ఇంతకూ యిదంతా పరస్పరం కలసిమెలసి ఉండాలనే యువతీ యువకులకు సంబంధించిన సంగతి. గృహస్థ జీవితంలో నమ్మకం వున్నవాళ్లకు సంబంధించిన విషయాలివి. ★



చైనీస్ పద్ధతి చేపలవలలు

వధువు

మూలం:
శ్రీమతి సుభద్రా కుమారీ చౌహాన్

అనువాదం:
పాలపర్తి భానుమతి

రామధన తివారీ పండితునకు భగవంతుడు సమస్తైశ్వర్యములు ఇచ్చినాడు. కాని సంతానం లేకపోవటంచేత వారి గృహము శూన్యంగా కన్పిస్తుంది. ధనధాన్యములతో నిండిన ఆ యిల్లు వారికి అడవిలాగ అనిపిస్తుంది. ఈ సంతాన లాలసతి చేత వారు ఎన్నెన్ని జపాలు చేయించారో ఎన్నెన్ని పూజలు చేయించారో ఎవరు చెప్పగలరు? ఇన్ని జపతపాలు చేయించగా ఎట్టకేలకు వృద్ధాప్యంలో వారికి పుత్రుడు కాదుకాని ఒక పుత్రిక కలిగింది. ఈ సందర్భంలో తివారీ పండితులు ఆనందంతో రెండుచేతులా ఖర్చుపెట్టారు. గ్రామస్థులందరకు గొప్ప విందు చేశారు. జన్మించినది కుమార్తే అయినప్పటికి తివారీజీకి సంతానము లేదనే కళంకమును తుడిచివేసింది.

ఆ బాలిక ఎంతో చక్కగా వుండేది. పసిడిఛాయ, పెద్ద పెద్ద కనులు, విశాలమైన నుదురు దట్టమైన వెంట్రుకలు. ఆ నల్లని వెంట్రుకలు చిన్న చిన్న వుంగరములు తిరిగి ఆ మోముకు మరింత శోభ నిచ్చేవి. ఆ బాలికకు 'సోనా' అని నామకరణం చేశారు. సోనాను ఎంతో గారాబంగా పెంచసాగారు ఆమె తల్లిదండ్రులు.

సోనాకు ఏడేండ్లు వచ్చినాయి. తివారీజీ సోనాకు ఇంటిలోనే ఒక మాష్టరును పెట్టి హిందీ చదివించడం మొదలుపెట్టారు. కొద్దికాలములోనే సోనా రామాయణము మహాభారతము మొదలైన ధార్మికగ్రంథాలు చదవడం నేర్చుకుంది. గ్రామస్థులందరు సోనా కుశాగ్రబుద్ధని ప్రశంసించారు. సోనాను ఇంతకంటె పైకి చదివించి వుద్యోగం చేయించవలసిన అవసరం తివారీజీకి లేదు. అందుచేత సోనా చదువు అంతటితో అంతమైంది.

ఇప్పుడు సోనా తొమ్మిది సంవత్సరములు కల సుకుమారియు సుందరియునైన బాలిక. ఆమె సౌందర్యమును, సౌకుమార్యమును చూచి గ్రామవాసులు—"తివారీజీ యీ కుమార్తె పల్లెటూరికి తగినది కాదు. ఈమెకు ఏ పట్టణపు సంబంధమో చూచి వివాహం చేయాలి. పట్టణంలో చాల సుఖంగా వుంటుందని అంటారు" అని అంటూండేవారు.


తివారీజీ చెల్లెలు జానకి వివాహమయిన తర్వాత కొంతకాలం గ్రామంలోనే వుండి కొద్దిదినాల క్రిందటనే పట్టణానికి వెళ్లింది. ఆమె ఎప్పుడైనా పట్టణంనుండి వెడల్పైన అంచుగల తెల్లనిచీర, లేసు వేసికుట్టినజాకెట్టు ధరించి కుంకుమకుబదులు ఎఱ్ఱనితిలకం పెట్టుకుని, చెప్పులేసుకుని వచ్చిందంటే ఆ గ్రామంలోని స్త్రీలంతా ఆమెను చూడటానికి పరుగెత్తుకుని వస్తారు. యువతులంతా ఆమెను గౌరవిస్తే వృద్ధులు అసహ్యించుకుంటారు. ఏమైతేనేం ఆమె అందరకు ఒక వింత వస్తువు. జానకిభర్త నారాయణ మిల్లులో 20 రూపాయల ఉద్యోగం చేస్తున్నాడు. అతనిప్పుడు పల్లెటూరి రైతుగాడు పదహారణాల పట్టణపుబాబులాగ తయారయినాడు. ధోవతికి బదులు పైజామా, చొక్కాకు బదులు వాస్కట్టుకోటు ధరిస్తాడు. తలగుడ్డ స్థానే హ్యాట్ పెడ్తాడు కాళ్ళకు బూట్లు. పల్లెకు వెళ్లినప్పుడల్లా సెంట్ మొదలైన వన్నీ రాసుకుని వెళ్లేవాడు. ఈ సువాసనలకు ఆ అమాయికపల్లెప్రజలంతా దంగైపోయి తమ జీవితంకంటే పట్టణ జీవితమే ఎంతో సుఖంగా వుంటుంది అనుకునేవారు.

* * *

ఈ పట్టణవాసపు డాంబికమంతా చూచి సోనా తల్లి తనకుమార్తెకు పట్టణపు సంబంధమే చేయాలని నిశ్చయించుకుంది. "పెద్ద అంచు గల చీర, లేసువేసిన జాకెట్టు, నల్లని చెప్పులు వేసుకుని నా సోనా ఎంత అందంగా వుంటుందీ!" అని వూహించుకుని సోనా తల్లి నందో ఆనందంతో మురిసిపోయేది. కాని సోనాకు ఈ ధ్యాసే లేదు. ఆమె దినమంతా పసుబాలవలె స్వేచ్ఛగా తిరుగుతూ వుంటుంది. అప్పుడప్పుడు భోజనసమయానికి వస్తూవుంటుంది. ఒక్కొక్కప్పుడు ఆటలలో భోజనంగూడ మరిచిపోతుంది. సుందరమైన వస్తువులను పోగుచేయడమంటే ఆమెకెంతో సరదా. ఆమెకు తన జతకు ఏ బాలికా దొరకదు. అందుచేత ఆమెకు ఎవరితోను అధికపరిచయం లేదు. నందోకు సోనాయొక్క ఈ స్వచ్ఛందప్రియత్వము నచ్చదు. కాని ఆమె సోనాను అడ్డగించనూ లేదు. ఒకవేళ ఆమె సోనాను ఏమైనా అంటే తివారీజీ వూరుకునేవారు కాదు. "చిన్నపిల్ల ఎప్పుడో ఒకప్పుడు పరాయింటికి పోతుంది. ఇంతలోనే దాన్ని కష్టపెట్టటమెందుకు? ఇప్పుడైనా దాన్ని దాని యిష్టమొచ్చినట్లు ఆడుకోనీయ్. ఆ తరువాత నీ యిల్లు ఎలాగూ చిన్నబోతుంది" అనేవారు.

నెమ్మదిగా నెమ్మదిగా సోనా పదమూడవ వసంతంలో కాలు పెట్టింది. కాని తివారీజీకి ఈ ధ్యానమే లేదు. ఒకరోజున నందో "సోనా వివాహంగురించి ఏమైనా విచారించారా?" అని హెచ్చరించింది. తివారీజీ ఉలిక్కిపడి "సోనా వివాహమా! అప్పుడే దానికి ఎన్నేళ్లొచ్చాయని?" అని అన్నారు.

కాని యిలా ఎన్నాళ్లు గడుస్తుంది. కుమార్తె వివాహం చేయక తప్పదు గదా? గ్రామంలోనే సోనాకు తగిన వరులు చాలమంది వున్నారు. కాని తివారీజీకి ఆయన భార్యకు కూడ తమ కుమార్తె వివాహం పట్టణపు బాబుతో చేయాలని కోరిక. నగర జీవితపు బంగారుకలలు వారి కనులయెదుట



ఫొటో: వి. కేశవశర్మ—మద్రాసు.

మొదలుతుందేమో. వారు జానకీ నారాయ ణులతో పట్టణంలో సోనాకు యోగ్యుడైన వరుని చూడమని చెప్పారు.

సోనా పదమూడేండ్లబాలిక అయినప్పటికీ యింకనూ అమాయికయే. ఇప్పుడు కూడ రాజు రాణీ బొమ్మలాటలు ఆడుతూనే వుంటుంది. చక్కని పూలుఆకులూ పోగుచేస్తూనే వుంటుంది. సీతాకోకచిలుకల వెంబడి చిన్నప్పటివలెనే పరుగిడుతూనే వుంటుంది. ఆమె యౌవనంలో అడుగు పెట్టింది. కాని సోనాకు ఆ జ్ఞానమే లేదు. ఆమె స్వభావంలో ఇప్పుడు కూడ ఎనిమిదేండ్లబాలిక కుండవలసిన నిర్లక్ష్యము, అమాయికత, అనుభవ హీనతయే గోచరిస్తుంది.

సోనా వివాహం నిశ్చయమైంది. వరుని వయసు 22, 23 సంవత్సరము లుంటుంది. చక్కనివాడు, బుద్ధిమంతుడు. ఒక ప్రెస్‌లో ఉద్యోగము చేస్తున్నాడు. 75 రూ. జీతము. అతనికి ఒక ముసలితల్లి మినహా మరెవ్వరూ లేరు. బీహార్ దేశస్థులు. కాని ప్రస్తుతం *U. P.* లో వుంటున్నారు. పరదాపద్ధతిని పురాతనాచారాలను సమర్థిస్తారు. వరుని పేరు విశ్వ మోహనుడు.

విశ్వమోహనుని, అతని యింటిని చూచి నప్పుడు తివారీజీ సంతోషానికి అంతులేక పోయింది. విశ్వమోహనుడు చూడటానికి టిక్ టాక్ గా దొరలాగ కనిపిస్తాడు. వారి యింట్లో దర్వాజాలకు కిటికీలకు తెరలు కట్టివున్నాయి. హాలుమధ్య రౌండ్ టేబిల్ దాని చుట్టూ కుర్చీలు అమర్చివున్నాయి. విశ్వమోహనుడు బలవంతం చేయడం చేత తివారీజీకి టీ త్రాగక తప్పిందిగాదు. ఆ టీ సెట్టును చూచి తివారీజీ చకితులైనారు. అందమైన ఆ కప్పులతో టీ త్రాగడం తివారీజీకి అదే ప్రథమ పర్యాయం. టీ త్రాగడమయిన తరువాత రెండుకాసులు 'వరీక్ష' యిచ్చి వివాహం నిశ్చయపరుచుకున్నారు. దారిలో ఆయన బావమరిది నారాయణ "తివారీజీ! ఇటువంటి. పిల్లవాడు నూటికి ఒక్కడైనా ఉంటాడా? చక్కగా డ్రెస్ చేసికుని హ్యాట్ పెట్టుకుని బయలుదేరితే దొరకాదని ఎవరనగలరు? ప్రజలంతా వంగి సలామ్ చేస్తారు. ఇంట్లో చూచావా? ఎంత ఘోషాయో అన్ని తలుపులకు తెరలే" అన్నాడు.

"నారాయణా! నీ యీ వుపకారం సదా జ్ఞాపక ముంచుకుంటాను. మేము వెతికితే ఇలాటి వరుడు ఎన్నటికీ దొరికేవాడుగాదు. మాకు మీ పట్టణపు విషయా లేం తెలుస్తాయ్. మా సోనాను నీవు నీ సొంత కూతురనుకుని తిరిగి తిరిగి యింత మంచి సంబంధం కుదిర్చావ్. భగవంతుడు నీకు మేలు చేస్తాడు." అన్నారు తివారీజీ సంతోషంతో.

"మంచిది. తివారీజీ! ఇక వివాహ ప్రయత్నాలు చేయండి. స్నానపాన భోజనాలలో ఎటువంటి కష్టము రాకుండా చూడండి. పట్టణపు బాబులు అన్ని కష్టాలు సహిస్తారు కాని ఆకలికి మాత్రం ఆగలేరు. పల్లెటూరి మిఠాయి వారికి నచ్చదు. నగరంనుండి మిఠాయి చేసేవాడిని పిలిపించండి. తెలిసిందా?" అన్నాడు నారాయణ.

తివారీజీ సంతోషంతో యింటికి వెళ్లారు ఆయన భార్య నందో వరుని రూపగుణవర్ణన విని పొంగిపోయింది. గొప్పింటి బిడ్డను

★ వధువు ★

సోనాకు వరునిగా కుదిర్చి భగవంతుడు ఆమె కోరిక తీర్చాడు. ఈ దయకు నందో ఈశ్వరునికి ధన్యవాదాలర్పించింది. తన సోనాకు చక్కని వరుని తెచ్చినందుకు నారాయణను మనసార ఆశీర్వదించింది. సోనా తన వివాహ విషయం విని తల్లివద్దకు పరుగు పరుగున వచ్చి "పెళ్ళంటే ఎలా వుంటుందమ్మా? అసలెందుకు చేస్తారు పెళ్ళి" అని అడిగింది. తల్లి కిది కఠినమైన ప్రశ్న. ఆమె దీనికి ఏమి సమాధానమివ్వాలో తెలుసుకోలేకపోయింది. కాని చతుర మతియైన జానకిమాత్రం "సోనా! పెండ్లయిన తర్వాత మంచిమంచి నగలు బట్టలు దొరుకుతాయి..." అని చెప్పింది.

సోనా "అత్తా తరువాత ఏమవుతుంది?"

జానకి "తరువాత అత్తవారింటికి వెళ్ళవలసి వస్తుంది."

"అయితే నేను నిన్ను నా వెంబడి తీసికుని వెళ్తానులే."

సోనా "అవును నాకు మొదటే తెలుసును పెళ్ళయినతరువాత అత్తవారింటికి వెళ్ళాలని. కాని...అత్తా! ఇప్పుడే చెప్తున్నాను నేనుమాత్రం ఎక్కడకూ వెళ్ళను. పెండ్లి చేస్తే చేయండి లేకపోతే మానుకోండి" ఇలా అని సోనా ఆడుకోవటానికి వెళ్ళిపోయింది. మాతృప్రేమ నందో కంఠంనుండి అశ్రువులుగా ప్రవహించింది. "ఇంకా చిన్నతనం. పెద్దదైతే అన్నీ తెలుసుకుంటుంది" అన్నది.

జానకి "అవును వదినా! అప్పుడు అత్తారింటినుంచి రెండురోజులు పుట్టింటికి రావటమే కఠినమైపోతుంది. అంతేకాదు వదినా! నాలుగయిదు రోజులు యిక్కడ వుంటే రాత్రింబవళ్లు అక్కడి ఆలోచనే. ఇంటి పనులు నెత్తినపడితే ఈ ఆటపాటలన్నీ మరిచిపోతాము. ఈ ఆటపాటలన్నీ పెళ్ళయేవరకే." అన్నది.

"జానకీ మీదయవల్ల మాసోనా సుఖంగా వుండుగాక. దానిపేరే 'సోనా' అలాగే దానిజీవితంలోకూడా బంగారం కురవాలి" అన్నది నందో సంతోషంతో.

* * *

సోనా వివాహమయింది. రామధన తివారీజీకుమార్తె వివాహము గ్రామంలో ఒక క్రొత్తవిషయమయింది. ఆగ్రానుండి ఒక భజనమండలిని పిలిపించారు. వారు పాడిన కీర్తనలకు అంతేలేదు. సోనాకు పెట్టిన నగలు చీరెలు అన్నీ క్రొత్తక్రొత్త ఫ్యాషన్‌వి. మేజోళ్లు రుమాళ్లు పౌడర్లు అత్తర్లు వగైరాలన్నీ నందో జానకి మొదలైనవారికి అపరిచితాలే. పేరంటాళ్ళందరకు నందో సంతోషంతో వస్తువులన్నీ చూపించింది. అవన్నీ చూచి సోనాఅదృష్టాన్ని ఎంతో ప్రశంసించారు. వారికి సోనాను మించిన సౌభాగ్యవతే కన్పించలేదు. అత్తవారిచ్చిన ఆభరణాలతో అలంకరించబడిన తన కుమార్తె సౌందర్యం చూచి పులకితురాలైంది నందో. దృష్టి తగులుతుందేమో నని వెంట్రుకల క్రిందుగా కాటికతో ఒకచుక్క పెట్టింది. ఎవరైనా సోనాను చూస్తే క్షణకాలం అలాగే నిలబడిపోయేవారు. నిజంగా సోనా సోనాయే.

అప్పగింతల సమయం వచ్చింది. తల్లీ కూతుండ్ల కండ్లు అశ్రువులతో నిండిపోయినాయి. సోనాతండ్రిని కౌగలించుకుని ఏడవటం మొదలుపెట్టింది. కూతురిని చూచి తివారీజీకూడ ధైర్యాన్ని కోల్పోయారు. సోనాను అత్తవారింటికి పంపించివేశారు. పుత్రికా వియోగంచేత తివారీజీ దుఃఖించినా కూతురు గొప్పయింటి కోడలయిందిగదా సుఖపడుతుంది అనే ఆత్మసంతోషం ఆయనకు ధైర్యాన్నిచ్చింది.

సోనా అత్తవారింటికి చేరింది. దారిలో ఎలాగో గడిపింది. కాని ఇల్లు చేరగానే ఆమెను ఒకగదిలో వుంచారు. అది ఆమెకు జైల్లో పెట్టినట్లుంది. నిర్మలమైన గాలే దుర్లభమైపోయింది. ఆమెకి నగలు చీరెలు సంతోషాన్నివ్వటం లేదు. ఆ కొట్టునుండి బయటపడి శుభ్రమైన గాలిపీల్చుటకు తహతహలాడుతోంది. నిర్మలాకాశంలో విహరించే బుల్ బుల్ పక్షిని పంజరంలో బంధించితే దానిస్థితి ఎంత దయనీయంగా వుంటుందో అదేవిధంగా వుంది సోనాస్థితి కూడ. నాలుగైదురోజుల్లోనే ఆమె గులాబి రంగు చెక్కిళ్లు తెల్లబడిపోయినాయి. కళ్లు గుంటలుపడ్డాయి.

ఒకరోజున విశ్వమోహనుడు ఆఫీసుకు వెళ్లాడు. అత్తగారు నిద్రపోతున్నారు. సోనా వీధిగుమ్మంలోకి వచ్చింది. తెర తొలగించి బయటకు చూచింది. ఇక్కడ పల్లెలలో వుండే ప్రకృతిసౌందర్యం కనిపించలేదు కాని నిర్మలమైన గాలికి మాత్రం కొరత లేదు. ఇన్నిరోజుల తరువాత బాహ్యవాయువు తగులగానే సోనామనస్సు ప్రఫుల్లమైంది. కాని అదేసమయంలో ఒక ముసలమ్మ అటునుండి వెళ్లింది. సోనాను గుమ్మంవద్ద చూచింది. ఆమె విశ్వమోహనుని తల్లివద్దకు వచ్చి "కోడల్ని కాస్త జాగ్రత్తగా వుంచు. పెండ్లై సంవత్సరాలు కాలేదు నెలలు కాలేదు. అప్పుడే గుమ్మందగ్గర నుంచుని తొంగితొంగి చూస్తున్నది. ఈ గుణం కులీనుల యింటికోడళ్లకు కూతుళ్లకు శోభించదు. నీకు ఇన్నియేళ్లు వచ్చాయి. ఇంతవరకు పరపురుషుని నీవన్నా చూసి ఎరుగుదువా? అప్పుడే నీ కోడలి లక్షణాలు చూడు. అందుకనే కలికాలం అన్నారు" అని వుపదేశించి వెళ్ళింది. ఆ రోజు సోనాకు బాగా చివాట్లు తగిలాయి. వీధిగుమ్మంలో నుంచుని తాను చేసిన అపరాధమేమిటో ఆమెకు తెలియలేదు. అయినప్పటికీ సోనా తలవంచి అత్తగారి అదలింపులన్నీ సహించింది. ఇంక మరోవుపాయమేముంది?

కొన్నాళ్లకు తివారీజీ సోనాను తీసికెళ్లటానికి వచ్చారు. తండ్రిని చూచి ఆమెకు అమితసంతోషమయింది. ఇప్పుడు వెళ్లితే మళ్ళీ నాజన్మలో ఇక్కడకు రాకూడదని మనసులోనే ప్రతిజ్ఞ చేసుకున్నది.

కాని పట్టణపుకోడలిని పుట్టింట్లో ఎన్నాళ్లు వుండనిస్తారూ? సోనా పుట్టింటికి వచ్చి పదిహేను రోజులయినా కాకమునుపే విశ్వమోహనుడు భార్యను తీసుకెళ్ళడానికి వచ్చాడు. సోనా అతనికి దారిలోనే ఒక పండ్లచెట్టుమీద కనిపించింది. ఆమెవెంబడి యింకా చాలమంది పిల్లలున్నారు. సోనా జడవేసికోకుండా ఆ చెట్టుమీద కూర్చుని కొన్ని పండ్లు తింటూ, కొన్ని కొరికి అవతల పారేస్తు ఉన్నది. సోనాను విశ్వమోహనుడు చూచాడు కాని సోనా అతనిని చూడలేదు. భార్యప్రవర్తన విశ్వమోహనుడికి నచ్చలేదు. అతని కండ్లు కోపంతో ఎర్రపడ్డాయి. సోనాను మరెప్పుడూ పుట్టింటికి పంపకూడదని మనసులో నిశ్చయించుకున్నాడు. అతను వెళ్లి కుర్చీలో కూర్చుంటుండగానే సోనా తన స్నేహితులతో వచ్చింది. అతనిని చూడగానే చేతిలో పండ్లవతల పారేసి లోపలికి పారిపోయింది. తిరిగి అత్తవారింటికి వెళ్లాలని తలుచుకోగానే ఆమె దుఃఖంతో కృంగిపోయింది.

సోనా మరల అత్తవారింటికి వచ్చింది. ఈమారు సోనా అత్తగారు ఇంటి భారమంతా సోనాకు వప్పచెప్పి తను గృహకృత్యాలనుండి సెలవు తీసికుంది. ఎప్పుడు ఇంట్లో పనులుచేసే అభ్యాసం లేకపోవటంచేత సోనాకు చాల కష్టంగావుండేది. పైగా అత్తగారి బెదిరింపులూ, సోనా ఆడటం పాడటం సీతాకోక చిలుకలాగ ఎగరటమే నేర్చుకున్నది కాని, ఇంటిగొడవ లేమీ తెలియవు. కాని ఈ కష్టం ఒకటి రెండు నెలలే. తరువాత అదే అలవాటయింది.

అయితే రాత్రింబవళ్లు ఇంట్లో కట్టుబడి వుండటం ఆమెకు కష్టమైపోయింది. బయటకు వెళ్లటంకోసం ఆమె మనస్సెప్పుడూ ఆరాటపడుతుండేది. ఈ కారాగారవాస జీవనము ఆమెకు చాల కష్టమనిపించేది. గృహకృత్యాలన్నీ అయిన తరువాత అత్తను భర్తకు తెలియకుండా కిటికీవద్దనో గుమ్మంవద్దనో నుంచుని బాహ్యదృశ్యాలు, పచ్చ

వచ్చిని చెట్లు చేమలూ చూచి ఆనందించేది. చల్లని గాలి తగులగానే ఆమెకు ప్రాణం లేచివచ్చినట్లనిపించేది. కాని ఇది పేట లోనివారు సహించలేకపోయారు. నిన్న మొన్న వచ్చిన కోడలు కిటికీలదగ్గర గుమ్మాల దగ్గర నిల్చోవటమా? ఎంత ఆచరణ భ్రష్టమైన విషయం! మెల్లిమెల్లిగా ఇరుగుపొరుగు వారిలో సోనాను గురించిన చర్చలు ఎక్కువైనాయి. పూర్వాచార పరాయణులకు పద్ధతిని సమర్థించేవారికి సోనాచేసే ప్రతి పనిలోనూ చెడ్డ తప్ప మంచి కనిపించటంలేదు. ఆ పేటలోని పోకిరిపిల్లలు ఈలలు వేస్తూ సోనా యింటిముందు తిరుగుతుండేవారు. కాని సోనా ధ్యాస ఆవైపే వుండేదు. అయినా ఆమె వాటిని లక్ష్యపెట్టదు. ప్రకృతి ఆమె ఆరాధ్య దేవత. ఆ ప్రకృతిశోభను తిలకించటమే ఆమెకు ఆనందం. ప్రజల మాటలు ఆమె చెవిసే దూరవు.

సోనా అత్తగారికి ఏదో పనిమీద పూరికి వెళ్ళవలసి వచ్చింది. ఇప్పుడు భర్తను ఆఫీసుకు పంపింతరువాత సోనా స్వేచ్ఛగా తిరుగుతుండేది. ఆటంకపరిచేవారెవరూ లేరు. అప్పుడప్పుడు ఇరుగు పొరుగువారింట్లకుపోయి వారితో పరిచయం చేసికున్నది. వారుకూడ సోనా యింటికి రాకపోకలు సాగించారు. తన్ను గురించి తన ప్రవర్తనగురించి ప్రజలేమనుకుంటున్నారో ఆమెకు తెలియదు. ఆమె తనయింటికి వచ్చినవారందరిని తన మిత్రులని తన శ్రేయస్సుకోరేవారని తలచేది. గంటలతరబడి ఇక్కడ బాతాఖానీ కొట్టి వెళ్ళి బయట ఏమేమో వాగుతారని ఎలా అనుకుంటుంది? ఈ చర్చలు విశ్వమోహనుని చెవిదాకా చేరినాయి. వీటిని ఆపటం కోసం తనతల్లిని పిలిపించటం అవసరమని వెంటనే తల్లిని పిలిపించాడు. సోనానుకూడ జాగ్రత్తగా వుండవలసిందని చెప్పాడు. అత్తగారు రాగానే సోనామీద కాపలా తిరిగి ప్రారంభమయింది. విశ్వమోహనుడు ఏకాంతంలో "నీవు ఇలా చేయటంవల్ల నీకు చెడ్డపేరు వస్తున్నది. కనుక బయటకు వెళ్ళవద్దు" అని ఎన్నోమార్లు చెప్పాడు. ఆమాటలు సోనాకు ఒకటి రెండురోజులు మాత్రమే జ్ఞాపకముండేవి. తిరిగి యథాప్రకారం తయారయ్యేది ఆమెస్థితి. ఆ ప్రకృతిదృశ్యముల చూచుటకు వువ్విళ్ళూతలూగేదామె మనసు.

ఏదో పనిమీద విశ్వమోహనునికి పొరుగూరు వెళ్ళాల్సొచ్చింది. సోనా సామాను సర్ది భర్తను స్టేషనుకు పంపించింది. అత్తగారు భోంచేసి పడుకున్నది. సోనా పనులన్నీ చేసికుని జడవేసికుని గుడ్డలు మార్చి తాంబూలం వేసికుని చదవటానికి ఒకపుస్తకం తీసికుని మంచముమీద పడుకున్నది. అది ఎన్నోసార్లు చదివిన పుస్తకమే. పేజీలు అటు ఇటు త్రిప్పింది. మనసు దానిమీద లగ్నం కాలేదు. అదేసమయంలో ఏవో అమ్మకుసేవాడికేక వినిపించింది. సోనా ఆ పుస్తకం అక్కడ పారేసి గుమ్మంవద్దకు పరిగెత్తింది. కాని వాడు దూరం వెళ్ళిపోయాడు. ఎంతచూచినా కనిపించలా. నిరాశచెంది లోపలికి పోబోతుండగా పొరుగునవుండే కోమట్ల అబ్బాయి ఫైజా పరిగెత్తుకుంటూవచ్చి "వదినా! సూది దారం వుంటే కొంచెం నా చొక్కాకు గుండీలు కుట్టి పెట్టవూ. కుస్తీ చూడటానికి వెళ్లాలి!" అన్నాడు.

"కుస్తీ చూడటానికా? కుస్తీ పట్టడానికా?" అన్నది సోనా.

సైజా నవ్వి "రెండింటికీ! ముందు గుండీలు కుట్టు. లేకపోతే ఆలస్యమైపోతుంది." అని తొందర పెట్టాడు.

సోనా గుండీలు కుట్టుతున్నది. ఫైజా అక్కడే అరుగుమీద సోనాకు కొంచెం దూరంగా కూర్చున్నాడు.

* * *

రైలు 8 గంటలు లేటయింది. విశ్వమోహనుడు ఇంటికి వెళ్లి తిరిగి వద్దామని సామాను స్టేషనులోనే వుంచి స్టేషనుమాష్టరు సైకిలేసుకుని ఇంటికి వచ్చాడు. వరండాలో ఫైజా సోనాదగ్గర కూర్చునివుండటం చూచి అతని శరీరం ఉడికిపోయింది. ఎలాగో తన కోపాన్ని అణుచుకుని లోపలకు వెళ్ళిపోయాడు. సోనావద్ద భర్తకోపం దాగలేదు. ఎలాగోలాగ గుండీలుకుట్టి ఫైజాకిచ్చి లోపలకు వచ్చింది.

ఇంత చిన్న విషయానికిఇంతకోపం వస్తుందని ఆమె కలలోకూడ తలచలేదు. భర్తముఖం చూచి ఆమె నిర్ఘాంతపోయింది. విశ్వమోహనుడు ఆమెకు కన్నెత్తి చూడలేదు. ఆమె భయపడుతూ "తిరిగి వచ్చారెందుకు?" అని అడిగింది.

"బండి లేటయింది" అన్నాడు కోపంగా విశ్వమోహనుడు.

"మళ్ళీ ఎప్పుడు వెళ్తారు" తిరిగి అడిగింది సోనా.

"మూడు గంటలతరువాత" అన్నాడు విశ్వమోహనుడు.

"అయితే యిలా ఎంతసేపని కూర్చుంటారు. పక్క వేస్తాను. విశ్రాంతిగా పడుకోండి." అన్నది నమ్రతగా.

"నీవంత శ్రమపడవలసిన అవసరంలేదు" అన్నాడు కఠినంగా విశ్వమోహనుడు. సోనా ఎంతో బలవంతపెట్టగా చివరకు గదిలో కాలుపెట్టాడు. కాని పడుకోకుండా కుర్చీలో కూర్చుని పుస్తకం చదవనాగాడు. కాని ఒక్క అక్షరమైనా చదవలేకపోయాడు. సోనా ప్రవర్తన అతనికి తేలకొలది తేళ్ళుకుట్టినంత బాధను కలుగచేస్తున్నది. భర్తబాధను సోనా గ్రహించింది. సోనా మెల్లగా అతని పాదములపై తన తలను వుంచి "ఈసారి నన్ను క్షమించండి. ఇక మీరు చెప్పినట్లు నడుచుకుంటాను. నామీద కోపగించకండి"అని ప్రార్థించింది. విశ్వమోహనునికి తన పాదాలమీద నిప్పులుంచినట్లనిపించింది. వెంటనే తన కాళ్లను వెనక్కు లాగుకుని కోపంతో "ఇలా చెప్పటం నీకిది మొదటిసారా. నీ యీ మాటలు హృదయపూర్వకమైనవి గావు. నాకన్నీ తెలుసు. నీవల్ల నేను వూళ్లో తలెత్తుకుని తిరగలేకపోతున్నాను. ఎక్కడపడితే అక్కడ ప్రజలు నిన్నుగురించే చర్చిస్తున్నారు. నీదగ్గర నాదగ్గర ఏమీ అనకపోతే సరా? చాటున గుసగుసలాడుతారు.



★ వధువు ★

నీవు వాటినేమాత్రం లక్ష్యపెట్టవు. నీ మనస్సుకు నచ్చింది చేసి పూరుకుంటావు.... సరే.. ఆ పోకిరీవెధవ నీవద్ద గుండీలు కుట్టించుకోటాని కొంగుకొచ్చాడు. నీవు అవకాశమివ్వకపోతే ఎవరైనా ఎందుకు వస్తారు?" అని అడిగాడు. సోనా భయభీత నేత్రాలతో భర్తను చూస్తూ "చిన్నపని, పొరుగుపిల్లవాడు. కుట్టిపెట్టమన్నాననుకున్నాను. లేకపోతే ఎందుకు కాదనను?" అన్నది.

"ఇలాగే చిన్నచిన్న పనులే పెద్దవవుతాయి. ఇరుగుపొరుగువారి అవసరాలు తీర్చి నా గౌరవాన్ని మాత్రం లెక్కచేయకు" అని అంటూ బయటకు వెళ్లిపోయాడు విశ్వమోహనుడు.

ఈ అవమానంతో సోనా కృంగిపోయింది. కొట్టివేసిన చెట్టులాగ మంచంమీద వాలిపోయింది. తరువాత ఆమె మనసుకొంత తేలికపడింది. ఆమెకు తన గ్రామంలోని స్వచ్ఛంద జీవనం జ్ఞప్తికి వచ్చింది. పల్లెజీవితపు సుఖ స్మృతులు సుకవియొక్క సుందరకల్పనలవలె జ్ఞప్తికి రాసాగినాయి......

"చలికాలంలో వృద్ధులు యువకులు, యువతులు, పిల్లలు అందరం చలిమంట చుట్టూ కూర్చుని చలికాచుకుంటూ, పాతుపుకథలు వేసికుంటూ, కట్టుకథలు చెప్పుకుంటూ ఎన్నో రాత్రులు గడిపేవారం. అక్కడ ఏలాటి కట్టుబాటులూ వుండేవి కావు. యువతులందరం నదికి స్నానానికి వెళ్లి అందరం ఒకేసారి తిరిగి వచ్చేవారం. అది యెంత సుఖమయజీవనం! పొలంలోకి వెళ్లి శెనగకాయలు తెచ్చుకుని అందరం ఒకచోట కూర్చుని తింటూ అప్పుడప్పుడు ఒకరిని ఒకరు లాక్కునేవారం. ఇక నవ్వులకు పరిహాసాలకు అంతేలేదు. పొరుగింటి కుందన్‌కోసం అమ్మతో పోట్లాడి మిఠాయి తీసికెళ్ళేదాన్ని. నదిలో స్నానం చేసిన తరువాత కుందన్ నా చీరెనుకూడ వుతికేవాడు. కాని దీనిగురించి అక్కడ చర్చలేమీ జరిగేవికావు. గాజుపూసలతో చక్కని పద్మకుట్టి అందరియెదుట కుందన్‌కు ఇచ్చాను. అది ఇప్పటికీ అతనివద్ద వుండి వుండవచ్చును. అయితే ఈ విషయం అక్కడ యెవరికీ చెడ్డగా తోచలేదు. అక్కడ అందరికీ అందరితో మాట్లాడే స్వతంత్రం వుంది. కుందన్ వదిన కొత్తగా కాపరానికి వచ్చింది. ఆమె మా అందరితో రోజూ నదికి స్నానానికి వచ్చేది. మాతోబాటు వూయాలలూగేది. చలిమంటదగ్గర కూర్చునేది... నేనేం పాపం చేశాను? నామూలంగా ఆయన వూళ్ళో తలెత్తుకు తిరగలేకపోవటానికి. ఎవరికైనా కొంచెం పని చేసిపెట్టటం, మాట్లాడటంకూడ పాపమేనా? అయితే ఈపాపం తెలిసో తెలియకో నావల్ల జరుగుతూనే వుంటుంది. నావల్ల ఆయన క్షణక్షణము నిందలపాలు కావలసివస్తే నా ఈ జీవితానికి విలువేమున్నది? ఇలా జీవించేకన్నా చావటమే మేలు. నేనీ ఘోషాలో వుండలేను. ఇదేకదా నా అపరాధం? ఇందుకేగా నా ప్రవర్తనలో ప్రజలు కళంక మాపాదించటం? అందరితో కలసి మెలసి వుండటమేగా నాలోని చెడ్డతనం! ఈరోజు వారికి నామీద కోపం వచ్చింది. ఇందులో వారి దోష మేమీ లేదు. రోజురోజు త్రాటితో లాగటంచేత రాతి పలకమీద కూడ చారలు పడుతాయి. శ్రీరామచంద్రునివంటి మహా పురుషుడు కూడ చిన్న విషయంమీద సీతాదేవిని అడవికి పంపించాడు. ఇక వీరో మానవమాత్రులు. అటువంటప్పుడు ఈ అపవాదుల ప్రభావం వారిమీద యెందుకు పడదు? వారు చెప్పింది బాగానేవున్నది. కాని ఇందులో నా దోషంమాత్రం ఏముంది... వారి హృదయంలోకూడ సందేహం గూడు కట్టుకుని వున్నప్పుడు నేను బ్రతికియుండి చచ్చినదానికంటే హీనము." ఈ విధంగా సోనా మస్తిష్కంలో అనేక సంకల్ప వికల్పాలు వచ్చినాయి పోయినాయి.

* * *

మూడు రోజుల తరువాత విశ్వమోహనుడు తిరిగి వచ్చాడు. వెళ్ళబోయేముందు తనకు సోనాకు జరిగిన సంభాషణలే గుర్తులేవు. సోనాకోసం చక్కని చీరెలు అందమైన చెప్పులు, తలపిన్నులు తీసికుని యింటికి వచ్చాడు. కాని ఎదురింటి అరుగుమీద ఫైజూ కనిపించాడు. అతను దగ్గరలో నే వున్న పచ్చగడ్డిమీద తన తిత్తిరిపిట్టను మేపుతున్నాడు. విశ్వమోహనుడు అతనిని చూడగానే గడబిడపడ్డాడు. తిరిగి సందేహం కలిగింది. అన్ని విషయాలూ తిరిగి క్రొత్తగా కనిపించాయి. ఏవేవో సంశయాలు అతన్ని వ్యాకులపరచసాగాయి. అతనిముఖం గంభీరమైపోయింది. తల్లితో ఒకటి రెండు మాటలాడి భోజనం చేయకుండానే ఆఫీసుకు వెళ్ళిపోయినాడు. సోనా ఈ ఉపేక్ష సహించలేకపోయింది. ఈ మూడురోజులనుంచి ఆమె బయటకు తొంగిచూడలేదు. ఇకముందెప్పుడు వెళ్ళకూడదనికూడ నిశ్చయించుకున్నది. కాని విశ్వమోహనుని ప్రవర్తన ఆమె హృదయాన్ని గాయపరిచింది. సోనా ఇక సహించలేకపోయింది. వాకిట్లో వున్న వుమ్మెత్తి మొక్కనుండి రెండుకాయలు తెచ్చి వాటిని త్రొక్కి ఆరసాన్ని త్రాగింది. కొద్దిక్షణాలలో ఆమె చేతులు కాళ్లు కొట్టుకోవటం మొదలుపెట్టాయి. మాట పడిపోయింది. ముఖం నల్లబడిపోయింది. ఆమె చూస్తున్నది. కాని మాట్లాడలేకపోతోంది. అదేసమయంలో తివారీజీ సోనాను తీసుకుని వెళ్ళటానికి వచ్చారు సోనా తండ్రిని చూచి పెద్దగా ఏడ్చింది. ఇల్లంతా గోలగా వుంది. చూస్తూవుండగానే సోనా ప్రాణాలు గాలిలో కలిసిపోయినాయి ఇది సోనాకు సదా శాంతినిచ్చే నిద్ర. అపవాదుల విషవాయువులు ఇప్పుడామెను తాకనుకూడలేవు.

సాయంత్రం ఆరు గంటలకు విశ్వమోహనుడు ఇంటికి వచ్చాడు. ఏడ్పుధ్వని విని ఏదో తెలియని సంశయంతో అతని హృదయం విచలితమైంది. లోపలికి వచ్చి చూచేసరికి తివారీజీ కుమార్తె మృతదేహాన్ని ఒడిలో పెట్టుకుని ఏడుస్తున్నారు.

దహనసంస్కారాలై యింటికి వచ్చిన తరువాత విశ్వమోహనునికి సోనా వ్రాసిన లేఖ ఒకటి బల్లమీద కనిపించింది.

"స్వామీ! నేను చనిపోతున్నాను. చచ్చిపోయేవాళ్లు అబద్ధమాడరు. ఆఖరుసారి ఈరోజైనా నామాట నమ్మండి. నేను నిర్దోషిని. ఈ ప్రపంచం నాకు తగినది కాదో లేక నేనే ఈ ప్రపంచానికి తగినదానిని కానేమో నని పిస్తున్నది. మోసంతోను, కపటంతోను నిండిన ఈ లోకంలోకి నన్ను పంపటం భగవంతునికి వుచితంకాదు...ఒక వాతావరణం పెరిగి మరొక వాతావరణంలోకి వచ్చి వెంటనే దీనికి అనుకూలంగా నన్ను నేను మార్చుకోవడంలో అసమర్థురాలనైనాను... నే చనిపోతున్నందుకు నాకు విచారం లేదు. నా విచారమల్లా మీ కెప్పుడూ సుఖాన్ని యివ్వలేకపోయినాననే...

—అభాగిని, సోనా.

★



బూచివాడు

అలపర్తి వెంకట సుబ్బారావు

"బూచివాడ! యిటురారా!
బుట్ట అల్లుకొని తేరా!
ఏడ్చుచున్న మా పాపను
ఎత్తుకెళ్లు మీాయింటికి."

ఇట్లు, తల్లి పిలచినంత
ఏడ్పుమానిపాప, వీధి
అరుగుమీాదికెళ్ళి, బొమ్మ
లాట లాడుకొనుచుండగ,

బొమ్మలతో నిండియున్న
బుట్టనొకటి చేతబూని
పాపగారి మేనమామ
పట్టణంబునుండివచ్చె!

పాప, వానిజూచినంత
భయముతోడ పరుగుదీసి
అమ్మదరికిజేరి వేగ
అడిగె నిట్లు దీనముగా,

"ఏడ్పు మానినానుగదా!
ఎందుకొచ్చె బూచివాడు
గుమ్మములో నిలచినాడు
పొమ్మనిచెప్పమ్మ వాని!"

తల్లి యపుడు బయటికొచ్చి
తమ్ముని గని ముదముజెంది
వివరముగా పాపభయము
వినిపించెను - అంత నతడు

"ఏడ్పు మానినావుగనుక
ఎత్తుకెళ్ళ నిపుడునిన్ను!
ఎప్పుడైన నీవు యింక
ఏడ్చినచో వత్తు" ననెను.

"ఇంక నెపుడు ముద్దుపాప
ఏడ్వదయ్య నిజముగాను!
పెద్దదియైనాక బహుశ
పెండ్లికొరకు ఏడ్చునేమొ!

బూచివాడ! అపుడె నీవు
బుట్ట అల్లి తీసుకొచ్చి
ఎత్తుకెళ్లు మా పాపను
ఎవ్వ రడ్డురారు నీకు!"

అని, నవ్వుచు పాపతల్లి
అన్నది తన తమ్మునితో!
"ఏమే! అంతేన?" యనుచు
ఎత్తుకొనెను పాప నతడు.



కథాగేయ సుధానిధి

కుక్క - తోడేలు

"ఎల్లవేళలందును
ఇల్లుగాచుచుండును"
అనుచు నొక్కకుక్కను
ధనికు డొకడు పెంచెను.

కుక్కమాత్ర మెప్పుడు
ఒక్క చిన్నచప్పుడు
చేయకింటి పంచను
హాయిగ నిదురించును.

తోడే లొకదినమున,
దొంగలాగు మెల్లన
కుక్కకడకు వచ్చెను,
గ్రక్కున పై దూకెను.

కుక్క కదలలేకను
కుక్కిన పేనాయెను.
ముప్పు తప్పు కొనగను
మోసగించ నెంచెను:

"ఆగుము తోడేలా!
అంత తొందరేలా?
శరణంటిని గాదా?
కరుణ చూపరాదా?

ఈ యింట వసించుచు.
వేయికండ్ల గాచుచు,
బొత్తిగ పాడైతిని,
బొమికల గూడైతిని.

ఎంతకష్టపడినను
ఇంత ముద్దనైనను
పెట్టడు యజమానుడు,
వట్టి దయాహీనుడు.

అయిన, మరొకవారము
ఆగిన, ఆహారము
కరువుతీర దొరకును;
కడుపునిండ తిందును.

మరొకవార మాగిన
మాఘమాస మందున
పెద్ద ఎత్తుపైనొక
పెండ్లి జరుగుతప్పక.

గాడిపొయ్యి చెంతను
కాపువేసి యుందును.
ఎవరు చూడకుండను
ఎన్నెన్నో తిందును.

తినితిని యా వంటలు
నును పెక్కును కండలు.
గారెలెన్నొ తిందును,
గాన రుచిగ నుందును.

అప్పుడు నన్ను బావా!
ఆరగించరావా?"
ఇటు కుక్క పలికెను,
వృకము ఆలకించెను.

దాని మనసు కరిగెను
తనవనమున కరిగెను.
వారమైన పిమ్మట
వచ్చిచూడ నచ్చట,

దుక్కలాగు బలిసిన
కుక్క యింటి కప్పున
పడుకొని తోడేలును
పరిహసించుచుండెను.

"ఇంటి కప్పుమీదకు
ఎక్కినావు ఎందుకు?
క్రిందికి రమ్మింకను,
తొందరగా తిందును."

ఈసపు కథలు: 14


నండూరి రామమోహనరావు

అని తోడే లనుటయు
విని పలికెను కుక్కయు
మరలవచ్చినావా?
మందబుద్ధి బావా!

ఒక్కసారి తటలిన
కుక్క మరల దొరకునా?
పారబడితివి బేలా
పొమ్మిక తోడేలా

ఆదమరచి యుంటిని
అపుడు పట్టువడితిని
నీకు మరల చిక్కుట
నీటిమూట దక్కుట!

కుక్క యిట్లు దురుసుగ
వెక్కిరించి పలుకగ
తోడేలది విన్నది
తోకముడిచి చన్నది



నీతి

అనుభవమ్మునుండి నేర్చు
కొనవలె గుణపాఠమ్మని

సులభరీతి మంచినీతి
తెలియజేయు మీదిగీతి

(పెద్దకథ)

ఘోరారణ్యము

4

హెర్మియా ఎక్కిన చిట్టిగుఱ్ఱం చాలా చిన్నదీ చురుకైనదీని. హెర్మియా పదేళ్ల పిల్లయే గనక, గుఱ్ఱానికి ఆబాలిక తన నడ్డిమీద ఉన్నట్టే అనిపించలేదు. ఎగెయూసూ, తక్కిన యోధులూకూడా— ఒడ్డూ పొడుగూ ఉన్న మనుషులు. వాళ్ళ గుఱ్ఱాలు కూడా మాంచి ఎత్తైనవి. అవి తమ శరీరాలూ, తమపైనున్న యోధుల శరీరాలూ మోసుకురావటంలో చిట్టి గుఱ్ఱంకంటే కొంచెం వెనకపడిపోయాయి. తాను ముందూ, వాళ్లు వెనకా అవటంతో హెర్మియాకి ఒక కొంటె ఆలోచన కలిగింది. ఆమె ఉన్నట్టుండి, గుఱ్ఱం ప్రక్కలను రికాబులతో నొక్కి, కొరడాతో ఒక్కటి వేసి, "ఛల్, చల్" అనేసరికి అది వాయువేగాన పరుగెత్తసాగింది.

యోధులతో తాను పుచ్చుకున్న ద్రాక్ష పారాయాన్ని వర్ణిస్తో మెల్లిగా గుఱ్ఱాన్ని నడుపుకుంటూ వస్తోన్న ఎగెయూసు ఉలిక్కిపడి, 'హెర్మియా, ఏమిటా తొందర? ఆగు. అడవి అన్నమాట మరిచిపోకు. ముందు వెళ్లి దారితప్పేవంటే కొంప మునిగిపోతుంది!' అని అరిచాడు.

ఆమె వానిమాట వినిపించుకోలేదు. కొంటెగా నవ్వుతో, 'చేతనైతే మమ్మల్ని పరుగులో అందుకోండి చూస్తాను!' అంటూ పందెంకట్టి, 'చల్, చల్, చలో' అంటూ, రికాబులు నొక్కుతో కొరడాతో మధ్యమధ్య తగిలిస్తో చిట్టి గుఱ్ఱాన్ని హెచ్చరించేసరికి, ఆ బాలిక చేస్తోన్న తమాషా అర్థమైనదానికి మల్లేనే ఆ గుఱ్ఱంకూడా చురుగ్గా ఎగిరి దాడుతీసింది.

ఎగెయూసు కంగారుగా, 'హెర్మియా, ఆగు, ఆగు!' అంటూ అరుస్తో తన అరబ్బీగుఱ్ఱాన్ని పరుగెత్తించాడు కాని చిట్టిగుఱ్ఱాన్ని అందుకోలేకపోయాడు. చెట్టుకొమ్మలు క్రిందగా ఉన్న దట్టమైన అడవి అవటంవల్ల, ఎక్కడ ఆ కొమ్మలు తగులుతాయో అన్న భయంతో ఎగెయూసూ, మిగతా ఇద్దరూకూడా జాగ్రత్తగా వంగివంగి వెళ్లవలసి వచ్చింది. చిట్టి హెర్మియాకూ ఆమె స్వారిచేస్తోన్న చిట్టి గుఱ్ఱానికీ అట్టిభయం లేదుగనక, వాళ్లు దూసుకుపోతోన్న బాణానికి మల్లే ఆ అడవిదారమ్మటే ముందుకు చొరుచుకుపోయి, మొదట కనుచూపుమేరలో ఉండి మరుక్షణంలో ఇట్టే మాయమైపోయారు.

పిల్ల లేమైపోతారో అన్న ఆదుర్దా పెద్దలకున్నంతగా తాము ఏమైపోతామో అన్న భయం పిల్లలకు ఉండదు. అందులో హెర్మియాకు అలాంటి బెదురు ఎన్నడూ లేదు. ఏమంటే ఆమె స్వతహాగా ధైర్యమైన బాలిక. అప్పటికప్పుడే ఆమె ఆ గ్రీకు కుటుంబంఉన్నచోటుకు చాలాసార్లు వెళ్లి వచ్చింది గనుక ఆ అడవిదారి ఆమెకు బాగా అలవాటైంది కూడాను. ఇంతవరకూ ఆమె కాప్రయాణాలలో ఏ క్రూరమృగం తారసపడలేదు. అందువల్ల ఆమెకు ఆ భయంకూడా తెలియదు.

ఆమె వెళ్ళివెళ్ళి, 'ఇంక ఆగుదాం. ఆ పొదుపులో చెట్టుప్రక్కన గుఱ్ఱాన్నిదాచి, నేను చెట్టు

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

పొదలో దాక్కొని వెతుక్కుంటూ వస్తోన్న ఎగ యూసుమీదకురికి హడలగొడతాను! మొదట కోప పడ్డా, నేనంటే గారం గనుక ఏమీ చెయ్యడు'' అను కుని ఆ కొంటెబాలిక మళుపులో గుఱ్ఱాన్ని ఆప బోయింది.

కాని ఆమె ఒకటి తలుస్తే దేవుడొకటి తలచా డన్నట్లైంది. ఆ ప్రక్కనున్న పొదలో పిల్లలకు పాలిచ్చు కుంటూన్న అడవిపంది ఒకటి మహావేగంలో వస్తోన్న గుఱ్ఱం డెక్కలచప్పుడు విని బెదిరి ప్రాణభీతితో లేచి పారిపోబోయి పిల్లలతోసహా దారి కడ్డంగా వచ్చింది హఠాత్తుగా ఆ మృగాన్ని చూసి గుఱ్ఱం బెదిరిపోయి పక్కకొక గెంతుగెంతి పొదలనక పుట్టలనక, అడవిలోకి పారిపోయింది. స్వారిచెయ్యటంలో ఆరితేరింది గనుక హెర్మియా ఆ గుఱ్ఱాన్ని ఎలాగో అంటిపెట్టుకుని ఉంది గాని మరొకతైతే ఆ దూకుడులో గుఱ్ఱంమీద నుంచి పడిపోయేఉండును.

చిట్టిగుఱ్ఱం భయంతో అలాగ పారిపోతోనే ఉంది 'దారితప్పి సాంద్రారణ్యంలోకి చొరుచుకు పోతోంది గుఱ్ఱం అని తెలవటంతోనే హెర్మియాకు ఆదుర్దా ప్రారంభమైంది. తన శక్తినంతా వినియో గించి ఆమె గుఱ్ఱాన్ని ఆపటానికి ప్రయత్నించింది. కళ్లేలు బిగించింది, గుఱ్ఱాన్ని తిట్టిపోసింది, మెల్లిగా మంచిమాటలతో బ్రతిమాలింది. కాని లాభం లేక పోయింది. హడిలిపోయిన ఆ గుఱ్ఱం ఆగకుండా దారి తెన్నూ లేని అరణ్యంలోకి పారిపోతూనే ఉంది.

పాపం హెర్మియా అలసిపోయింది ఏమి

మీ చర్మమును సొగసుగ మరియు మనోహరముగ ఉంచుటకు సులభమైన ఈ రాత్రి పగలు చర్మ రక్షణ సాధన మీకు అవసరము



పాండ్స్ కోల్డ్ క్రీమ్ మరియు
పాండ్స్ వ్యానిషింగ్ క్రీములను
రెండిటినీ వాడుతూంటే అవి మీ సహజ
సౌందర్యమును బయలు పరచును

చర్మమును మృదువుగను, నిర్మలముగ చేయుటకు రాత్రి వాడే క్రీమ్ మీరు పడుకునే ముందు విశేషమైన పాండ్స్ కోల్డ్ క్రీమ్ వాడండి అది కొన్ని సెకండ్లలోనే మీ చర్మమునకు కావలసిన సహజమైన నూనెలు మరియు శేమ లోపములను పూర్తిచేసి యధాస్థితికి తెచ్చుటయేకాక దానిని తేటగా మరియు మనోహరముగ ఉంచుటకో మీకు సహకరించును


పాండ్స్ కోల్డ్ క్రీమ్ అద్భుతముగ చర్మమును శుభ్రపరచును —రోమరంధ్రములు పెద్దవి కాకుండా రక్షణ నిచ్చి మీ చర్మమును బహునిర్మలముగ నిష్కళంకముగ ఉంచును.

చర్మమును కాపాడుటకు మరియు సుందరముగ చేయుటకు పగలు వాడే క్రీమ్ తేలికగ మరియు మంచువలెనున్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ పైపైన ముఖమునకు రాసుకుంటే పగటివేళ మీ అందమును అధికము చేస్తుంది. మనోహరము నిష్కళంకమైన చర్మమును పాడుచేయు దుమ్ము సూర్యరశ్మి మరియు వడగాడ్పుల నుండి యిది మీ చర్మమునకు సౌమ్య రక్షణ నిచ్చును. మరియు పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ మరీ జిడ్డుగా ఉండే చర్మమునకు ఒక అద్భుతమైన సాధనము — దీనితో రోమరంధ్రములను అడ్డి కళంకము కలిగించే అధికమైన నూనెలు లేకుండా చేయవచ్చును.

పాండ్స్

కోల్డ్ క్రీమ్

వ్యానిషింగ్ క్రీమ్



ప్రతి చోట అందమైన స్త్రీలు వారి సౌందర్య రక్షణకు యీ సులభమైన రెండు క్రీములనే వాడుతున్నారు మీరూ వారివలె పాండ్స్ కోల్డ్ క్రీమ్ రాత్రి మరియు పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ పగలు వాడండి త్వరలోనే నవవికసిత పుష్పమువలెనున్న మీ ముఖమును చూచుకొని మీరు చకితులౌతారు

P 1633

చెయ్యాలో తెలియక కంగారుపడుతోన్న ఆ బాలికకు క్రిందగా ఉన్న లావాటి మఱ్ఱికొమ్మ ఒకటి అడ్డువచ్చి తగిలి ఆమె టపీమని గుఱ్ఱంమీదనుంచి పడిపోయింది. ఆమెకు బలమైన గాయం తగిలి వెంటనే స్మృతితప్పి మూర్ఛపోయింది. ప్రాణభీతిలో ఉన్న గుఱ్ఱం ఏమి జరిగినదీ తెలుసుకోకుండానే ఆమెను వదలి అడవిలోకి చొరుచుకు పారిపోయింది.

ఎగెయూసూ వాని అనుచరులూ, చూస్తోండగానే ఇట్టే మాయమైన హెర్మియాకోసం అడవి గాలించారుకాని ఆమెజాడ కనుక్కోలేకపోయారు. ఎడారులలోనూ అడవులలోనూ తప్పిపోయినవాళ్లని కనుక్కోడం అసాధ్యం. తన యజమాని ఏకైక కుమార్తె కనపడకపోవటంతో ఎగెయూసుకి మెడమీద తల నరుక్కుపోతూన్నట్లు అనిపించింది. భయంతోబాటు ఏదో చెప్పలేని బాధకూడా వేధించింది వాణ్ణి. ఎప్పుడూ రోహీలను యుద్ధాలలో తిరుగుతోంటే, ఆ తల్లిలేని హెర్మియాను ఎగెయూసే పెంచాడు. ఆ పిల్ల తప్పిపోయిందనేసరికి సొంతకూతుర్ని పోగొట్టుకున్నట్లే విలపించాడు.

5

బలమైన దెబ్బతగిలి స్మృతితప్పిన హెర్మియాకి ఎవరిదో చల్లనిచేయి నుదుటిపైన తగిలినట్లై, ఆమె కళ్లు తెరిచింది. ఆమెవైపు చూస్తో పదహారేళ్ల బాలుడొకడు నిలబడి ఉన్నాడు.

వాడి చూపులో క్రౌర్యం లేదుగనక వాడంటే ఆమెకు భయం వెయ్యలేదు. నల్లటి పొడుగాటిజుట్టు వాడిది. కాని దాన్ని వాడు రోజూ దువ్వకొని చిక్కు తీసుకుంటూన్నట్టు లేదు. వాడు కట్టుకున్న బట్టలు కూడా మాసి చిరుగులతో ఉన్నాయి. వాణ్ణి చూడటంతో ఎవడో బీదభారతీయబాలుడనుకుంది హెర్మియా.

తానొక గొప్పవానికూతురు గనుక హెర్మియా కోపంతో, 'నన్ను నువ్వెందుకు ముట్టుకున్నావ్?' అని గ్రీకుభాషలో అడిగింది.

వాడూ వచ్చీరాని గ్రీకుభాషలో సమాధానం చెప్పేడు. "నేనుకాదు ముట్టుకుంట. ఇదిగో ఈ ఆకు." అన్నాడు వాడు. ఆ ప్రక్కనే ఉన్న పొడుగాటి ఆకును తీసి చూపుతో, "ఈ చల్లని ఆకును నీ నుదుటిపైన పెడితే నీకు మూర్ఛలోంచి తెలివి వస్తుందని చేశాను." అన్నాడు. వాడు గ్రీకుభాషలో యాసగా మాట్లాడుతోంటే హెర్మియాకి ఆబాధలోకూడా కొంచెం నవ్వు వచ్చింది. తనకు మేలు తలపెట్టినవాడికి కృతజ్ఞత చెప్పుకోడానికి బదులు కోప్పడ్డందుకు ఆమె సిగ్గుతో చిమిడిపోయింది. కాని గొప్పయింటిబిడ్డ గనక గంభీరంగానే, 'సరే ఐతే. నువ్వెవరవు?' అని అడిగింది.

"నన్ను 'హారప్రియుడు' అంటారు. మా తండ్రిగారి పేరు 'విశ్వజిత్తు'" అన్నాడు వాడు.

'విసుజిసా?' అంది ఆమె ఆలోచిస్తో.

"'విసుజిసు' కాదు; విశ్వజిత్తు. పుష్కలావతి రాజు." అన్నాడు హారప్రియుడు.

ఆమాట వినటంతోనే హెర్మియా కొన్ని క్షణాలు మౌనంతో ఉండిపోయింది. పుష్కలావతి కోటలోనే తా నిప్పుడు నివసిస్తోంట. గ్రీకులు ఆ కోటను లాక్కోవడంతోనే విశ్వజిత్తూ, ఆయన కుటుంబమూ అడవులపాలయారు.


ఆమె కేమాటా తోణక్క 'సరే. నా గుఱ్ఱం ఎక్కడుందో చూసి తీసుకురా. నేను మాయింటికి పోవాలి.' అంది. ఆ అనటం, ఒక గొప్పయింటిబిడ్డ తన నౌఖరుకు ఆజ్ఞాపించినట్లుగా ఉంది.

'నీ గుఱ్ఱమా? పట్టుకోపోయానుగాని, దొరికింది కాదు. పారిపోయింది' అన్నాడు హారప్రియుడు.

'పోతే మరొకగుఱ్ఱాన్ని తీసుకురా వెళ్లి. నేను అడవిలో తప్పిపోయానని ఎగెయూసు కంగారుపడతాడు,' అంది హెర్మియా.

తానూ ఒక రాజకుమారుడే గనుక హారప్రియుడికి ఆమె అధికారం చెలాయించటం చూస్తే మొదట కొంచెం కోపం రాకపోలేదు. కాని వెంటనే, 'చిన్నపిల్ల! ఎలాగ మాటాడాలో ఇంకా తెలియదు.' అని సర్దుకుని చిరాకంతా చిరునవ్వుగా మార్చుకున్నాడు.

వాడు కదలకుండా అక్కడే నిలబడ్డం చూసి ఆమె కోపంతో లేచి, పోబోయింది. కాని గుఱ్ఱంమీదనుంచి పడటంలో ఆమె చీలమండకు దెబ్బ తగలడంవల్ల ఆమె నిలబడలేకపోయింది. నొప్పితో కూలబడి వచ్చేకన్నీటిని ఆపుగోటానికి ప్రయత్నిస్తో, 'నాకు దెబ్బకూడా తగిలింది. గుఱ్ఱాన్ని తెచ్చిపెట్టు. నే నింటికి పోవాలి' అంది.



హరిణవిహారం.

ఫొటో: విఠల్ ప్రసాద్—మద్రాసు.

★ హిరణ్మయి ★

'ఎక్కడనుంచి తెమ్మంటావ్? మాకు ఒకప్పుడు ఎన్నో గుఱ్ఱాలు ఉండేవి కాని ఇప్పుడేమీ లేవు మరి.' అన్నాడు హారప్రియుడు.

'ఆలస్యమైపోతోంది. మావాళ్లు నాకోసం ఎదురుచూస్తోంటారు. నన్ను మాయింటికి ఎలాగైనా చేర్చాలి.' మళ్లీ అంది హెర్మియా. ఈమారామె హారప్రియుణ్ణి ప్రాధేయపూర్వకంగానే అడిగింది.

'నీకేమి సాయం చెయ్యమన్నా చేస్తానుగాని నేను నీతోవస్తే మీ గ్రీకుపందులు నన్నుచూసి, చంపేస్తారు!' అన్నాడు హారప్రియుడు.

'గ్రీకులు పందులు కాదు. మరి ఎగెయూసు ఇండియన్లే పందులన్నాడు.' అంది హెర్మియా.

హారప్రియుడు ఉద్రేకంతో, 'గ్రీకులే మృగాలు! క్రూరమృగాలు! మమ్మల్ని అడవులపాలు చేసి, మా కోటను ఆక్రమించుకున్నారు దుర్మార్గులు! మీ గ్రీకులంటే నాకు అసహ్యం. మీరు బందిపోటుదొంగలకన్నా అధములు!' అన్నాడు.

హెర్మియా మాట్లాడలేదు. హారప్రియుడికి కూడా మరుసటిక్షణంలో కోపం, ఉద్రేకం చల్లారి, 'ఈ చిన్నపిల్ల ఏంచేసిం దింతకీ?' అనుకున్నాడు. ఆతడు ప్రసన్నుడు కావటంతోనే ఆమె మళ్ళీ, 'నన్ను మా బసకు చేర్చవూ?' అంది.

'నువ్వెక్కడ ఉంటున్నావు?' అన్నాడు హారప్రియుడు.

'పుష్కలావతికోటలో' అని, ఆమె చటుక్కున నాలుక కరుచుకుంది.

ఆమె తమకోటను ఆక్రమించుకున్న గ్రీకుల పిల్ల అని తెలవటంతోనే హారప్రియునిముఖం ఎఱ్ఱబారింది. కాని హరుడు హాలాహలాన్ని మ్రింగినట్లుగా కోపమంతా దిగమ్రింగుకుని, 'ఇక్కడకు పుష్కలావతి

చాలాదూరం. అంతవరకూ నువ్వు నడవలేవు. నీ కాలికి దెబ్బతగిలింది కూడాను.' అన్నాడు.

'ఎలాగ మరి? నన్నెలాగైనా మావాళ్ళదగ్గరకి చేర్చు. ఎగెయూసుతో చెప్పి నీకు డబ్బు ఇప్పిస్తాను.' అంది హెర్మియా.

'మీడబ్బు నాకక్కర్లేదు. కుంటుతో నువ్వు ఇంతదూరం ఎలాగ నడవగలవు అని ఆలోచిస్తున్నానంతే' అన్నాడు హారప్రియుడు. ఒక్కక్షణం ఆలోచించి, 'ఇక్కడింక మనం ఆలస్యం చెయ్యటానికి వీల్లేదు. చీకటిపడుతోంది అడవిలో క్రూరమృగాలు మసిలేవేళ ఔతోంది. నాతో మాయింటికి రా. నిన్ను మీయింటి కెలాగ పంపేదీ మా అమ్మతో ఆలోచిద్దాము.' అన్నాడు.

"అమ్మోయ్, మీయింటికే? నేను రాను. మా గ్రీకులంటే అసహ్యమన్నావు నువ్వు! తీసుకెళ్లి నాకేమి హాని చేస్తావో? 'ఇండియన్లు కసాయివాళ్లు' అన్నాడు మా ఎగెయూసు " అంది హెర్మియా.

'ఐతే ఇక్కడే ఉండు! నే వెడుతున్నాను. కాస్సేపటికి పులులూ, తోడేళ్లూ, అడవిపందులూ వస్తాయి.' అంటూ హారప్రియుడు పోతూన్నట్లుగా నటించాడు

'వెళ్లిపోకు! నేను నీతో వస్తాను నువ్వు మంచివాడివిలాగే ఉన్నావు గనుక నువ్వంటే నాకు భయం లేదు కాని మీవాళ్లు నన్నేమీ చెయ్యరుకదా?' అంది హెర్మియా

'నీవంటి చిన్నపిల్లల్ని బాధించేటంత దుర్మార్గులుకాదు మావాళ్లు. మా అమ్మ రాణీ గాయత్రీదేవి ఎంతమంచిదో నువ్వే చూద్దువుగాని. నీకాలికి తగిలిన గాయానికి ఆమె మందువేసి కుదురుస్తుంది. మా క్షమావతి చాలా సరదా ఐనది' అన్నాడు హారప్రియుడు.

'క్షమావతి ఎవరు?' అంది హెర్మియా.

'మా చెల్లెలు. నీకంటే కొంచెం పెద్దది నీకు మల్లేనే చాలా అందంగా ఉంటుంది' అన్నాడు హారప్రియుడు

'అలాగైతే తప్పకుండా వస్తాను మీ క్షమావతికి కుట్టుపని చేతనౌనా? మీ కథలన్నీ వచ్చా?' అంది హెర్మియా

'వచ్చు లే ... మాయింటిదాకాకూడా నువ్వు నడిచేటట్లులేదు నీకాలు చూస్తే. ... ఒకపని చెయ్యి, చెపుతాను. నీ రెండుచేతులతోనూ నా[illegible]ట్టుకో నిన్ను ఎత్తుకు తీసుకువెడతాను' అన్నాడు హారప్రియుడు.

'అక్కర్లేదు. నడుస్తాను' అంటూ ఆమె మొహమాటంకొద్దీ రెండడుగులు వేసిందికాని లాభం లేకపోయింది. హారప్రియుడు తన బలమైన చేతులతో ఆ బాలికను ఎత్తి, చరచరా తమ గుహవైపునకు నడిచాడు.

6

విశ్వజిత్తు ఉండే గుహలోని నేలభాగం చదునైనదిగాక మిట్టపల్లాలతో ఉంది. బైటనుండి వెలుతురు రావటానికికాని, లోపలనుండి పొగపోవటానికికాని మార్గంలేక అంతా చీకటికోణంగా కనపడి, హెర్మియాకు భయంవేసింది.

ఆమె కాగుహలోనివా ళ్లెవరూ మొదట కనపడలేదు. లోపలనుంచి సంస్కృతభాషలో మాట్లాడుతోన్న ఒక స్త్రీకంఠం వినవచ్చింది. హారప్రియుడు తిన్నగా ఆమెవద్దకు పోయి హెర్మియాను ఆమెముందు దింపి, 'అమ్మా, ప్రస్తుతం పుష్కలావతిలో ఉన్న గ్రీకుయోధుని కూతురీ అమ్మాయి అడవిలో తన గుఱ్ఱంమీదనుంచి పడిపోయి కాలుకు దెబ్బతగిలి కదలలేకుండాఉంటే ఇక్కడకు తీసుకొచ్చాను' అన్నాడు.

ఆమె రాణీ గాయత్రీదేవి. తాను కూర్చుని ఉన్న ముక్కాలుపీటపైనుండి లేచివచ్చి, హెర్మియా చెయ్యిపట్టుకుని ఆమె గ్రీకుభాషలో మెల్లిగా, 'నీపేరు ఏమిటమ్మా?' అని అడిగింది.

ఆ బాలిక బెదురుతో, 'హెర్మియా' అంది.

'హెర్మియావా? చాలా మంచిపేరు!' అని మెచ్చుకుంది గాయత్రిదేవి

ఆమాట వినపడి క్షమావతి అక్కడకు వచ్చి, 'ఏమిటమ్మా? హిరణ్మయా?' అంది.

గాయత్రీదేవి నవ్వుతో, "కాదు; 'హెర్మియా'ట మనం 'హిరణ్మయి' అనే పిలుద్దాం పోనీ." అంది.

'అంటే ఏమిటి?' అని అడిగింది హెర్మియా.

"'హిరణ్మయి' అంటే 'బంగారుతల్లి' అన్నమాట. నువ్వు 'బంగారుతల్లి'వే గనుక నిన్నింక మేము 'హిరణ్మయి' అనే పిలుస్తాం." అంది గాయత్రీదేవి.

తాను పుష్కలావతికోట నాక్రమించుకొన్న



ఇసుకలాట

ఫొటో : బి. రంగనాథన్—మద్రాసు.

రోహిలసు కుమార్తెనని తెలవటంతోనే ఆ గుహలోని వాళ్లు మండిపడతారనుకుంది హెర్మియా. అటువంటి దేమీ జరక్క వాళ్లు తనను 'బంగారుతల్లి' అని పిలవటం చూస్తే హెర్మియాకు చాలా ఆశ్చర్యం వేసింది.

ఆ గుహలో మినుకుమినుకుమంటూ ఒక్కటే దీపం ఉంది. మొదట హెర్మియాకు అంతా చీకటి మయంగా ఉన్నా క్రమంగా ఆ గుహలోని సామాను ఒక్కొక్కటే కనపడింది. ఒకప్పుడు భోగం అనుభవించిన ఆ రాజకుటుంబం ఇప్పుడా గుహలోఉండి ఎంత బాధపడుతోన్నదీ ఆమె గ్రహించకలిగింది.

"నామూలాన మీకు ఎంతో ఇబ్బంది కలుగుతుంది. నా గుఱ్ఱం ఎక్కడుందో వెతికితెచ్చి, నన్ను మా బసకు చేర్చమంటే వినక మీ అబ్బాయి నన్నిక్కడకు తీసుకొచ్చాడు." అంది హెర్మియా, ఏదో నేరం చేసినదానికి మల్లే.

'మాకు నీవల్ల వచ్చే ఇబ్బం దేమీ లేదు. దెబ్బ ఎక్కడ తగిలింది? బాగా నొప్పిగా ఉందా?' అని అడిగింది గాయత్రీదేవి.

'నొప్పిగానే ఉంది. త్వరగా నొప్పితగ్గి, మా యింటికి పోగలిగితే బాగుండును. మా ఎగెయూసూ, హిపోలిటా నే నేమైపోయానో అని బాధపడుతోంటారు.' అంది హెర్మియా.

'గాయం తగ్గటంతోనే వెళ్లిపోదుగానిలే ... కుమావతీ, కొంచెం నీరు తే.' అంది గాయత్రీదేవి.

హెర్మియా గాయాన్ని గాయత్రీదేవి ఆ నీటితో కడిగింది. ఆకుపసరేదో తెచ్చి ఒక గుడ్డపేలికను అందులో ముంచి, దెబ్బతగిలినచోట వేసి కట్టుకట్టింది. 'కాలు నేలమీద మోపకుండా, పరుండు.' అని, కంబళీ ఒకటి తెచ్చి పరిచింది.

హెర్మియా, 'ఈ రాణీ ఎంత మంచిదీ.' అనుకుంటో కంబళీవద్దకు నడిచి వెళ్ళబోయింది. రాణీ, 'ఉండు.' అంటూ ఆమెను ఎత్తుకు తీసుకు వెళ్ళింది.

చైనీస్ కథలు -
ఫెంగ్ స్వే ఫెంగ్:

8. ఎవరు దౌర్జన్యవాది?

ఒక నక్క కుందేలును తరుముతోంది కుందేలు నక్కకి అందకుండా అతివేగంగా పరిగెత్తుతూ, నక్కచుట్టూ వలయాలుగా తిరుగుతూ దానికి బాగా అలసట కలగజేసింది నక్కకి వొళ్లంతా చెమటలు పోసి, గుండ్రంగా తిరగడం చేత కళ్లు తిరిగి పడిపోయేస్థితి వచ్చింది ఇంతలో కుందేలు చటుక్కున దగ్గరలో ఉన్న ఒక ముళ్ళపొద అడుగున కన్నం చేసుకుని లోపలికి దూరిపోయింది

కుందేలు ముళ్లపొదలో దాక్కుందని కోపంతో నక్క ఒక్క దూకు దూకింది. ఇంకేముంది? సూదుల్లాగ వాడిగా, పొడుగ్గా పెరిగిన ముల్లు నక్కకు గుచ్చుకుని, అది గాలిలో వేళ్ళాడుతూ గిలగిల తన్నుకోసాగింది. తన్నుకున్నకొద్దీ నెత్తురు ప్రవహించసాగింది.

నక్క మితిమీరిన కోపంతో కుందేలును తనకు చేతనైనన్ని రకాలుగా తిట్టిపోసింది: "వెధవ! దొంగ! నిరాయుధుణ్ణిచేసి నామీద దౌర్జన్యం చేస్తున్నాడు. పచ్చి నెత్తురు తాగే హింసావాది! కష్టాల్లో పడి నిస్సహాయులై పోయినవాళ్ళని హింసించే ఘాతుకుడు! నాస్తికుడు!

ఈలోగా కుందేలు కన్నం లోంచి బయటికి వచ్చి వెళ్లిపోతూ వెనక్కి తిరిగి "అంతేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా తిట్లు? కాని నీపాండిత్యం చూస్తే నాకు భక్తి కలుగుతోంది ఇప్పుడు నువ్వు చదివిన చదువు ఉందే, అది అక్షరాలా నీకు అతికించినట్లు సరిపోతుంది. సరే, మంచిది, వెళ్లొస్తాను. టా, టా!" అని తనదారిన పోయింది ★

ఆ బాలిక చిన్నహృదయం కృతజ్ఞతతో నిండి ఆమెకళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి. రాణీ, 'ఏమమ్మా చాలా నొప్పిగా ఉందా?' అని అడిగింది. హెర్మియాకు ఏమిచెప్పాలో తోచలేదు.

క్షమావతి వచ్చి తల్లి చెవిలో, 'అమ్మా, ఇంట్లో గోధుమరొట్టెలుతప్ప మరేమీ లేదు. ఈ అమ్మాయికి రొట్టె ఇష్టమో కాదో మరి' అంది.

'ఇవాళకు అదే పెట్టు మరి రేపు ఆమెకు ఇష్టమైన దేదైనా తెప్పించి పెడదాం.' అంది రాణి. ఆ సంభాషణ వినపడ్డ హెర్మియా 'నాకు రొట్టె ఇష్టమే,' అంది

ఆమెకు బాగా ఆకలివేయడంవల్ల, ఆ ముతక రొట్టె అంత బాగుండకపోయినా తినేసింది

ఆమె పడుకున్నాక, రాణీ మరొక కంబళీని తెచ్చి ఆమెకు కప్పింది. ఆమెకు వెంటనే నిద్ర రాలేదు. క్షమావతి వచ్చి ఆమెప్రక్కన కూర్చుంది 'మీ తండ్రి ఎక్కడ?' అని అడిగింది హెర్మియా

క్షమావతి, 'అదుగో ఆప్రక్కనైన నిద్రపోతున్నారు. ఆయనకు జబ్బుగా ఉంది.' అని, అటువైపు చూపింది

'ఆ అవ్వ ఎవరు?' అని అడిగింది హెర్మియా

"ఆమెపేరు రోహిణి. మేం పుష్కలావతిలో ఉన్నప్పుడు మమ్మల్ని పెంచిన దాది ఆమె 'వద్దు' అన్నా. వదలలేక మాతో వచ్చేసింది" అంది క్షమావతి.

అంతలో విశ్వజిత్తు మేల్కొని, 'దాహమ్రా!' అని నీరసంగా పిలిచాడు

'మీనాయన పిలుస్తున్నారు' అంది హెర్మియా.

'మా అమ్మ వెడుతోంది' అంది క్షమావతి

విశ్వజిత్తు, 'ఎవరిదీ కొత్తకంఠం వినపడుతోంది?' అని అడిగాడు గాయత్రీదేవి హెర్మియాసంగతి చెప్పింది ఆతడేమీ అనకుండానే మళ్ళీ కళ్ళుమూసుకుని నిద్రపోయాడు.

దాది రోహిణి అప్పుడు పొయ్యిలో నిప్పువేసి వంట ప్రారంభించింది.

'ఇంత రాత్రి అయాక వంట మొదలెడుతోందేమిటి? రొట్టెలున్నాయిగా తినటానికి?' అని అడిగింది హెర్మియా.

'ఆ వంట ప్రొద్దున్నకి. పగలు వండుతే పొగ బయటవాళ్ళకి కనపడి మేం ఈ గుహలో ఉన్నట్లు గ్రీకులకు తెలిసిపోతుంది. అందుచేత మేము రాత్రి పూటే వండుకుంటాం.'

'హెర్మియా మాట్లాడలేదు. 'మా గ్రీకులు వీళ్ళకి చాలా అన్యాయం చేశారు ఈ ఇండియన్లు ఎంత మంచివాళ్లు?' అన్న ఆలోచనలో పడిందామె. "ఇంక వీళ్ళని 'పందు' లంటూ ఈసడించకూడదని ఎగెయాపుత్తో గట్టిగా చెప్తాను." అనుకుంటూ ఆమె నిద్రపోయింది.

(ఇంకా ఉంది)

అక్కా చెల్లెలు

రఘుజోయి జోడే

చాలా కాలం క్రిందట ఒక గ్రామంలో అక్కా చెల్లెలు ఉండేవారు. అక్క యెంత ధనవంతురాలో చెల్లెలు అంత నిరుపేదరాలు. ఒకనాడు చెల్లెలు దారిద్ర్యబాధ సహించలేక అక్కవద్దకు వెళ్లి కొంత ధనసహాయం కోరింది. అక్క సహాయమేమో చేస్తానన్నదిగానీ, ఒక్క షరతు మాత్రం పెట్టింది. కష్టాల్లో వుంది కనుక అదెంతటిషరతైనా వొప్పుకొంటానంది చెల్లి. అప్పుడు అక్క కొంత పైకమిచ్చి "దీంతో సరి, ఇంకెప్పుడూ మా గడప తొక్కకు, ఇదే షరతు" అంది. చెల్లెలికి యేడ్పు వచ్చింది. ఎలాగో ఆ దుఃఖాన్ని దిగమ్రింగి పౌరుషముతో తనదారి తాను పట్టింది. ఆలావస్తూ ఒక పెద్దభవనముందర హఠాత్తుగా ఆగిపోయింది. లోపల నుండి నృత్యముతోపాటు తియ్యని సంగీతంకూడా ఆమెకు వినబడినది. లోపలికి పోదామనుకొందికానీ, ధైర్యంచాలక ఆలాగే నిలబడిపోయింది.

అంతలో ఆ భవనమునుండి ఒక పండుముసలిది బయటికి వచ్చి, ఈ పేదరాలినిచూచి, జాలితో "ఎందుకు సంశయిస్తావు, లోనికిపో. ఈ యింటి యజమానిని యేదైనాఒకఉద్యోగం ఇమ్మని అడుగు. అతడు తప్పకుండా నీకు ఏదైనా ఉద్యోగం ఇస్తాడు. కొన్నిదినాలకు నీపై మంచి అభిప్రాయం కలుగుతుంది. అప్పుడు మేడపై రెండవగదిలో ఉండే యంత్రం కావాలని కోరు. ఆ యంత్రాన్ని ఉపయోగించేవిధానం కానీ, దానివలన లాభంకాని ఆయనకు తెలియదు. కనుక ఆయన నీకు ఆ యంత్రాన్ని యిస్తాడు. అప్పుడు దానిలాభము, దాన్ని ఉపయోగించేవిధానం నీకు నేర్పుతాను" అని చెప్పి వెళ్లిపోయింది.

ఆ అమ్మాయి లోపలికిపోయి ఆ ఇంటియజమానిని ఏదైనా ఉద్యోగం ఇమ్మని ప్రాధేయపడింది. అతడా అమ్మాయిని ఉద్యోగంలోనికి తీసుకొన్నాడు. కొన్నిదినాలైనాక, ఆ అమ్మాయి తన సేవకు ప్రతిఫలంగా మేడలో రెండవగదిలో వుండే యంత్రాన్ని యివ్వమని కోరింది. తనకు పనికిరాని ఆ యంత్రాన్ని సంతోషంగా ఆమెకు ఇచ్చివేశాడు, ఆ ధనికుడు.

ఆ యంత్రాన్ని యింటికి తీసుకొనిపోయి భద్రపరచి, తనకు పూర్వం కనబడ్డ ముసలిదానికోసమై వూరంతా గాలించి, ఆమెజాడ కనుగొని, ఇంటికి పిలుచుకొనివచ్చి ఆ యంత్రాన్ని నడపడమూ, నిలిపివేయడమూకూడా నేర్చుకొన్నది. ఆ యంత్రములోని చిత్రమేమిటి అంటే అది కోరిందల్లా యిస్తుందన్నమాట. దాంతో ఆ పేదరాలి దారిద్ర్యమంతా తీరింది.

ఈ యంత్రం సంగతి ఏలాగో అక్కచెవిన పడింది. ఆమె ఏలాగైనా ఆ యంత్రాన్ని తనదిగా చేసికోవాలని చెల్లెలిదగ్గరకువచ్చి

అధికధనాశచూపి ఆ యంత్రాన్ని యివ్వమని పట్టుపట్టింది. అక్క కోర్కె ను కాదనలేక చెల్లెలు యంత్రాన్ని ఆమెకుయిచ్చి దానిని ఉపయోగించే విధానం తెలిపింది. హద్దుమీరినఆనందంలో దానిని ఉపయోగించేవిధానం అక్క సరిగ్గా వినిపించుకోలేదు.

అక్క తనఇంట్లో ఆయంత్రాన్ని రహస్యంగా దాచి ఆ మరునాడే దాన్ని నడిపి తనకు ధాన్యం కావాలనికోరుకొంది. వెంటనే ఆయంత్రం నుండి ధాన్యం రాసులురాసులుగా రాలింది. ఆమె ఇంట్లోఉండే సంచులు, డబ్బాలు, గదులు అన్నీ ధాన్యంతో నిండిపోయాయి. అంతటితో ఆమె సంతృప్తిపడి, యంత్రాన్ని నిలిపేందుకు ప్రయత్నించింది. కానీ, ఆమె ఆ పుటకు చెల్లెలు చెప్పినవిధానం మరచిపోయింది. ధాన్యపురాసులు అలానే రాలుతూవున్నవి. ఇల్లంతా ధాన్యపుమయమైంది. అక్కడ వుండేందుకు చోటులేక తలుపులు తెరచి తోటలోనికి పారిపోయింది. తోటకూడా ధాన్యముతో నిండిపోతూ వుంది. గత్యంతరంలేక చెల్లెలిదగ్గరకు పరుగెత్తుకొనివచ్చి, ఆ యంత్రాన్ని యేలాగైనా నిలపమని ప్రాధేయపడింది కానీ! అక్కకిచ్చినమాట ప్రకారం ఆమె గడప త్రొక్కకూడదని, చెల్లెలు నిరాకరించింది. దానికి అక్క "ఆయంత్రాన్ని నీవే తీసుకొనిపో, నేను నా సొమ్ముకూడా అడగను," అంది.

తర్వాత యిద్దరు కలసి తోట దగ్గరకు పోయారు. చెల్లెలు ఆ యంత్రాన్ని సులభంగా ఆపివేసి దాన్ని తీసుకొని వెళ్ళిపోయింది.

ఆమెకు సముద్రపుఒడ్డున చక్కని యిల్లు కట్టుకోవలెనని బుద్ధిపుట్టింది. యంత్రసహాయంతో ఒక చక్కని భవనాన్ని సముద్రపుతీరంలో కట్టుకొని సుఖంగా జీవితం గడపుతూ వుండేది.

ఇలా వుండగా ఒకనాడు విదేశీయనావ ఒకటి అక్కడికొచ్చి లంగరు వేసింది. ఆ నావలోనివారికి యీమె ఆతిథ్యమిచ్చి వారిని పంచభక్ష్యపరమాన్నాలతో సంతుష్టులనుగా చేసింది. పైగా, వారికి యంత్రరహస్యాన్ని, దాన్ని ఉపయోగించేవిధాన్ని తెలిపింది. ఆఓడ యజమానికి ఏలాగైనా యంత్రాన్ని అపహరించాలని బుద్ధి పుట్టింది. ఆ రాత్రే దాన్ని ఆమెకు తెలియకుండా నావలోని కెక్కించి ప్రయాణం సాగించారు. ఆ ఓడలో పోతూ యంత్రం పూరికే ఎందుకుండాలనిభావించి దాన్ని ఏమడుగుదామా, అని ఆలోచించి కడకు తన దేశంలో కొరతగావుండే "ఉప్పు" కావాలని దాన్ని కోరాడు. ఎందుకంటే అప్పటికి సముద్రపునీరు ఉప్పగాకాక తియ్యగా వుండేది. కొద్దిసేపటికి ఆనావ ఉప్పుతో నిండిపోయినది. ఆ యంత్రాన్ని నిలిపే విధం ఆతడుకూడా సరిగా వినలేదు. కనుక యంత్రాన్ని ఆపేందుకు ఎంత ప్రయత్నించినా అది ఆగలేదు. ఓడ ఉప్పుతో నిండి మునిగిపోయేస్థితికి వచ్చింది. ఓడ యజమానితోపాటు యితరులుకూడా ప్రాణాలను రక్షించుకొనేందుకు వేరేమార్గంలేక సముద్రంలోదుమికి ఏలాగో ఒడ్డు చేరుకొన్నారు.

అంతలో ఆ నావ సముద్రంలో మునిగిపోయింది. కానీ ఆ యంత్రం నీటిలో మునిగినా, ఉప్పుమాత్రం ఇప్పటికీ అలాగే తయారుచేస్తూ వుంది. కనుకనే సముద్రపునీరు నానాటికీ మరింత ఉప్పగా ఉంటోంది. ★

★ సిరి దా వచ్చిన వచ్చును...! ★

(4-వ పేజీ తరువాయి)

లక్షలవరకూ సంపాదించాను. యీ రోజు నుంచి నీవు నాకు భాగస్వామివి. దీన్లో నీవు అనుభవించవచ్చు" అన్నాడు.

"నిజంగానా!" అన్నాడు రామచంద్రయ్య తడిసిన కళ్ళతో.

"నే నెవ్వరికీ మాటివ్వను. యిస్తే మాత్రం తప్పకుండా చేసితీరతాను రామచంద్రయ్యా" అన్నాడు రెడ్డి...

బావమరిది జగన్నాథం మాత్రం యీనాటికి రామచంద్రయ్య యింటికి రావటం లేదు. ★


విజ్ఞానవీధులు

"డాక్టర్"

చిట్టిప్రశ్నల జవాబులు

కె. రామారావుగారు, గుంటూరు.

—అవును. పరావర్తనమూ, వక్రీభవనమూ రెండూ ఒకే కిరణమునకు జరుగవచ్చును. మీ యింట కిటికీదగ్గర కూర్చొని ఒక గాజుపలకను నిలువుగా పెట్టి వీధిలోని దృశ్యాన్ని పరావర్తనమువల్ల గుర్తించండి. ఆ పలకను అట్లే పెట్టి పలకగుండా చూడండి ఆ దృశ్యాన్నే. అదే దృశ్యం కనబడుతుంది. అంటే ఏమన్నమాటా? ఆ దృశ్యం నుంచి బయలుదేరిన కిరణాలు ఇటూ అటూ కూడా వచ్చాయన్నమాట కాదూ?



పటములో 'కచ' అన్న కిరణము కొంత 'చట' అనే దారిలో పరావర్తమై మిగిలినది 'చత' దారిలో వక్రీభవనమై పోగలదు. 'కచ' అనే కిరణదీప్తి మాత్రము 'చట', 'చత'లు రెండూ చేరినంత ఉంటుంది.

*　　*　　*

లంకా సూర్యనారాయణ, గొట్టిపాడు.

—చంద్రునియందలి మచ్చలు కొండలూ లోయలూను. దూరదర్శినితో వీటిని చూచి ఫొటోగ్రాఫు చేసి వాటి ఎత్తును కూడా సుమారుగా లెక్క గట్టినారు శాస్త్రజ్ఞులు.

—రాత్రివేళ రాలేటట్టు కనబడే చుక్కలు చుక్కలు కావు. ఖగోళముల తునకలు గాలి రాపిడివల్ల పుట్టే వేడిమికి వెలిగిపోతూ కనబడతాయి. ఉల్కలంటారు వీటిని. వీటిలో ఇనుముంటుంది ముఖ్యంగా.

*　　*　　*

టి. తిరుపతిరావు, అనంతపురం.

—"ఖగోళములలో జీవరాసులు ఉంటాయి" అని ఎవరేనా రాస్తే వారిని మేము హేళన చేశామా? ఎక్కడ మహాశయా? అవహేళన మాపద్ధతి కాదు. మాచేత అవహేళన పొందినవారు వారి రాతలలోవున్న అవహేళనకే ప్రత్యుత్తరము పొందినవారన్నమాట. వెక్కిరింతలవల్ల విజ్ఞానము వ్యాపిస్తుందా?

ఇక ప్రస్తుతవిషయము. "చంద్రగోళములో ఆ వాతావరణానికి తగిన శరీరావయవములు కల జీవరాసులు వుంటాయి" అంటారా? అనండి. "లేవు" అని ఎవరేనా అంటే వారికి మీ సమాధానమేమిటి? 'ఈనాటికి శాస్త్రజ్ఞులెరిగిన జీవరాసులు 80 మొదలు 120 డిగ్రీలవరకూ ఉన్న ఉష్ణోగ్రతలో; కర్బన, ఉదజని, ఆమ్లజని, నత్రజని కలిసిన శరీరాంగములతో; అమ్లజనిగల గాలీ, నీరూ ఉన్న వాతావరణములో; ఉన్నాయీ, ఉండగలవు. ఈ పరిస్థితులు చంద్రగోళములో లేవు కనక ఇట్లాంటిజీవులు అక్కడ ఉండనేరవు' అంటున్నారు శాస్త్రజ్ఞులు. 'ఇవన్నీ అక్కరలేని ప్రాణులుండకూడదా?' అని మీరంటే, 'అలాంటి ప్రాణులున్నాయా' అంటారు వారు. 'ఉన్నవేమో' అనాలి మీరు. 'లేవేమో' అంటారు వారు. నిరూపించే బాధ్యత 'ఉన్నది' అనేవారికే.

*　　*　　*

జె. శ్రీరామమూర్తి, వేటపాలెము.

—ప్రశ్నలు పరీక్ష ప్రశ్నలులాగ వెయ్యకండి. ప్రశ్నలవల్ల మీకు తెలుసుకోవలసినదుంటేనే అడగండి. "శనియొక్క సూర్యప్రదక్షిణ కాలమెంత? ప్లూటో ఎప్పుడు గుర్తింపబడిన గోళమూ? నక్షత్రములకన్నిటికీ పేర్లున్నవా? భూమండల వయస్సెంత? అన్నవి సంబంధము లేని ప్రశ్నలు. తెలుసుకోవడముకంటె మమ్మల్ని పరీక్ష చెయ్యడమే ఉద్దేశంగా వేసినట్లు కనబడుతున్నవి. కాకినాడనుంచి, ఏ. వి. యస్. రామారావుగారు 'వినువీధి' అన్న పుస్తకం వేశారు. అది చదవండి మీ ప్రశ్నలకి సమాధానాలు దొరుకుతాయి. ★

స్వీకారం

ఉగ్గుపాలు:— గేయకథలు; రచయిత: వారణాసి; వెల 1-0-0; ప్రచురణ: ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ. బాలబాలికలకు పఠనయోగ్యములైన గేయకథలు, పద్యకథలు 12 ఇందులో ఉన్నాయి. తేటగీతి, ఆటవెలది, మంజరీద్విపద, ముత్యాలసరం మొదలైన వివిధ ఛ్ఛందస్సులలో సరళమైన శైలిలో రచింపబడిన ఈ కథల పుస్తకం పిల్లలందరూ చదివి ఆనందించదగినది.

మిత్ర:— స్వతంత్ర జాతీయ పక్షపత్రిక; సంపాదకుడు: వి.డి. ప్రసాదరావు; వెల 0-3-0; సంవత్సర చందా 4-8-0. ఈ పత్రిక ప్రారంభసంచిక (1955 ఆగస్టు 15) మా కార్యాలయం చేరినది. పింగళి నాగేంద్రరావు, దాసు వామనరావు, మల్లాది రామకృష్ణశాస్త్రి, కె. వెంకటరావు, వెంపటి సచ్చిదానందశర్మ, సినీమాలి, వేమరాజు భానుమూర్తిగార్ల రచనలు ఈ సంచికలో ఉన్నాయి.

కథానిక:— కథల సంపుటి; వెల 1-0-0; ప్రచురణ: విజ్ఞాన సాహితి, మద్రాసు-17. నెలనెలా వెలువడనున్న 'కథానికా సీరీస్' జాతై ప్రచురణ మా కార్యాలయం చేరినది. ఈ సంపుటిలో ఇరవై కథలు వేర్వేరు రచయితలు రచించినవి ఉన్నాయి. ప్రత్యేకం కథలకోసమే ఈ సీరీస్ ప్రచురింపబడుతున్నది. "కొత్త రచయితల కథలను కథానికలో ప్రచురించుకునే పూచీ మాది" అని సంచాలకులు భరవసా ఇస్తున్నారు. ★



జూపిటర్ పిక్చర్స్‌వారి "ఇదే దారి"లో అంజలీదేవి.

"సంతానం" సమీక్ష

తెలుగు దేశ ప్రసిద్ధ నిర్మాతలు అయిన సాధనా వారి చిత్రం "సంతానం" విజయవంతంగా నడుస్తున్నది. ఈ చిత్రం దర్శకుడు సి. వి. రంగనాథదాసు. పర్య వేక్షకుడు ఎల్. వి. ప్రసాద్. రచయితలు అనిసెట్టి, పినిసెట్టి. సంగీతదర్శకుడు దక్షిణా మూర్తి. ఎస్. వి. రంగారావు, ఏ. నాగే శ్వరరావు, అమర్‌నాథ్, చలం, రమణా రెడ్డి, రేలంగి, సావిత్రి, శ్రీరంజని మున్నగు వారు ఈ చిత్రంలో నటించారు.

ఒక కార్మికుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంటారు. అతనిభార్య ప్రసవ సమయంలో చనిపోతుంది. అతను ప్రమాద వశాత్తు గుడ్డివాడై ఇంట్లోనుంచి వెళ్ళి పోతాడు. పిల్లలు నిరాధారులై తలో దిక్కుగా చెదిరిపోతారు. పెద్దపిల్ల ఒక ధనవంతుని ఇంట్లో పనిమనిషిగా చేరు తుంది. పెద్దకొడుకు నాటకాల కంపెనీ యజమానికి, చిన్నకొడుకు ఒకవస్తాదు దగ్గర పెరుగుతారు. వీరందరూ ఒకరినొకరు ఎరుగకుండా పెరిగి పెద్దవారై ధనిక కుటుం బాలలోని వారిని ప్రేమించడం, క్రమంగా ఒకరిని ఒకరు తెలుసుకోవడం, బిచ్చగాడై తిరుగుతున్న తండ్రిని కలుసుకోవడం, తాము ప్రేమించినవారిని పెళ్ళి చేసుకోవడం జరుగుతుంది. వీరికి తండ్రి అంధత్వం పోయినట్టే ఏ విచారం లేకుండా అందరూ సుఖంగా ఉంటారు. అయితే [illegible] సంపాదించుకున్న భర్త [illegible] అతను [illegible] కష్టం తప్ప కుండా [illegible] ఊహించుకుంటే, "సంతానం" సంతో షంగా ముగిసిపోయినట్టే లెక్క.

ఈ చిత్రంలోకూడా అవాస్తవిక సంఘటనలు [illegible] సంఘటనలు చాలా ఉన్నాయి. వీటిలో కొన్ని కథాగమనం కోసం అవసరమైనవి. వీరికి తండ్రి, అతని సంతానం అందరూ ఒకరినొకరు కలుసుకున్న పద్ధతి ఎంత అసహజంగా ఉన్న ప్పటికీ ప్రేక్షకుల ఆమోదం పొందుతుంది. ఎప్పుడు కలుసుకుంటారా అని ఎదురు చూస్తూ ఉన్న ప్రేక్షకులు ఆ సన్నివేశం రాగానే సంతృప్తి పొందుతారు.

నటీనటులందరూ ప్రతిభావంతంగా నటించారు. రంగయ్యగా రంగారావు, లక్ష్మిగా శ్రీరంజని, రాముగా నాగేశ్వర రావు తమ తమ పాత్రలు బాగా నిర్వహిం చారు. రేలంగి తాను నటించిన అన్ని చిత్రాల్లోలాగానే ఈ చిత్రంలో కూడా తన హాస్యానికొక ప్రత్యేకమైన విలువ, ఆకర్షణ ఉన్నాయని నిరూపించుకున్నారు. సావిత్రి, చలం, అమర్‌నాథ్, చదలవాడ, మిక్కిలినేని తమతమ పాత్రలను ప్రశంసా పాత్రంగా నిర్వహించారు.

ఈ చిత్రంలో ముఖ్యమైన ఆకర్షణగా ఉద్దేశింపబడిన అంశం లతామంగేష్కర్ పాడిన "నిదురపోరా తమ్ముడా!" అనే పాట. ఈ ఒకటే గాకుండా, మరి కొన్ని పాటలు కూడా ఆమెచేత పాడించి ఉంటే ఇంకా బాగుండేది. మొత్తంమీద దక్షిణా మూర్తి గారి సంగీతం ఈ చిత్రంలో చక్కగా ఉన్నది. నాటక పద్యాలు, చాలా బాగు న్నాయి. అనిసెట్టి వ్రాసిన పాటలు, పిని సెట్టి వ్రాసిన సంభాషణలు రక్తివంతంగా ఉన్నాయి. ★



వర్కింగ్ గర్ల్స్ కష్టసుఖాలు చిత్రించే "[illegible]" చిత్రంలో [illegible].

బొంబాయి సినిమా లేఖ

భారతస్వాతంత్ర్యదినోత్సవానికి [illegible] రోజులున్నా [illegible] యుక్తి, బొంబాయి [illegible] [illegible] చేసి [illegible] నే



పారమౌంట్ వారి "బ్రిడ్జెస్ ఎట్ టొకో-రీ" చిత్రంలో
విలియం హోల్డెన్, గ్రేస్ కెలీ.

★ బొంబాయి సినిమా లేఖ ★

ఉండి చీట్లాట, బాతాఖానీ తప్పించి మరే కార్యక్రమంలోనూ జోక్యం చేసుకోలేదు. సొహ్రాబ్ మోడీవంటి బాధ్యత తెలిసిన ప్రముఖులమాత్రం తమ భవనాలవద్ద పతాకావిష్కరణం జరిపారు. కాని మొత్తం మీదచూస్తే ఈ జాతీయపర్వంపట్ల సినిమా రంగం తటస్థంగానే ఉండిపోయింది.

దేశభక్తులని పిలవబడే ధనిక నటీనటులలో కొందరికి ఆరోజున సమ్మె జరగడంవల్ల సెలవు వచ్చిందో, లేక ఏదైనా జాతీయ పర్వం కావడంవల్ల సెలవు వచ్చిందో కూడా తెలియదు. క్రిందటేడాది జాతీయ నిధి సేకరణకు సినిమాతారలు పెద్ద ఊరేగింపులూ, అవీ జరిపినమాట నిజమే. కాని అదంతా జనాన్ని ఆకర్షించడంకోసం చేసిన ప్రదర్శనం అని అందరికీ తెలుసు. ఈసారి ఆగస్టు 15 న, సినిమాతారల దేశభక్తి ఏపాటిదో బాగా తెలిసిపోయింది.

* * *

ఫిల్మ్ ఫైనాన్సింగ్ కార్పొరేషన్ (చలనచిత్ర ఆర్థికసహాయసంఘం) స్థాపించే విషయమై భారతప్రభుత్వం శ్రద్ధగా ఆలోచిస్తున్నది. ఈ కార్పొరేషన్ స్థాపింపబడితే ప్రస్తుతం తారలూ, నిర్మాతలూ అవలంబిస్తున్న బ్లాక్‌మార్కెట్ పద్ధతులు అంతరించిపోతాయి. ఈ కారణంవల్లనే పరిశ్రమనాయకులు ప్రభుత్వం తలపెట్టిన ఈ ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మన సినిమాతారలు, పరిశ్రమలోనివారు చేస్తున్న దేశసేవ ఏమిటి అంటే బ్లాక్‌మార్కెట్ చెయడం, 'బ్లాక్‌మనీ' పుచ్చుకోవడం. వచ్చినచిక్కు ఏమిటంటే, కాంగ్రెస్ ప్రముఖులు కూడా కొందరు ఈ అవినీతివిధానాలలో సినిమావ్యక్తులకు తోడ్పడుతున్నారు; ఈదేశంలోనూ, ఇతరదేశాల్లోనూకూడా పెద్దపెద్ద పెట్టుబడిదారులను పట్టి, పన్నులు ఎగవేసే నిర్మాతలకు పెట్టుబడి అందజేస్తున్నారు.

* * *

బొంబాయి సినిమారంగంలో ఈమధ్య ఒక సుగుణంమాత్రం కనిపిస్తున్నది. చాలా స్టూడియోలలోనూ, నిర్మాణ సంస్థలలోనూ, పని చురుకుగా, అనుకున్నప్రకారం జరిగిపోతున్నది. నిర్మాణవ్యయం ఒక క్రమపద్ధతిని అనుసరించి ఉంటోంది. ఈ క్రమపద్ధతివల్ల, స్వాతంత్ర్యసిద్ధితరవాత ఏయేడూ లేనన్ని చిత్రాలు ఈయేడు బాక్సాఫీస్ విజయం పొందాయి. నాగిన్, జాగృతి-అధికార్, మిస్టర్ ఎండ్ మిసెస్ '55, వచన్, ఉరన్‌ఖటోలా, ఆజాద్, కుందన్ చిత్రాలు ఇలా విజయంపొందినవే. సర్దార్, వామన్ అవతార్, శివభక్త, అదిల్ ఇ, జహంగీర్, హౌస్ నం. 44, హాహాహీహీ హూహూ, మిలాప్, మిర్జాగాలిబ్ మొదలైన చిత్రాలుకూడా నిర్మాతలకు బాగా లాభాలు సంపాదించి పెట్టాయి.

ఇటీవల కుందన్, వచన్ చిత్రాలు విజయం పొందడంబట్టి, సంగీతంతో, సాహసచర్యలతో నిండినచిత్రాలపై ప్రేక్షకులకు విముఖత కలిగినట్లు తోస్తున్నది. ఈ రెండుచిత్రాలలోనూ చెప్పుకోదగినసంగీతం లేదు. కాని మానవత్వాన్ని ఉద్బుద్ధంచేసే కథలు, ఉదాత్తపాత్రపోషణం ఈ చిత్రాల్లోని ప్రత్యేకగుణాలు. పెద్దహాస్యంకూడా వాటిలో కనిపించదు. అయినా ప్రేక్షకులకు ఈ చిత్రాలు నచ్చాయి. ఈమాదిరి చిత్రాలు తీయాలనే అభిలాష నిర్మాతలలో ప్రబలితే, ప్రయోజనంలేని కథలు, కామప్రకోపనం, అభూతకల్పనలు, అసందర్భ సంగీతం కలిగినచిత్రాలు వెనకబడిపోతాయి.

కాని అటువంటి చిత్రచిత్రాలను మాత్రం కుండా ప్రజలకు సరియైన తర్ఫీదు ఇవ్వాలంటే, సంస్కరణాభిలాష కలిగిన మన ప్రభుత్వం పూనుకొని ఏదైనా వెంటనే చెయ్యవలసి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏదిచేసినా చెయ్యకపోయినా, విద్యాసంస్థలలో ఫిలింసొసైటీలను ఏర్పాటు చేయించాలి. విద్యార్థులు మంచిచిత్రాలనే అభిమానించేటట్లుగా ఈ సొసైటీలు వారికి తర్ఫీదివ్వాలి. ఇతరదేశాలలో ఇటువంటి ఫిలిం సొసైటీలద్వారా ప్రభుత్వాలు తమ ప్రజలను వివేకవంతులుగా చేస్తున్నాయి. నైతికసంస్కరణలనుగూర్చి అస్తమానం ఉద్ఘాటించే మన ప్రభుత్వం ఇంతవరకూ ఏమీ చెయ్యకపోవడం శోచనీయం.

* *

మెహబూబ్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న వర్ణచిత్రం "భారతమాత" (మదర్ ఇండియా)లో నటించడానికి సాబూ భారత దేశానికి తిరిగి వచ్చాడు. తల్లిగా నర్గీస్ నటిస్తున్నది. దుర్మార్గుడైన కొడుకుగా సాబూ నటిస్తాడు.

* * *

పబ్లిసిటీమహిమవల్ల అమాంతం తారాపథానికెగసిన కొత్తనటి జబీన్ ఫిల్మ్ ఆర్ట్స్ వారు నిర్మించే ఒక చిత్రంలో చిన్న వేషం వేయడానికి ఒప్పుకున్నది. నాయికానాయకులుగా ఉషాకిరణ్, దేవ్ ఆనంద్ నటిస్తున్నారు.

* * *

ఆగస్టు 3వ తేదీన శశికళ, ఆమె అయిదేండ్లకుమార్తె పుట్టినరోజు పండుగలు జరుపుకున్నారు.

"క్రోరపతి" చిత్రంలో ఈమె కిశోర్ కుమార్‌తో కలిసి నటిస్తున్నది. ఇందులో స్మృతిబిశ్వాస్ కూడా నటిస్తున్నది.

కిశోర్ కుమార్ కూడా ఆగస్టు 4వ తేదీన బ్లూ గార్డెనియా రెస్టారెంట్‌లో జన్మదినోత్సవం జరుపుకున్నాడు.

* * *

బెంగాలీ నవలా రచయిత ప్రేమేన్‌మిత్ర రచించిన కథ ఆధారంగా బిమల్‌రాయ్ ప్రొడక్షన్స్ నిర్మించిన "అమానత్" చిత్రం రాయల్ ఒపెరా థియేటర్‌లో ఆగస్టు 5న విడుదలై విజయవంతంగా నడుస్తున్నది. ఈ చిత్రాన్ని అరవింద్ సేన్ డైరెక్టుచేశారు. భారత్ భూషణ్, ప్రాణ్, పాల్ మహేంద్ర, అసిత్ సేన్ మున్నగువారు బాగా నటించారు. కాని, నాయికచాంద్ ఉస్మానీ, ఉపనాయిక ఆశా మథుర్‌ల నటన చప్పగా ఉన్నది. సంగీతంకూడా చప్పగానే ఉన్నది.

* * *

వి. ఎస్. జోహార్ తీసిన "నకద్ నారాయణ్" చిత్రానికి ప్రేక్షకులు విపరీతంగా ఎగబడుతున్నారు. మోతీలాల్, మీనా ముఖ్యపాత్రధారులు. ఈ చిత్రం ఆగస్టు 11న నావెల్టీ థియేటర్‌లో విడుదల అయినది. అన్ని వేళాలన్నీ హోయిహోయిగా, తీయతీయగా నడిచిపోయే ఈ చిత్రంలో నృత్యాలు, పాటలు ఆకర్షవంతంగా ఉన్నాయి. కావలసినంత హాస్యంకూడా ఉన్నది. "మిలియన్ పౌండ్ నోట్"ను పోలినకథ ఈ చిత్రానికి ఆధారం. డబ్బు ఎక్కువగా ఉన్నందువల్ల వచ్చేనష్టాలను, [illegible]లను వినోదాత్మకంగా ఈచిత్రం చూపి[illegible]ది. ★

(ఆంధ్రవారపత్రిక విలేఖరి)



బిమల్ రాయ్ చిత్రం "అమానత్"లో భారత్ భూషణ్, చాంద్ ఉస్మానీ.

ప్రేక్షకుల అభిప్రాయాలు

"సంతానం"

ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ లతా మంగేష్కర్ పాడిన పాట, నాగేశ్వరరావు శ్రీకృష్ణుని వేషం. నటీనటులందరు తమ తమ పాత్రలను అతిచతురంగా నిర్వహించారు. జూనియరు నాగేశ్వరరావు నటన బాగున్నది. ఈ చిత్రము హాస్య శోక రసములతో ప్రేక్షకులను అలరించినది. పాటలు, మాటలు, సంగీతము చాలా బాగున్నవి.

తోట పార్వతీశ్వరరావు,
—విజయవాడ.

సాధనావారి చిత్రము 'సంతానం' చక్కగా నున్నది. నటీనటులలో మాష్టర్ నాగేశ్వరరావు, విజయలక్ష్మి, ఏ నాగేశ్వరరావు, రంగారావు, అమర్‌నాథ్, చలం, రేలంగి, మిక్కిలినేని, శ్రీరంజని, సావిత్రి, రేసుం, చక్కగా నటించిరి. అమరనాథ్ పాత్ర బహు స్వల్పమయినప్పటికి, ఆ పాత్రకు న్యాయము చేకూర్చి చక్కగా నటించెను. శ్రీ దక్షిణామూర్తిగారి సంగీతము ఆహ్లాదకరముగా నున్నది. అనిసెట్టి, పినిశెట్టిగార్ల మాటలు పాటలు బాగుగా న్న



"బీర్బల్ పరిస్తాన్ మే" అనే హిందీ చిత్రంలో కమల్‌కపూర్, గీతాబాలి.

★

నేసనల్ ఆర్ట్ థియేటర్ వారి "జయసింహా"లో రేలంగి, ఎన్. టి. రామారావు.



ప్రేక్షకుల అభిప్రాయాలు

వున్నవి. జిక్కీ, లతా ఘంటసాలపాడిన పాటలు బాగున్నవి.

ఇ. వి. సుబ్బారెడ్డి,
—లింగంగుంటపాలెం.

* * *

సాధనావారి "సంతానం" అనుకున్నంత బాగాలేదు. చిత్రం మొదట్లో కన్నా, చివర కొంచెం బాగుంది. 'లతామంగేష్కర్', పాటకు సంగీతం ఇంకొంచెం బాగుంటే, బాగుండేది. 'లతామంగేష్కర్' తెలుగు ఉచ్చారణ చాలా స్పష్టంగా వుంది. సంగీత దర్శకత్వం ఏమీ బాగాలేదు. నటులలో కెల్ల బాగా నటించినవారు ఎ. నాగేశ్వర రావు, రేలంగి. తక్కినవారందరూ ఫరవా లేదు. మాటలు అక్కడక్కడ కొంచెం బావున్నాయి. దర్శకత్వం ఏమీ బాగా లేదు. ఏమైనా సంసారంలాగా యీ సంతానం ప్రేక్షకుల హృదయాల్ని తృప్తి పరచలేకపోయింది.

మద్దాలి వెంకటసుబ్బారావు,
—విజయవాడ.

* * *

రంగనాథ దాసుగారి దర్శకత్వంలో తయారైన సంతానం చిత్రం చాలా బావుంది. చిత్రం ఆఖరులో అందరిని చాలా బాగా కలిపారు. సావిత్రికి తగ్గపాత్ర లభించలేదు. నాగేశ్వరరావు, రేలంగిలయొక్క హాస్యం అద్భుతంగా వుంది. లతాపాడిన జోలపాట, ఘంటసాల పాడిన పద్యాలు విన సొంపుగా వున్నాయి. ఈచిత్రం తప్పక ప్రజాదరణ పొందగలదు.

ఎమ్. జోగారావు,
—రాజమండ్రి.

సంతానం చిత్రం బాగా ఉన్నది. ఇందులో రంగారావు ఫ్యాక్టరీ కూలి వాడుగా ముష్టివాడుగా చాలా అద్భుతముగా నటించినాడు. తల్లి, తండ్రి లేక పోయినప్పటికీ తన తమ్ములను చాలా బాగుగా పెంచిన చిన్నపిల్ల, రాముగా నటించిన కుర్రవాడు కూడా బాగుగా నటించినారు. కొన్నితప్పులు ఉన్నప్పటికీ చిత్రం చాలాబాగా నిర్మించినారు. సరళపార్కుకు వెళ్లినట్లు చెప్పించినారు కాని పార్కు ఊరి అవతల ఉన్నట్లు చూపించినారు. ఇది అసమంజసముగానున్నది. లతామంగేష్కరు పాడిన "నిదురపోరా తమ్ముడా" అనుపాట చాల బాగా ఉన్నది. ఆమె తెలుగున పాట పాడిన ప్రథమచిత్రం యిదే. ఘంటసాల వారి పాటలుకూడా చాల బాగున్నవి.

ఇందులో రేలంగి హాస్యం చాలా తక్కువగా ఉన్నప్పటికీ చాలా బాగా నటించినాడు.

ఈ చిత్రం శతదినోత్సవం చేసుకోవచ్చునని ఆశించుచున్నాము.

కాకేపల్లి వెంకటేశ్వర్రావు,
—రాజమండ్రి.

* * *

సాధనావారి సంతానం ఆశించినదానికన్నా ఎన్నోరెట్లు బాగున్నది. కథ చాలా బాగా నడిచింది. మాటలు ఒక మోస్తరుగా ఉన్నా పాటలు చాలా బాగున్నయ్. నాగేశ్వరరావు అమోఘంగా నటించాడు. కృష్ణపాత్రకికూడా బాగుంటానని ఈచిత్రం ద్వారా నాగేశ్వరరావు రుజువు చేసుకున్నాడు. సావిత్రి నటన ఏమంత చెప్పుకో తగ్గట్టు లేదు. రేలంగి పాత్రకి ప్రాముఖ్యం లేదు. శ్రీరంజని చక్కగా నటించింది. చలం హుషారుగా నటించాడు. బాలనటులు బ్రహ్మాండంగా నటించారు. మొట్టమొదటిసారైనా ఈ తెలుగుచిత్రంలో 'నిదురపోరా తమ్ముడా' అని పాడిన లతామంగేష్కర్ గానాన్ని మరువలేము.

మేడిశెట్టి సత్యప్రసాద్ రావ్,
—కాకినాడ.




"అంధేర్ నగరీ చౌపట్ రాజా"లో చిత్రా.



చీరాల, మోహన్ థియేటర్‌లో "రోజులు మారాయి" శతదినోత్సవ సందర్భంలో రేలంగి, జానకి, నాగేశ్వరరావు, ఊటుకూరి కోటయ్య, సి. వి. రెడ్డి (సభాధ్యక్షులు ఒంగోలు - ఆర్. డి. ఓ.), స్వామీ కేశవగుప్త, వై. శివరామకృష్ణప్రసాద్, తాపీ చాణక్యగార్లు.

భీమవరం వెల్‌కం టాకీస్‌లో "రోజులు మారాయి" శతదినోత్సవ సందర్భంలో జానకి, రేలంగి, వహీదా.




"కృష్ణరావు"గా నాగేశ్వరరావు అమోఘంగా నటించాడు. పిక్చర్‌లో కొద్ది లోపాలు ఉన్నాయి. ఉదాహరణకి రైలులో రాము, లక్ష్మి బాబులనుండి విడిపోయి వేరే స్టేషన్‌లో దిగాడు. కాని చివర అంతా ఒకే ఊళ్లో ఉన్నట్లు చూపించారు. "లత" పాడిన పాట బాగుంది. దానిని మూడుసార్లు ఒకే ఫక్కీలో వినిపించారు. ఫక్కీ మారిస్తే బాగుండేది. రంగారావు, తండ్రిప్రేమను చివరిఘట్టంలో అద్వితీయంగా నిరూపించారు. సంగీతం బాగుంది. "ఘంటసాల"వారి పద్యాలు చిత్రానికి నూతనశోభనిచ్చాయి. మొత్తానికి ఈచిత్రం ప్రజాదరణపాత్రమై శతదినోత్సవం జరుపుకోగలదని ఆశించవచ్చు.

యం. వి. నరసింహమూర్తి,
—కాకినాడ.


★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, &7, Thambu Chetty St., Madras-1
Editor: S. Sambhu Prasad.



మోడు చెట్లు

—ఫొటో : నీలంరాజు మురళీధర.



రుచికరములగు వంటలు
మంచి స్నేహకారకులు
రుచికరమైనవి
వండేది...
తుషార్
విటమిన్లుగల
వనస్పతి
తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్,
కర్నూలు
పరిశుభ్రం చేయబడిన తుషార్
నూనెకూడా లభ్యం కాగలదు
Tushar
HYDROG